PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 299 | విజయవాడ, గురువారం 1 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 1 June 2023 | Rs

భారత వృద్ధి తగ్గింది

- 2022-23లో 7.2 శాతంగా నమోదు
- తయారీ రంగం డీలా
- మందగించిన గనుల రంగం

లోపలి పేజీలో..



ఫైనల్లో యువ హాకీ జట్టు

లోపలి పేజీలో..

అవినాష్‌రెడ్డికి ముందస్తు బెయిల్

ప్రతి శనివారం సిబిఐ విచారణకు హాజరు కావాలని హైకోర్టు షరతు

వివేకా హత్యలో ప్రమేయాన్ని సిబిఐ రుజువులు చూపలేకపోయింది

తీర్పు సందర్భంగా న్యాయమూర్తి వ్యాఖ్య

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. సిబిఐ అరెస్టు చేయకుండా ఆయనకు న్యాయస్థానం షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు వేసవి సెలవుల ప్రత్యేక ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ ఈ మేరకు బుధవారం 30 పేజీల తీర్పు ప్రకటించారు. ఈ తీర్పుపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు స్పందించాయి. ఆయా పార్టీల నాయకులు తమ అభిప్రాయం తెలియజేశారు. అవినాష్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై మే 27, 28 తేదీల్లో హైకోర్టులో వాదనలు ముగిశాయి. మే 31 వరకు అవినాష్‌పై చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులిచ్చిన కోర్టు.... బుధవారం తన తీర్పు ప్రకటించింది. ముందస్తు బెయిల్‌పై సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం గతంలో ఇచ్చిన ఆదేశాలను ఉటంకిస్తూ న్యాయమూర్తి అవినాష్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. ప్రతి శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సిబిఐ విచారణకు హాజరు కావాలని, విచారణకు సహకరించాలని, దేశం విడిచి వెళ్లరాదని, సాక్షులను ప్రభావితం చేయరాదని కోర్టు షరతులు విధించింది. వీటిని ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు చేయాలని హైకోర్టును సిబిఐ కోరవచ్చని న్యాయమూర్తి తన తీర్పులో స్పష్టం చేశారు.

అవినాష్‌రెడ్డి ముందస్తు బెయిల్‌పై తీర్పు ప్రకటిస్తున్న సమయంలో న్యాయమూర్తి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. వివేకానందరెడ్డి హత్యలో అవినాష్‌రెడ్డి



ప్రమేయం ఉన్నట్టు నిరూపించడంలో సిబిఐ ఒక్క సాక్ష్యం కూడా రుజువు చేయలేదని జడ్జి పేర్కొన్నారు. అప్రూవర్‌గా మారిన వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలం తప్ప, అవినాష్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం లేదన్నారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సమయంలో కొంతమంది తనపై అసందర్భంగా మాట్లాడారని న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు. తీర్పు కాపీలో కూడా న్యాయమూర్తి ఈ విషయాన్ని ప్రస్తావించారు.

హైకోర్టు తీర్పు నేపథ్యంలో అవినాష్ రెడ్డి తరుపున వాదనలు వినిపించిన న్యాయవాదులు మీడియాతో మాట్లాడారు.

వివేకా హత్య కుట్రలో అవినాష్‌రెడ్డి ప్రమేయం లేదన్న తమ వాదనలను కోర్టు సమర్థించిందని చెప్పారు. అప్రూవర్‌గా మారిన వ్యక్తి వెల్లడించిన అంశాలు ప్రామాణికం కాదని, కేసు మెరిట్స్ పరిశీలించాలని తాము ఈ కేసులో మొదటి నుంచీ వాదిస్తున్నామని, చివరకు తమ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించిందని వారు పేర్కొన్నారు.



సిసిటివి కెమెరాల ద్వారా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న గౌతమ్ సవాంగ్

1,962 పోస్టుల భర్తీకి

త్వరలో నోటిఫికేషన్లు

- 3 నుంచి గ్రూప్-1 పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి
- ఎపిపిఎస్‌సి ఛైర్మన్ గౌతమ్ సవాంగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) త్వరలో 1,962 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు విడుదల చేయనుందని కమిషన్ ఛైర్మన్ డి గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వీటిని భర్తీ చేస్తామని చెప్పారు. ఎపిపిఎస్‌సి కార్యాలయంలో కమిషన్ కార్యదర్శి జె ప్రదీప్ కుమార్‌తో కలిసి బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులతోపాటు ఇతర పోస్టుల భర్తీకి సాధారణ పరిపాలనశాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. అనుమతి రాగానే నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. 2019-2023 మధ్య 5,705 పోస్టులకు 54 నోటిఫికేషన్లు విడుదల చేశామని, వీటిలో 4,594 పోస్టులను భర్తీ చేశామన్నారు. కోర్టు కేసుల వల్ల మరికొన్ని పోస్టుల

మిగతా 2లో

డీలిమిటేషన్‌తో దక్షిణాదికే నష్టం

• ఉత్తరాదిలో 84 శాతం • దక్షిణాదిలో 42 శాతం పెరగనున్న సీట్లు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

2026లో జనాభా ప్రాతిపదికన జరిగే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)తో దక్షిణాదికి నష్టంగా పరిణమించనుంది. 46 ఏళ్లుగా నిలిచిపోయిన డీలిమిటేషన్‌ను జనాభా ప్రాతిపదికన చేపడితే.. ఉత్తరాదికి 84 శాతం సీట్లు , దక్షిణాదికి 42 శాతం సీట్లు దక్కుతాయి. మొత్తం మీద చూసు కుంటే ఉత్తరాది రాష్ట్రాలకు, దక్షిణాది కన్నా రెట్టింపు సీట్లు పెరుగుతాయి. గత ఎన్నికల్లో ఈ ఎనిమిది రాష్ట్రాల్లో బిజెపికి 55 శాతం సీట్లు వచ్చాయి.

1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని 1976లో చివరిగా డీలిమిటేషన్ చేశారు. ఆ సమయంలో దేశ జనాభా 54 కోట్లు కాగా ప్రతి 10 లక్షల జనాభాకు ఒక లోక్‌సభ స్థానం అనే ఫార్ములాను ఆమోదించారు. ఈ విధంగా మొత్తం 543 సీట్లను ఖరారు చేశారు.

2011లో దేశ జనాభా దాదాపు 121 కోట్లు. ఆ తరువాత జనాభా లెక్కలు చేపట్టలేదు. అదే జనాభా లెక్కలను 2026లో డీలిమిటేషన్ చేసి, 10 లక్షల జనాభాకు ఒక సీటు అనే ఫార్ములాను ఆమోదించినట్లయితే, దేశవ్యాప్తంగా మొత్తం 1,210 సీట్లు ఉంటాయి.

కొత్త పార్లమెంటు లోక్‌సభలో గరిష్టంగా 888 మంది ఎంపిలు మాత్రమే కూర్చోగలరు. దీన్ని డీలిమిటేషన్ ప్రాతిపదికగా 1,210 సీట్లతో సర్దుబాటు చేస్తే ఉత్తరప్రదేశ్‌లో సీట్లు 80 నుంచి 143కి, బీహార్‌లో 40 నుంచి 79కి పెరిగే అవకాశం ఉంది. రాజస్థాన్‌లో 25 నుంచి 50కి, మధ్యప్రదేశ్‌లో 29 నుంచి 52కి. లోక్‌సభ సీట్లు పెరగవచ్చు. చత్తీస్‌గఢ్ లో 11 నుంచి 19కి, గుజరాత్‌లో 26 నుంచి 43కి, హర్యానాలో 10 నుంచి 18కి, జార్ఖండ్‌లో 14 నుంచి 24కి, మహారాష్ట్రలో 48 నుంచి 76కి, ఒరిస్సాలో 21 నుంచి 28కి, పంజాబ్‌లో 13 నుంచి 18కి, ఉత్తరాఖండ్ లో 5 నుంచి 7కి, పశ్చిమ బెంగాల్‌లో 42 నుంచి 60కి లోక్‌సభ సీట్లు పెరగనున్నాయి.

దక్షిణాదిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో సీట్లు 42 నుంచి 54కి, కర్ణాటక సీట్లు 28 నుంచి 41కి పెరగవచ్చు. తమిళనాడులో ఈ సంఖ్య 39 నుంచి 49కి పెరగనుంది. లోక్‌సభలో సీట్లు పెరిగితే, దాని ప్రభావం ఈశాన్య రాష్ట్రాలపై పెద్దగా ఉండదు. ఎనిమిది రాష్ట్రాలతో కలిపి అక్కడ తొమ్మిది సీట్లు మాత్రమే పెరుగుతున్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, బిజెపి బలంగా ఉన్న అస్సాంలో గరిష్ఠంగా 7 సీట్లు పెరుగుతాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో అస్సాంలో బిజెపికి 9 సీట్లు వచ్చాయి. అస్సాంలో 14 నుంచి 21కి సీట్లు పెరగనున్నాయి.

కేరళ, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, మేఘాలయ, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, గోవా, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో సీట్లు పెరిగే అవకాశం లేదు.

1971 తరువాత దేశంలో ఐదు సార్లు జనాభా గణన జరిగింది. 2021 జనాభా లెక్కల సేకరణ ఇంకా జరగాల్సి ఉంది. చివరిసారిగా 2011లో జనాభా గణన జరిగింది. అప్పుడు దేశ జనాభా 121 కోట్లు ఉంది. అంటే 1971 కంటే 2.25 రెట్లు ఎక్కువ. అయితే లోక్‌సభలో సీట్ల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు. అలాంటప్పుడు 46 ఏళ్ల తరువాత కూడా అదే ఫార్ములాకు ఎందుకు కట్టుబడి ఉన్నారనేది ప్రశ్న. 2019లో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ లోక్‌సభలో 1,000 సీట్లు కావాలని డిమాండ్ చేశారు. ఆదివారం కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోడీ కూడా రానున్న కాలంలో లోక్‌సభలో సీట్లు పెరుగుతాయని చెప్పారు. రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సింగ్, బిజెపి రాజ్యసభ ఎంపి సుశీల్ మోడీ కూడా డీలిమిటేషన్ గురించి ప్రస్తావించారు. అటువంటి పరిస్థితిలో 2026లో డీలిమిటేషన్ చేసే అవకాశం ఉంది.

60-70 దశాబ్దంలో కేంద్ర ప్రభుత్వం జనాభాను నియంత్రించాలని రాష్ట్రాలను పట్టుబట్టింది. జనాభా నియంత్రణలో ఉత్తరాది రాష్ట్రాల కన్నా దక్షిణాది రాష్ట్రాలు చాలా ముందున్నాయి. జనాభాను

మిగతా 7లో

ఇండియా గేట్‌కు నో ఎంట్రీ

- సందర్శకులు నిషేధం...
- భారీగా పోలీసులు మోహరింపు
- రెజ్లర్ల ఆందోళనపై సమాధానం చెప్పకుండా పరుగులు తీసిన కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి



న్యూఢిల్లీ : దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు ఇండియా గేట్ వద్ద నిరవధిక నిరాహార దీక్షకు ప్రణాళికను ప్రకటించిన మరుసటి రోజే, ఢిల్లీ పోలీసులు బుధవారం ఇండియా గేట్‌ను చుట్టుముట్టారు. ఇండియా గేటు చుట్టు ఉన్న గార్డెన్ (పచ్చిక బయళ్ళ)లోకి ప్రజల ప్రవేశాన్ని నిషేధించారు. ఇండియా గేట్ లాన్‌లకు వెళ్లే అండర్‌పాస్ పాదచారులను సైతం వెళ్లనివ్వటంలేదు. ప్రజలు పచ్చిక బయళ్లకు రాకుండా వివిధ ప్రాంతాల్లో పోలీసులను కూడా మోహరించారు. బారికేడ్లకు నో ఎంట్రీ (ప్రవేశం లేదు) బోర్డులను అతికించారు. 'ఇటీవల కురిసిన వర్షాలకు గడ్డి దెబ్బతింది. గడ్డి పెరగటానికి ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఓ అధికారి మొదట బుకాయించారు. తరువాత 'రెజ్లర్లు ఇక్కడ ఆందోళనకు దిగకుండా ఉండేందుకే' నని సెలవిచ్చారు.

ఆ వార్తల్లో నిజం లేదు: ఢిల్లీ పోలీసులు

బ్రిజ్ భూషణ్ పై ఆధారాలు లేవని మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదని ఢిల్లీ పోలీసులు తెలిపారు. సరైన ఆధారాలు దొరకలేదని కొన్ని టీవీ చానళ్లు చెప్తున్నాయనీ, అందులో వాస్తవం లేదని తెలిపారు.

ఈ ఆరోపణలపై దర్యాప్తు జరుగుతోందని తెలిపారు. తుది నివేదికను కోర్టుకు సమర్పిస్తామన్నారు.

2న డిసిడబ్ల్యు ముందు హాజరుకండి

ఢిల్లీ మహిళా కమిషన్ (డిసిడబ్ల్యు) ముందు హాజరుకావాలని న్యూఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డిసిపి) ప్రణవ్ తాయల్‌కి డిసిడబ్ల్యు ఛైర్ చీఫ్ స్వాతి మాలివాల్ సమన్లు జారీ చేశారు. డబ్ల్యుఎఫ్ఐ చీఫ్‌కు మైనర్ గుర్తింపును వెల్లడించే చర్యతో ఏమైనా సంబంధం ఉందా లేదా? అనే విచారణ కాపీతో జూన్ 2న కమిషన్ ముందు హాజరు కావాలని కోరారు. "ఈ కేసులో నిందితుడు (సింగ్) అత్యంత ప్రభావశీలుడు. ఇప్పటి వరకు అరెస్టు చేయబడలేదు. కేసు సున్నితత్వం, ప్రాణాలతో బయటపడిన వారికి, ముఖ్యంగా

మిగతా 7లో

కౌలు చట్టసవరణ కోరుతూ..

7 నుంచి జీపు యాత్రలు

- 10 నుంచి పాదయాత్ర
- ఎపి కౌలు రైతుల సంఘం

లోపలి పేజీలో..



8న రాష్ట్రాన్ని పలకరించనున్న

రుతుపవనాలు

ఆజ్యం పోసింది పాలక పెద్దలే

- మణిపూర్ సిఎంపైనా, ఎంపీపైనా దర్యాప్తు చేపట్టాలి
- గిరిజన ఫోరం డిమాండ్



న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసాగ్నికి ఆజ్యం పోషింది పాలక పెద్దలేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్ బీరేన్ సింగ్‌కు, బిజెపి రాజ్యసభ సభ్యులు లెయిసెంబా సనజావోబాకు ప్రమేయముందని తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో హింసాకాండకు ఆజ్యం పోడయంలో వీరిద్దరి పాత్రపై దర్యాప్తు జరిపించాలని మణిపూర్ గిరిజనుల ఫోరం - ఢిల్లీ (ఎంటిఎఫ్‌డి) బుధవారం నాడు డిమాండ్ చేసింది. మణిపూర్ గత మే నెల 3న రెండు ప్రధాన ఆదివాసీ తెగలైన మేయితేయి కమ్యూనిటీ, కుకి - జోమి కమ్యూనిటీ మధ్య రాజుకున్న ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో రాష్ట్రంలో తీవ్ర అశాంతి నెలకొంది. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో తక్షణమే జోక్యం చేసుకొని మణిపూర్‌లో శాంతిపునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరుతూ ఎంటిఎఫ్‌డి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ సందర్భంగా ఎంటిఎఫ్‌డి ప్రధానకార్యదర్శి డబ్ల్యుఎల్ హంసాసింగ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుకి-జోమి కమ్యూనిటీ డిమాండ్ చేస్తున్న విధంగా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని కోరారు. వీరికి ప్రత్యేక పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రక్రియను మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మణిపూర్‌లో పర్యటించి శాంతిస్థాపనకు చర్యలు తీసుకుంటామని చెబుతున్నా అక్కడ అశాంతే నెలకొందని, ఇప్పటికీ అతివాద మేయితేయి కమ్యూనిటీకి హింసాకాండకు పాల్పడుతూనేవుందని విమర్శించారు. అతివాద గ్రూపు చేతిలో హత్యకు గురై వివిధ ఆసుపత్రుల్లో ఉంచిన మృతదేహాలు చెదిరిపోకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు.

మణిపూర్‌లో కుకి, జోమి, మిజో, హమర్ కమ్యూనిటీలను అతివాద మేయితేయి గ్రూపులే ఎగదోస్తున్నాయని డబ్ల్యుఎల్ హంసాసింగ్ తెలిపారు. ఇంఫాల్ లోయలో ప్రభుత్వ బలగాల నుంచి ఆయుధాలను కొల్లగొట్టి హింసకు పాల్పడే అరంబై తెంగ్గోల్, మేయితేయి లీపున్ వంటి

మిగతా 7లో

టపాసుల గోదాంలో పేలుడు

• ముగ్గురు కార్మికులు దుర్మరణం • మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం (తిరుపతి జిల్లా)

టపాసుల తయారీ సమయంలో నల్లమందు పేలి ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతి జిల్లాలో బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... వరదయ్యపాలెం మండలం శాతంబేడు గ్రామ సమీపంలో వీరయ్య అనే వ్యక్తి టపాసుల గోదాము నిర్వహిస్తున్నాడు. దీనికి లైసెన్స్ ఉంది పరిసర ప్రాంతాల్లో శుభకార్యాలు జరిగినా, ఎవరైనా చనిపోయినా, ఇతరత్రా కార్యక్రమాలకు ప్రజలు ఇక్కడ టపాసులు కొనుగోలు చేస్తుంటారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో చాలాచోట్ల జాతరలు, తిరునాళ్లు ఉండడంతో ఆర్డర్లు ఎక్కువయ్యాయి. దీంతో, అత్యాశకుపోయి ఎటువంటి అనుమతులూ లేకుండా పెద్ద మొత్తంలో నల్లమందును దిగుమతి చేసుకొని అనధికారికంగా పెద్ద ఎత్తున టపాసుల తయారీ చేయిస్తున్నాడు. ఇందుకోసం గూడూరు ప్రాంతానికి చెందిన ఏడుకొండలు (41), ఎలకట్టవ గ్రామానికి చెందిన శంకరయ్య (45), నాగేంద్ర (30), గ్రామ వలంటీర్ కల్యాణ్‌లను పనిలో పెట్టుకున్నాడు. గోదాములో టపాసుల తయారీ సమయంలో పేలుడు సంభవించి ఏడుకొండలు, శంకరయ్య, నాగేంద్ర అక్కడికక్కడే దుర్మరణం చెందారు. పేలుడు ధాటికి వారి మృతదేహాలు తునాతునకలై చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వీరయ్య, కల్యాణ్ పరిస్థితి విషమంగా ఉంది. పేలుడు స్వభావం కలిగిన నల్లమందును నిల్వ చేయడంలోనూ, టపాసుల తయారీలోనూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే పేలుడు సంభవించిందని స్థానికులు చెప్తున్నారు. అగ్నిమాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగార్జునరెడ్డి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శివకుమార్‌రెడ్డి తెలిపారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలి : సిపిఎం

మృతుల కుటుంబాలకు తగిన నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరింది. ముగ్గురు మృతి చెందడం పట్ల తీవ్ర సంతాపం తెలియజేసింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారణాలపై అధికారులు పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలని సిపిఎం తిరుపతి జిల్లా నాయకులు దాసరి జనార్థన్ కోరారు. అనుమతి లేకుండా టపాసుల తయారీ జరుగుతున్నా పట్టించుకోని సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగు రోజుల పర్యటన కోసం

భారత్‌కు నేపాల్ ప్రధాని

న్యూఢిల్లీ : నాలుగు రోజుల పర్యటన కోసం నేపాల్ ప్రధానమంత్రి పుష్ప కమల్ దహల్ 'ప్రచండ' బుధవారం భారత్‌కు చేరుకున్నారు. భారత్-నేపాల్ సంబంధాల మెరుగుదలకు ఈ పర్యటన తోడ్పడుతుందని భావిస్తున్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ప్రధాని పదవి చేపట్టిన 68 ఏళ్ల ప్రచండకు ఇదే మొదటి విదేశీ పర్యటన కావడం విశేషం. ఢిల్లీ విమానాశ్రయంలో ప్రచండకు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి స్వాగతం పలికారు. నేపాల్ ప్రధాని వెంట ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం వచ్చింది. గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ప్రచండ చర్చలు జరపనున్నారు. ఇరుదేశాలు పలు ఒప్పందాలపై సంతకాలు చేయనున్నాయి. అలాగే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనకర్‌లతో కూడా ప్రపంచ సమావేశాల్లో పాల్గొననున్నారు. శుక్రవారం ఇండోర్‌కు వెళ్లి, తరువాత రోజున నేపాల్‌కు ప్రచండ బయలుదేరనున్నారు.

పర్మినెంట్ చేయాల్సిందే

- మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై ఇచ్ఛాపురం, హిందూపురం నుంచి రాష్ట్ర జాతాలు ప్రారంభం
- మోసగిస్తున్న ప్రభుత్వం : సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు



హిందూపురంలో జాపు జాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ఒక జాతా, శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం నుంచి మరో జాతా బుధవారం ప్రారంభమయ్యాయి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, మున్సిపల్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, పాదయాత్ర, ఎన్నికల సమయంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ రాష్ట్ర జాతాలను చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జాతాను జెండా ఊపి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు హామీలను ఇచ్చారని తెలిపారు. వీటిని అమలు చేయకుండా మోసగించడం తగదన్నారు. పిఆర్‌సిలో ప్రారంభ వేతనం రూ.22 వేలు ఉంటే, మున్సిపల్ కార్మికులకు రూ.15 వేలే ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. ఆప్కాస్‌లో కార్మికులందరినీ ఉద్యోగులుగా నమోదు చేశారు తప్ప, ఉద్యోగులకు ఇచ్చే ఏ ఒక్క సౌకర్యాన్నీ అమలు చేయడం లేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారికి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రభుత్వం ఎసరు పెట్టిందని తెలిపారు. కార్మికులకు, ఉద్యోగులకు, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే వచ్చే ఎన్నికల్లో వారు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కరోనా కాలంలో

మిగతా 2లో

చిన్నారులను కాపాడబోయి.. ఇద్దరు మహిళలు మృతి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులో పెన్నా నది రివిట్‌మెంట్ గోడ నిర్మాణం కోసం తీసిన గుంటల్లో ప్రమాదవశాత్తు పడిపోయిన ఇద్దరు చిన్నారులను కాపాడబోయే క్రమంలో ఇద్దరు మహిళలు మరణించారు. ఈ ప్రమాదం నెల్లూరు వెంకటేశ్వరపురంలోని భగత్‌సింగ్ కాలనీ 54వ డివిజన్‌లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. పెన్నా నది రివిట్‌మెంట్ గోడ నిర్మాణం కోసం సుమారు 25 అడుగుల గుంత తీశారు. కాలనీకి చెందిన ఎస్‌కె సబిహ (25), షాహినా (25)కు చెందిన ఇద్దరు చిన్నారులు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు గుంతలో పడిపోయారు. వారిని కాపాడేందుకు ఇద్దరు తల్లులు గుంతలోకి దూకారు. స్థానికులు గమనించి ఇద్దరు చిన్నారులను కాపాడారు. గుంతలోతుకు వెళ్లిపోయిన మహిళలిద్దరూ ఊపిరాడక మరణించారు. సిసిఎం, టిడిపి నాయకులు ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. రక్షణ సౌకర్యాలు, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని నాయకులు తెలిపారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేసే వరకూ మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించరాదని అడ్డుకున్నారు. కలెక్టర్ జోక్యం చేసుకొని బాధిత కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. ఆందోళనను కొనసాగిస్తూనే ఉన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వ్యవస్థల్ని మేనేజ్ చేస్తోన్న సిఎం

- **అవినాష్‌కు తాత్కాలిక ఉపశమనమే**
- **టిడిపి నేతలు బోండా, వర్ల**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సిఎం వైఎస్ జగన్ వ్యవస్థల్ని మేనేజ్ చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, వర్ల రామయ్య ఆరోపించారు. జగన్ పలుకుబడి, ప్రభావం, అధికారం ముందు సిబిఐ చేసిందంతా తుడిచిపెట్టుకుపోయిందనే అనుమానం ప్రజలకు కలుగుతోందని తెలిపారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. తనను తాను కాపాడుకోవడానికే అవినాష్‌కు జగన్ తాత్కాలికంగా యాంటిసిపేటరీ బెయిల్ ఇప్పించుకోగలిగే వరకు వెళ్లారని విమర్శించారు. వివేకా కేసులో ముద్దాయిలుగా చెప్పబడుతున్న వారి పాత్రకు సంబంధించి తిరుగులేని సాక్ష్యాలు సిబిఐ వద్ద ఉన్నాయని, ఇది వాస్తవమని చెప్పారు. కేసు విచారణను అడ్డుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సిబిఐని బెదిరించినట్లు దేశంలో ఏ ప్రభుత్వమూ బెదిరించలేదని విమర్శించారు. జగన్ ఎన్నిసార్లు ఢిల్లీ వెళ్లినా ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వేజోన్, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ గురించి ఏనాడూ ప్రస్తావించలేదని అన్నారు. అవినాష్ రెడ్డి బెయిల్ పిటిషన్ చూశాక ఐపిసి 302పై సమీక్ష చేయాల్సిందేనని అనిపిస్తోందన్నారు.

మహిళా ఆరోగ్య కార్యకర్తకు సాధారణ బదిలీలు

- **యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్యశాఖ సాధారణ బదిలీల్లో మహిళా ఆరోగ్య కార్యకర్త(ఎంపిహెచ్ఎ(ఎఫ్))లకు సాధారణ బదిలీలకు అనుమతించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ కోరింది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబుకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి వెంకటేశ్వర్లు, జె జగన్‌మోహన్‌రావు బుధవారం లేఖ రాశారు. వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలకు అనుమతించిన జిఓ 399లో ఎంపిహెచ్ఎ(ఎఫ్)కు మ్యూచువల్ మాత్రమే చేపట్టాలని ఉందని పేర్కొన్నారు. దీనివల్ల ఐదేళ్ళ పైబడి సుదూర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి మ్యూచువల్ ఇవ్వడానికి ఎవరు కూడా ముందుకు రావడం లేదని తెలిపారు.

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు చాలా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. జోన్-1లో ఎంపిహెచ్ఎ(ఎఫ్)లకు ఎంపిహెచ్ఎస్(ఎఫ్)లుగా త్వరగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బందికి ఎఫ్‌టిఎలు కూడా చెల్లించాలని కోరారు. కొత్తగా అనుమతించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీలను కూడా సాధారణ బదిలీల ద్వారా భర్తీ చేసేందుకు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

కౌలు చట్టసవరణ కోరుతూ..

7 నుంచి జీపు యాత్రలు

- **10 నుంచి పాదయాత్ర**
- **ఎపి కౌలు రైతుల సంఘం**



జీపు యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కౌలు చట్టసవరణ కోరుతూ.. ఈ నెల 7 నుంచి మొదలయ్యే జీపు యాత్రలు, 10 నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం పిలుపునిచ్చింది. 7 నుంచి నెల్లూరు, అనకాపల్లి జిల్లాల నుంచి జీపు యాత్రలు, 10న కృష్ణా జిల్లా తోటవల్లూరు నుంచి పాదయాత్ర మొదలవుతుందని పేర్కొంది. ఈ పాదయాత్ర, జీపు యాత్రలు జూన్ 12 నాటికి మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వంతో రాయబార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపింది. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎపి కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సూర్యనారాయణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు పి రంగారావు మాట్లాడారు. వ్యవసాయ రంగంలో కౌలురైతులే కీలకమని అన్నారు. మొత్తం సాగుచేస్తున్న వారిలో 70 శాతం మంది కౌలు రైతులే వున్నారని పేర్కొన్నారు. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చాకే వ్యవసాయంలో నష్టాలు రావడం మొదలయ్యాయని తెలిపారు.

కౌలు రైతుల్లో ఎక్కువగా దళితులు, వెనకబడిన తరగతులవారే వున్నారన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఎక్కువగా కౌలు రైతులవేనని అన్నారు. గతంలో కౌలు రైతులకు రక్షణ కల్పించేందుకు వున్న రక్షణ చట్టాలను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు. భూ యజమాని సంతకం వుంటేనా కౌలు అర్హత కార్డులు ఇస్తామని ప్రభుత్వం చట్టాన్ని మార్చడంతో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. విత్తన, ఎరువుల సబ్సిడీ, పంటనష్ట పరిహారం కౌలు రైతులకే ఇచ్చేలా చట్టసవరణ చేయాలన్నారు. రైతులతో ప్రమేయం లేకుండా ప్రభుత్వం కౌలు కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రూ.25 వేలను రైతు భరోసాగా ఇవ్వాలన్నారు. కేరళ తరహా రుణవిముక్తి చట్టాన్ని రాష్ట్రంలో తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై జరిగే పాదయాత్ర, జీపు యాత్రలను జయప్రదం చేయాలని వారు కోరారు.

మినీ మేనిఫెస్టోతో జగన్ పాలనకు అంతం

- **టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మహానాడు వేదికగా భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో టిడిపి ప్రకటించిన మినీ మేనిఫెస్టో జగన్ దుష్టపాలనకు ముగింపు పలకబోతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు విమర్శించారు. సంక్షేమం ప్రారంభమైందే ఎన్‌టి రామారావు, టిడిపితో అని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంక్షేమం అభివృద్ధి, సామాజిక న్యాయంతో టిడిపి ముందుకు వెళ్తుంటే, లూటీ కోసం అప్పులు చేయడం, రాష్ట్రాన్ని దోచుకోవడమే అజెండాగా జగన్ నాలుగేళ్లుగా పాలన సాగుతోందని విమర్శించారు. మహిళలు, రైతులు, యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ తమ నాయకుడు చంద్రబాబు మేనిఫెస్టో ప్రకటించారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆ రోజు నుంచి వైసిపి నాయకులు, సిఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని పేర్కొన్నారు. జగన్ ఇచ్చిన హామీలు కూడా అమలు చేశారని, విద్యుత్ ఛార్జీలు 8 సార్లు పెంచుతానని హామీ ఇవ్వకపోయినా పెంచారని ఎద్దేవా చేశారు. ఇసుకకు ధర నిర్ణయించి రూ.వేలకోట్లు దోచుకుంటామని మేనిఫెస్టోలో ఉందా? అని ప్రశ్నించారు.

కీలకాంశాలు విచారించడంలో సిబిఐ విఫలం

- **జగన్‌ను రాజకీయంగా ఎదర్కోలేకే దుష్ప్రచారం**
- **సజ్జల రామకృష్ణారెడ్డి**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో సిబిఐ అన్ని కోణాల్లో విచారణ చేయకుండా, కేవలం అవినాష్‌రెడ్డిని ఇరికించేందుకే అన్నట్లుగా విచారణ సాగుతోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. అవినాష్‌రెడ్డికి వ్యతిరేకంగా ఒక్క ఆధారం లేకున్నా ప్రభుత్వాన్ని, జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేసేందుకు అన్నట్లుగా సిబిఐ వ్యవహరించిందని విమర్శించారు. అవినాష్‌రెడ్డికి బెయిల్ వచ్చిన నేపథ్యంలో తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం సజ్జల మీడియాతో మాట్లాడారు. అవినాష్‌రెడ్డి కేసులో రాష్ట్రంలో ప్రతిపక్షం వ్యవహరించిన తీరు బరితెగింపు ధోరణి అని కోర్టే కామెంటు చేసిందని పేర్కొన్నారు. విచారణను పక్కదారి పట్టించేలా, దర్యాప్తును ప్రభావితం చేసేలా ప్రతిపక్షం వ్యవహరించిందన్నారు. సిఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఇటువంటి పనులు చేస్తున్నారని, వ్యవస్థను కించపరిచేలా దుష్ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్జికి దురుద్దేశాలు ఆపాదించారని అన్నారు. జగన్ ఢిల్లీ పర్యటలపై కూడా దుష్ప్రచారం చేశారన్నారు. అప్పట్లో వివేకానందరెడ్డి పార్టీలో చేరతానంటే జగన్ ఆహ్వానించారని గుర్తు చేశారు. పార్టీలో ఎవరికి టికెట్లు ఇవ్వాలనే విషయంలో జగన్‌దే తుది నిర్ణయమని అన్నారు. ఈ హత్య కేసులో ఎక్కడా రాజకీయ కోణం లేదన్నారు. వివేకానందరెడ్డి రాసిన లేఖను దాచిపెట్టాలని అల్లుడు రాజశేఖర్‌రెడ్డి చెబితే, ఆ వైపుగా విచారణ లేదన్నారు. హత్య వెనక ఆస్తికి సంబంధించి వివాదాలు వున్నాయన్న అంశమూ అందరికీ తెలిసిందేనని అన్నారు. అందుకే సిబిఐ విచారణ అంశంపై కోర్టు అసహనం వ్యక్తం చేసిందన్నారు.

8 లోపు రాష్ట్రానికి రుతుపవనాలు

- **తుపానులు, వరదలు ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి**
- **అధికారులకు సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశం**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నైరుతి రుతుపవనాలు ఈ నెల 8 నాటికి రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వాతావరణశాఖ అంచనా వేసిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 4 నాటికి కేరళ రాష్ట్ర తీరాన్ని తాకి 12 నాటికి ఆంధ్రప్రదేశ్ అంతటా విస్తరించే వీలుందన్నారు. రుతుపవన కాలంలో సంభవించబోయే తుపానులు, వరదలను సమర్ధవంతంగా ఎందుర్కొనేందుకు వెంటనే తగిన కార్యాచరణ ప్రణాళికలతో అన్ని విధాలా పూర్తి సన్నద్ధతో ఉండాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నైరుతి రుతుపవనాల సన్నద్ధతపై సచివాలయంలో వివిధ శాఖలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సముద్రతీర ప్రాంత మండలాలు, నదీ పరివాహక ప్రాంతాల మండలాల్లో ప్రత్యేకంగా ముందస్తు ఏర్పాట్లతో అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని జవహర్‌రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, మత్స్య, జల వనరులు, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, వైద్యారోగ్య తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పూర్తి సన్నద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేందుకు వీలుగా అవసరమైన పరికరాలు, ఇతర సామగ్రిని పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. గతేడాది తిరుపతి నగరంలో అండర్‌పాస్ వద్ద నీరు నిలిచి ప్రాణ నష్టం జరిగిందని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

బలహీనంగా ఉన్న ఏటి, కాలువ, రిజర్వాయర్ల గట్లు, రహదారులపై ఉన్న కల్వర్టులను తనిఖీ చేసి వాటి పటిష్టతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఎన్‌డిఆర్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, కోస్టుగార్డు, రైల్వే, టెలీకమ్యూనికేషన్స్ వంటి సంస్థలు విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు సన్నద్ధతతో ఉండాలని సూచించారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయిప్రసాద్ రుతుపవనాల సన్నద్ధత ఏర్పాట్లపై శాఖల వారీ చేపట్టాల్సిన చర్యలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మెన్ మెటీరియల్‌ను ముందుగానే సిద్ధం చేసుకుని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బందికి తగిన శిక్షణ సహాయ చర్యలకు సంబంధించి తగిన టీమ్‌లను ఏర్పాటు చేసుకుని అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, శాంతి భద్రతల విభాగం అదనపు డిజిపి శంకభత్ర బాగ్చి, ఎపిఎస్‌పి ఎస్‌డిఆర్ఆఫ్ డిఐజి రాజకుమారి, కార్యదర్శి పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పతకాలు, అవార్డులు అందుకున్న నేవీ సిబ్బందితో హరికుమార్

నౌకాదళ బలోపేతానికి కృషి

- **భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ హరికుమార్**

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నౌకాదళ బలోపేతానికి తగిన ప్రణాళికలతో మరింత కృషి చేయనున్నట్లు భారత నౌకాదళ అధిపతి అడ్మిరల్ ఆర్.హరికుమార్ తెలిపారు. తూర్పు నౌకాదళ ఇన్వెస్టిచర్ వేడుకలు బుధవారం ఐఎన్ఎస్ సర్కార్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా భారత రాష్ట్రపతి తరుపున హరికుమార్ హాజరై నౌకాదళ సిబ్బందికి విశిష్ట సేవా పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత నౌకాదళం జాతీయ సముద్ర ప్రయోజనాలను సంరక్షించడానికి శాయశక్తులా కృషి చేస్తోందన్నారు. సిబ్బంది, అధికార యంత్రాగం అహర్నిశలూ కష్టపడుతూ తిరుగులేని వృత్తి నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని తెలిపారు. దేశంలోని తీర ప్రాంతాన్ని కాపాడేందుకు తమ సిబ్బంది ఎల్లవేళలా పనిచేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో భారత నావికా దళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామని తెలిపారు. అవార్డులు పొందిన నావికులు మరింత ఉత్సాహంగా పనిచేయాలన్నారు.

పతకాలు అందజేత

ఈ వేడుకలో మొత్తం 13 నౌ సేనా పతకాలు, 16 విశిష్ట సేవా పతకాలు, 2 జీవన్ రక్ష పతకాలతో సహా 33 అవార్డులను హరి కుమార్ నౌకాదళ సిబ్బందికి అందజేశారు. వీటితోపాటు వెపన్ ఇంప్రూవ్‌మెంట్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ రంగంలో మార్గదర్శక పరిశోధన కోసం ఉద్దేశించిన లెఫ్టినెంట్ వికె జైన్ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను, విమాన భద్రతను ప్రోత్సహించినందుకు ఇచ్చే కెప్టెన్ రవిధీర్ మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను పలువురికి అందజేశారు. భారత నౌకాదళ నౌకలు బెట్వా, సత్పురా, సట్లేజ్, నిరీక్షక్, కల్వరికి అవార్డులు దక్కాయి. ఈ వేడుకలకు నౌకాదళ ఉద్యోగులు, వారి కుటుంబీకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మండల పరిషత్తు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా వున్న మండల పరిషత్తు అధ్యక్షులు, ఉపాధ్యక్షులతోపాటు గ్రామ పంచాయతీలలోని ఉపసర్పంచ్ పదవుల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనరు నీలం సహాని బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 4న సభ్యులకు నోటీసులు ఇచ్చి 8 ఉదయం 11 గంటలకు సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో మూడు మండల పరిషత్తు అధ్యక్షులు, ఎనిమిది ఉపాధ్యక్ష స్థానాలకు ఈ ఎన్నికల ప్రక్రియ జరగనుందని తెలిపారు. నెల్లూరు జిల్లాలోని రాపూర్, అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, సత్యసాయి జిల్లాలోని బత్తులపల్లి ఎంపిపిలకు ఎన్నిక జరగాల్సి వుంది. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా 49 గ్రామ పంచాయతీల్లోని ఉపసర్పంచ్‌లకు ఈ ఎన్నికలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేశారు.

వార్డు శానిటేషన్ సెక్రటరీలకు పనిభారం తగ్గించాలి

- **సచివాలయాల ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలోని శానిటేషన్ సెక్రటరీలకు పనిభారాన్ని తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం సంక్షేమ సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు కె అనురాధ, ఎం గురుస్వామి వార్డు, సచివాలయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో శానిటేషన్ కార్యదర్శులకు విపరీతమైన పనిభారం పెరిగిందని పేర్కొన్నారు. ఈ పనిభారానికి తోడు అధికారుల ఒత్తిళ్లు పెరిగిపోయాయని తెలిపారు. జాబ్‌చార్టు లేకుండా రకరకాల పనులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. క్లాప్ కార్యక్రమంలో యూజర్ ఛార్జీల వసూళ్ల పనికి లక్ష్యాలను పెట్టడం సరైందికాదని తెలిపారు. లక్ష్యాలను చేరుకోలేకపోతే వేతనంలో కోతలు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం, రెండో శనివారం వంటి సెలవులు కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని పేర్కొన్నారు. పనిచేసేందుకు నిర్దేశిత సమయాన్ని పాటించకుండా తెల్లవారుజామున 5 గంటల నుంచి సాయంత్రం వరకు పనిచేయిస్తున్నారని తెలిపారు. ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక శానిటేషన్ సెక్రటరీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇటీవల ముగ్గురు శానిటేషన్ సెక్రటరీలు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అన్ని రకాల గ్రామ, వార్డు సచివాలయాల తరహాలో శానిటేషన్ సెక్రటరీలు జాబ్‌చార్టు పెట్టి విధులు అప్పగించాలని డిమాండ్ చేశారు.

ఎసిబి వలలో మున్సిపల్ ఎఇ, గ్రామ కార్యదర్శి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎసిబి ఏర్పాటుచేసిన కాల్ సెంటర్ 14400కు వచ్చిన ఫిర్యాదుల మేరకు ఒక మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీరును, పంచాయతీ కార్యదర్శిని బుధవారం ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా, పిఠాపురం మండలం, సురవరపువారి వీధికి చెందిన కాంట్రాక్టరు ఎస్ సత్తిరాజు నుంచి బిల్లులను ఎంబుక్‌లో రికార్డు చేసేందుకు పిఠాపురం మున్సిపాలిటీ ఎఇ అభిషేక్ రూ.40 వేలు డిమాండ్ చేసిన కేసులో ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, పాలమూరుకు చెందిన బాధితుడు పంచదార వెంకట రంగారావు.. గ్రామంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ప్రాసెస్ చేసేందుకు గ్రామ కార్యదర్శి పార్థసారథి రూ.16 వేలు లంచం అడిగిన కేసులో బాధితుడు రూ.4 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడులు చేశారు. ఈ రెండు కేసుల్లో అవినీతికి పాల్పడ్డ వారిని ఎసిబి అధికారులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు.


శస్త్ర చికిత్స చేసిన రోగులతో రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి

జిజిహెచ్‌లో లివర్ మార్పిడికి కసరత్తు

- **సిఎం సహాయ నిధితో 150 మందికి చెన్నైలో శస్త్ర చికిత్స**

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చెన్నై, హైదరాబాద్ కేంద్రంగా జరుగుతున్న లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు త్వరలో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సిఎం సహాయనిధి ద్వారా చెన్నైలోని గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీలో 150 మందికి లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించిన సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం చెన్నై, హైదరాబాద్‌లలో జరుగుతున్న లివర్ మార్పిడి శస్త్ర చికిత్సలు సిఎం సహాయనిధి ద్వారా గుంటూరులో నిర్వహించేందుకు పలువురు వైద్యులు, గ్లెనీగల్స్ గ్లోబల్ ఆస్పత్రి నిర్వాహకులు ముందుకొచ్చారని తెలిపారు. ఆరోగ్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. గ్లెనీగల్స్ గ్లోబల్ హెల్త్ సిటీ (చెన్నై)కి చెందిన ప్రముఖ వైద్యులు రజనీకాంత్, మార్కెటింగ్ హెడ్ వాకా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు 150 మందికి సిఎం సహాయ నిధితో లివర్ మార్పిడి చేసినట్టు తెలిపారు. వీరిలో నెలలు వయస్సు కలిగిన పసిపిల్లలు కూడా ఉన్నారన్నారు. సదస్సులో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బిజెపిని గద్దెదించాలి

- **బ్రిజ్ భూషణ్‌కు ఆశ్రయమివ్వడం శోచనీయం : సిపిఎం**

ప్రజాశక్తి-విజయవాడ

బ్రిజ్ భూషణ్ లాంటి కీచకులకు ఆశ్రయమిస్తూ, ఆడపిల్లలను అవమానాలపాలు చేస్తోన్న బిజెపిని గద్దెదించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ క్రీడల్లో భారతదేశ గౌరవాన్ని నిలబెట్టి పథకాలు సాధించిన మల్ల యోధులు గత నెల రోజులుగా బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు తాళలేక ఆందోళన చేస్తున్నా వారి కోర్కెలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని పేర్కొన్నారు. వారిపై దౌర్జన్యాలు చేయడం, జంతర్ మంతర్‌లో దీక్షకు అనుమతించకుండా గెంటేయడం వంటి దుర్మార్గాలకు తెగబడిందని తెలిపారు. దీంతో విసుగెత్తిన క్రీడాకారులు వారికి వచ్చిన పథకాలను గంగలో కలిపేందుకు కూడా సిద్ధపడినా ప్రభుత్వం చలించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రభుత్వం అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదని తెలిపారు. ఇలాంటి పార్టీని భుజానికి ఎత్తుకొని రాష్ట్రాల్లోని ప్రాంతీయ పార్టీలు ఊరేగడం సిగ్గుచేటని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో కనీసం బిజెపి పేరు ఎత్తడానికి సాహసించలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని తెలిపారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీని టిడిపి ఎందుకు సహిస్తుందో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు బిజెపిని దూరంగా పెట్టి ఆడ పిల్లల ఆత్మాభిమానాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యాభివృద్ధికి వినూత్న ఆలోచనలు

- **సమగ్ర శిక్షా డైరెక్టరు బి శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాల్యదశ నుంచే పిల్లల్లో విద్యాభివృద్ధి పెంపొందించడానికి, పాఠశాల అభివృద్ధి కోసం వినూత్న ఆలోచనలు సృష్టించాలని సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఎ) ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టరు బి శ్రీనివాసరావు అన్నారు. దీనికోసం క్షేత్రస్థాయిలో ప్రణాళిక వేసుకుని, నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్షిక పని ప్రణాళిక, బడ్జెట్ అంశంపై జరిగిన వర్క్‌షాపునకు బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న మూడేళ్లలో ఫౌండేషన్ స్కూళ్ల అభివృద్ధి చెందేలా విద్యార్థుల్లో అభ్యసనాంతరాలను గుర్తించి వారికి, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలన్నారు. పాఠశాల స్థాయి ప్రణాళికలో తల్లిదండ్రుల కమిటీని కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ వర్క్‌షాపులో నేర్చుకున్న విషయాలను జిల్లా, మండల స్థాయిలో కూడా అవగాహన కల్పించాలని, అవసరమైన శిక్షణ కరదీపికలను రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎ జాయింట్ డైరెక్టరు సిహెచ్ వాసుదేవరావు, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి బి విజయ్ భాస్కర్, సత్వా-కైవల్య సంస్థ ప్రతినిధులు ఆకాంక్ష, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాల్సిందే

మొదటి పేజి తరువాయి

మున్సిపల్ వర్కర్లను ఫ్రంట్ లైన్ వర్కర్లుగా పేర్కొన్న ప్రభుత్వం, విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.50 లక్షల పరిహారం చెల్లించకుండా మోసం చేసిందన్నారు. జాతాలో ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి ఎస్.జ్యోతిబసు, ఉపాధ్యక్షులు ఎన్.వై నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు టి.నూకరాజు, టి.వెంకటరావు, నాయకులు జి.లక్ష్మి, బి.వరలక్ష్మి, జె.నాయుడు, సిఐటియు జిల్లా శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ జాతా అక్కడి నుంచి పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస మున్సిపాల్టీ, పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ, పార్వతీపురం, విజయనగరం జిల్లా బొబ్బిలి వరకూ తొలిరోజు సాగింది.

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో రాష్ట్ర స్థాయి జీపు జాతాను ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. పెరిగిన పట్టణ జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచడం లేదని తెలిపారు. కార్మికులందరికీ 010 పద్దు ద్వారా జీతాలివ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జగదీష్ అధ్యక్షత వహించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, నాగేంద్రకుమార్, సత్యసాయి జిల్లా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడ్‌పి శ్రీనివాసులు, ఇఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ జాతా మొదటి రోజు పెనుకొండ, పట్టపర్తి, ధర్మవరం మీదుగా అనంతపురం చేరుకుంది. ఈ రెండు జాతాలూ జూన్ ఎనిమిదిన విజయవాడ చేరుకోనున్నాయి. మున్సిపల్ కార్మికులతో అదే రోజు అక్కడ భారీ బహిరంగ సభ జరగనుంది.

1,962 పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్లు

మొదటి పేజి తరువాయి

భర్తీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. గ్రూప్-1 ప్రధాన పరీక్షలు ఈ నెల 3 నుంచి జరగనున్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ పూర్తిచేశామని, పరీక్ష కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. 111 పోస్టుల భర్తీకి ఈ నెల 10 వరకు ఉదయం 10 నుంచి 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,455 మంది అభ్యర్థులు ప్రిలిమ్స్ నుంచి మెయిన్స్‌కు అర్హత సాధించారని చెప్పారు. రాష్ట్రంలో 10 ప్రాంతాల్లో 11 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలులో పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను గురువారం నుంచి ఏర్పాటు చేస్తామని చెప్పారు. మొట్ట మొదటిసారి ఎపిపిఎస్‌సి ఎగ్జామ్ కమాండ్ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని, ఎపిపిఎస్‌సి కార్యాలయం నుంచి వీటిని పర్యవేక్షిస్తామని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8:30 నుంచి 9:30లోపు చేరుకోవాలని తెలిపారు. 15 నిమిషాలు గ్రేస్ పిరియడ్ ఉంటుందని వెల్లడించారు. 9:45 నిమిషాలలోపు ఉన్నవారిని మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తామని, ఆ తరువాత అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు బయోమెట్రిక్ రిజిస్ట్రేషన్, ఫేస్ రికగ్నేజేషన్‌ను తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సభ్యులు ఎస్ సలం బాబు, పి సుధీర్ పాల్గొన్నారు.

నేడు కర్నూలులో సిఎం పర్యటన

- పత్తికొండలో వైఎస్ఆర్ రైతు భరోసా పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం కర్నూలు జిల్లాలో పర్యటించనున్నారు. పత్తికొండలో నిర్వహించే వైఎస్ఆర్ రైతు భరోసా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఉదయం 8 గంటలకు గన్నవరం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా పత్తికొండకు, అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా సెయింట్ జోసఫ్ కళాశాల మైదానంలోని సభాప్రాంగణానికి చేరుకుంటారు. బహిరంగ సభలో ప్రసంగించిన అనంతరం రైతు భరోసా మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. సిఎం పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను జిల్లా అధికారులు పూర్తి చేశారు. ఏర్పాట్లను సిఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్ తక్షశిల రఘురాం, జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన బుధవారం పరిశీలించారు.

అదానీ పోర్టును స్తంభింపజేస్తాం

- యాజమాన్యానికి కార్మికులు, రాజకీయ నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

తమ సమస్యలను పరిష్కరించకుంటే పోర్టులోని కార్యకలాపాలను స్తంభింపజేస్తామని అదానీ గంగవరం పోర్టు కార్మికులు, అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు హెచ్చరించారు. వేతన పెంపు సహా పలు సమస్యల పరిష్కారానికి ఈ నెల 31 వరకూ గడువు పెట్టిన యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ నుంచి గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. చట్టాలను హరిస్తున్న అదానీ గంగవరం పోర్టుపై చర్యలు తీసుకోవాలని, కార్మికులకు రూ.36 వేల జీతం చెల్లించాలని, డిఎను బేసిక్‌లో కలపాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తొలగించిన యూనియన్ నాయకులను, కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, కార్మికులు, వారి కుటుంబీకులకు ప్రత్యేక హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని కోరారు. కాలుష్యం బారి నుంచి గాజువాక వాసులను కాపాడాలని డిమాండ్ చేశారు. పోర్టులో యూనియన్ పెట్టే హక్కును అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కాలరాయడం దుర్మార్గమన్నారు. గంగవరం పోర్టు



భారీ ర్యాలీ నిర్వహిస్తున్న అదానీ గంగవరం పోర్టు కార్మికులు, రాజకీయ పార్టీల నేతలు, కార్మికుల కుటుంబీకులు

ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.జగన్ మాట్లాడుతూ.. జూన్ 7లోపు సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ.. సమస్యను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తక్షణమే కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, జనసేన రాష్ట్ర నాయకులు కోన తాతారావు, దల్లి గోవిందరెడ్డి, సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎల్లేటి శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు, కొవిరి అప్పలరాజు, టిడిపి నాయకులు పులి రమణారెడ్డి, పెద్ద సంఖ్యలో కార్మికుల కుటుంబీకులు పాల్గొన్నారు.



కేతు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైవియు విసి, రిజిస్టర్, సిబ్బంది

విశ్వనాథరెడ్డి సేవలు నిరుపమానం

- వైవియు విసి చింతా సుధాకర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సిపి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులుగా ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి కడపలోని బ్రౌన్ గ్రంథాలయానికి చేసిన సేవలు నిరుపమానమని యోగి వేమన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్య అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డితో కలిసి వారు బుధవారం విశ్వనాథరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వర్సిటీ విసి మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి కథకునిగా, విద్యావేత్తగా, పరిశోధకునిగా నిరంతర సృజనశీలిగా సుప్రసిద్ధులని పేర్కొన్నారు. మొదటి నుంచి తన చుట్టూ ఉన్న సమాజాన్ని నిశితంగా పరిశీలించి శాస్త్రీయ దృక్పథంతో మానవ సంబంధాలను విశ్లేషించి రచనలు చేశారని తెలిపారు. సామాన్యుల జీవితాల్లో సంభవించే అన్ని కోణాలను తనదైన మార్క్సిస్టు దృక్పథంతో ఆవిష్కరించారని తెలిపారు. ఆయన వ్యాసాలు, నాటకాలు, నాటికలు రాసినా తెలుగు సాహిత్యలోకంలో కథకునిగా శాశ్వత స్థానాన్ని సంపాదించుకున్నారని గుర్తు చేశారు. అధ్యాపకుడిగా, పరిశోధనకుడిగా, పాత్రికేయుడిగా, బహుశాస్త్రవేత్తగా, కథకుడిగా, విమర్శకుడిగా అనేక ప్రక్రియల్లో ఆయన గణనీయమైన కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్

సమాజ నిర్మాణంలో ఇంజనీర్లది కీలక పాత్ర

- జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

భారతదేశ సమాజ నిర్మాణంలో ఇంజనీర్లది కీలక పాత్ర అని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడలో బుధవారం జరిగిన జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం 9వ స్నాతకోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో గుర్తింపు పొందిన వ్యక్తులకు ఇచ్చే గౌరవ డాక్టరేట్‌ను కాలుష్య రహిత ఎనర్జీ ఉత్పత్తికి పెద్ద పీట వేసిన ప్రముఖ వ్యాపారవేత్త, గ్రీన్ కో గ్రూప్స్ వ్యవస్థాపకుడు, సిఇఒ చలమలశెట్టి అనిల్‌కు, పరిశోధన పత్రాలు సమర్పించిన 144 మందికి డాక్టరేట్ పట్టాలు, 66 మందికి స్వర్ణ పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించి పట్టాలు పొందిన వారు ఇంజనీరింగ్ సామర్ధ్యంతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడాలన్నారు. ఇంజనీరింగ్ కెరీర్ ఒక్కరోజులో సిద్ధం కాదని, నిరంతరం అభివృద్ధి చెందుతూ సమాజ మార్పునకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వందల మంది విద్యార్థులను జెఎన్‌టియు శాస్త్రవేత్తలుగా తయారు చేసిందన్నారు. వర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జివిఆర్.ప్రసాదరాజు మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటైనప్పటి నుంచి దశలవారీగా జెఎన్‌టియుకె ఎంతో సాంకేతిక నైపుణ్యత సాధించి, అంతర్జాతీయ ఖ్యాతి చెందిందని తెలిపారు.

'అనంత' ఎస్ఆర్ఐటిలో ఫుడ్‌పాయిజన్ కలకలం

86 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు అస్వస్థత

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఫుడ్‌పాయిజన్ కలకలం రేగింది. హాస్టల్‌లో మంగళవారం రాత్రి భోజనం తిన్న 86 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు కడుపునొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రుకు తరలించారు. ఇందుకు సంబంధించి బాధిత విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు... ఎస్ఆర్ఐటి ఇంజనీరింగ్ కళాశాల వసతి గృహంలో మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో విద్యార్థులు ఎగ్‌రైస్, టమోటా రైస్, పెరుగన్నం తిన్నారు. అనంతరం హాస్టల్ గదులకు వెళ్లి నిద్రించారు. బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారు. 86 మంది అస్వస్థతకు గురయ్యారు. తోటి విద్యార్థులు కళాశాల యాజమాన్యానికి సమాచారం తెలియజేశారు. కళాశాల యాజమాన్యం, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ యుగంధర్ అక్కడికి చేరుకుని పరిస్థితి తీవ్రంగా ఉన్న 26 మందిని అనంతపురంలోని అమరావతి హాస్పిటల్‌కు తరలించారు. మరో 60 మందికి కొర్రపాడు వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఎస్ఆర్ఐటి కళాశాలలోనే చికిత్స అందించారు. కళాశాలలో మొత్తం 586 మంది ఉండగా వారిలో 86 మంది అస్వస్థతకు గురైనట్లు వైద్యులు గుర్తించారు. చికిత్స అనంతరం విద్యార్థులు ఎవరికీ ఎలాంటి ప్రమాదం లేదని, అందరూ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

ఫుడ్‌పాయిజన్ విషయం తెలుసుకున్న డిఎంహెచ్‌ఒ వీరబ్బాయి, డిఇఒ సాయిరాంతో పాటు ఐసిడిఎస్, ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు కళాశాలను సందర్శించారు. కళాశాల వంటగది, రాత్రి తిన్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహార పదార్థాల శాంపుల్స్‌ను ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.



ఎస్ఆర్ఐటిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారులు

చేనేతను దత్తత తీసుకుంటా

- పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్

రాష్ట్ర వ్యాప్తంగా నిరాధారణకు గురైన చేనేతను దత్తత తీసుకుంటానని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పేరుతో ఆయన చేపట్టిన పాదయాత్ర బుధవారం 112వ రోజుకు చేరుకుంది. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని దేవగుడి విడిది కేంద్రం నుంచి దేవగుడి గ్రాస్ మీదుగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చౌడూరులోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి శంకరాపురం, పెద్దశెట్టిపల్లె, నరసింహాపురం, చౌటపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో పద్మశాలి సామాజిక తరగతివారు, స్థానికులు, రైతులు, ఎంఆర్‌పిఎస్ నాయకులతో లోకేస్ ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలుచోట్ల లోకేష్ మాట్లాడుతూ తల్లి, చెల్లిని రోడ్డు మీదకి గెంటేసిన జగన్... తల్లి లాంటి కడప జిల్లాకూ అన్యాయం చేశారని విమర్శించారు. చేనేత కార్మికులు పడుతున్న ఇబ్బందులపై సమీక్ష చేసే తీరిక జగన్‌కు లేదని దుయ్యబట్టాడు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతపై ఉన్న 5 శాతం జిఎస్‌టి భారం పడకుండా చేస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లు, కామన్ వర్కింగ్ షెడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. చంద్రన్న భీమా పథకాన్ని మళ్లీ ప్రవేశ పెడతామని పేర్కొన్నారు. మగ్గం ఉన్న చేనేత కార్మికులకు 200 యూనిట్ల విద్యుత్ అందజేస్తామన్నారు. చేనేత క్లస్టర్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక బ్రాండింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు నష్టపోకుండా కల్తీ విత్తనాలు, పురుగుమందుల మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, టిడిపి కడప పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జులు భూపేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టజీవుల పక్షపాతి సత్తిబాబు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కష్టజీవుల పక్షపాతి, విలువలతో కూడిన వ్యక్తిత్వం కలిగిన ప్రజల మనిషి డి.సత్తిబాబు అని వక్తలు కొనియాడారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు సత్తిబాబు సంస్మరణ సభ బుధవారం నర్సీపట్నంలోని తురకబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లా డుతూ.. సత్తిబాబు సౌమ్యుడైనప్పటికీ సిద్ధాంత విషయాలపై కఠినంగా ఉండేవారని అన్నారు. నాన్‌షెడ్యూల్ ప్రాంత గిరిజన సమస్యలపై నిర్వహించిన అనేక పోరాటాల్లో కీలకంగా వ్యవహరించారని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ.. మానవీయ విలువలకు సత్తిబాబు పెద్దపీటవేశారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ.. కులవివక్షతకు వ్యతిరేకంగా సత్తిబాబు పోరాడారని అన్నారు. నర్సీపట్నం ప్రాంతంలో భూ పోరాటాలు నిర్వహించారని తెలిపారు.

కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, గొలుగొండ జడ్‌పిటిసి సభ్యులు గిరిబాబు, కాంగ్రెస్ నాయకులు మీసాల సుబ్బన్న, వైసిపి నాయకులు సిహెచ్.సన్యాసిపాత్రుడు పాల్గొన్నారు. సత్తిబాబు సంస్మరణ సభ సందర్భంగా ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక సంచికను, అల్లూరి సీతారామరాజు పూర్వ విద్యార్థుల సంఘం సౌజన్యంతో సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ప్రచురించిన 'జనం మనిషి కామ్రేడ్ డి.సత్తిబాబు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.



నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, ఎంవిఎస్.శర్మ, తదితరులు

భారత వృద్ధి తగ్గింది

- 2022-23లో 7.2 శాతంగా నమోదు
- తయారీ రంగం డీలా
- మందగించిన గనుల రంగం



న్యూఢిల్లీ : ఏడాదికేడాదితో పోల్చితే భారత వృద్ధి రేటులో తగ్గుదల చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2022-23లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) 7.2 శాతంగా నమోదయ్యిందని జాతీయ గణంకాల కార్యాలయం (ఎన్ఎస్ఒ) బుధవారం వెల్లడించింది. ఇంతక్రితం 2021-22లో 9.1 శాతం వృద్ధి చోటు చేసుకుంది. 2022-23లో మార్చితో ముగిసిన తుది త్రైమాసికం (క్యూ4)లో 6.1 శాతానికి పరిమితమయ్యింది. ఇంతక్రితం డిసెంబర్ త్రైమాసికం (క్యూ3)లో 4.4 శాతంగా, క్యూ2లో 6.3 శాతంగా, క్యూ1లో 13.2 శాతంగా నమోదయ్యింది. 2011-12 స్థిర ధరల ప్రకారం.. 2022-23లో వాస్తవ జిడిపి రూ.160.06 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. 2021-22లో ఇది రూ.149.26 లక్షల కోట్లుగా ఉంది. 2022-23లో తయారీ రంగం స్థూల ఉత్పత్తుల విలువ పెరుగుదల 1.3 శాతానికి పరిమితమయ్యింది. ఇంతక్రితం ఏడాది ఈ రంగం ఏకంగా 11.1 శాతం వృద్ధిని కనబర్చింది. ప్రజల కొనుగోలు శక్తికి కొలమానం అయినా తయారీ రంగం పేలవ ప్రదర్శన కనబర్చడం ఆర్థిక వ్యవస్థలోని బలహీనతలకు నిదర్శనం. ఇదే సమయంలో వ్యవసాయ రంగం పెరుగుదల 3.5 శాతంగా చోటు చేసుకోగా.. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 4 శాతం పెరిగింది. గనుల రంగం కూడా మందగించింది. ఈ రంగం 2022-23లో 4.6 శాతం మాత్రమే పెరిగింది. ఇంతక్రితం ఏడాది 7.1 శాతం వృద్ధిని కనబర్చింది. విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర సర్వీసులు 9 శాతం పెరిగినప్పటికీ.. ఇవి 2021-22లో ఏకంగా 9.9 శాతం వృద్ధిని సాధించాయి. నిర్మాణ రంగం 10 శాతానికి మందగించింది. ఈ రంగం 2021-22లో ఏకంగా 14.8 శాతం పెరిగింది. 2022-23లో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సర్వీస్ రంగాలు 7.2 శాతం పెరగ్గా.. 2021-22లో 9.7 శాతం వృద్ధిని నమోదు చేశాయి.

2021-22లో రూ.15,75,281 కోట్లుగా ఉన్న ప్రభుత్వ వ్యయం.. 2022-23లో రూ.15,77,306 కోట్లకు చేరింది. ప్రయివేటు వినిమయం రూ.87,03,541 కోట్ల నుంచి రూ.93,58,694 కోట్లకు పెరిగింది. గడిచిన మార్చి త్రైమాసికంలో తయారీ రంగం 4.5 శాతం, నిర్మాణ రంగం 10.4 శాతం, వ్యవసాయం 5.5 శాతం, సర్వీసు సెక్టార్ 6.9 శాతం చొప్పున పెరిగాయి. క్రితం క్యూ4లో జిడిపి రూ.43.62 లక్షల కోట్లుగా నమోదయ్యింది. ఇది గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.41.12 లక్షల కోట్లుగా ఉంది. దీంతో పోల్చితే క్రితం క్యూ4లో 6.1 శాతం పెరుగుదల చోటు చేసుకుంది.

ఆరు నెలల కనిష్టానికి కీలక రంగాల ఉత్పత్తి

ప్రస్తుత ఏడాది ఏప్రిల్ మాసంలో ఎనిమిది ప్రధాన మౌలిక వసతుల రంగాల ఉత్పత్తి 3.5 శాతానికి పడిపోయి ఆరు మాసాల కనిష్టానికి జారింది. ముఖ్యంగా ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ప్రొడక్ట్స్, విద్యుత్ రంగాల ఉత్పత్తిలో తగ్గుదల చోటు చేసుకుంది. ఇంతక్రితం 2022 అక్టోబర్‌లో కీలక రంగాల ఉత్పత్తి అత్యల్పంగా 0.7 శాతానికి పడిపోయింది. ఆ తర్వాత భారీగా తగ్గడం ఇదే తొలిసారి. వాణిజ్య, పరిశ్రమల శాఖ గణంకాల ప్రకారం.. గడిచిన ఏప్రిల్‌లో ఎరువుల ఉత్పత్తి 23.5 శాతం, స్టీల్ 12.1 శాతం, సిమెంట్ 11.6 శాతం చొప్పున పెరిగింది. మరోవైపు చమురు ఉత్పత్తి 3.5 శాతం పడిపోయింది.

హైవేలో దారి దోపిడీ

- కారును అడ్డగించి రూ.50 లక్షలు అపహరణ

ప్రజాశక్తి - పూసపాటిరేగ (విజయనగరం)

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం గ్రామం వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి దారిదోపిడీ జరిగింది. ద్విచక్రవాహనాలపై వచ్చిన దుండగులు కారును అడ్డగించి రూ.50 లక్షలు ఎత్తుకెళ్లిపోయారు. ఈ సంఘటన జిల్లాలో కలకలం రేపింది. పూసపాటిరేగ ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం...ఒడిశాలోని పర్లాకిమిడికి చెందిన వ్యాపారి కోట్ల వంశీకృష్ణ తన కారు డ్రైవర్ జయరాంతో కలిసి విశాఖపట్నం వచ్చారు. అక్కడ వ్యాపారి వరదరాజును కలిసి రూ.55 లక్షలు తీసుకొని రాత్రి 11 గంటల సమయంలో విశాఖ నుంచి తిరుగుప్రయాణమయ్యారు. రూ.50 లక్షలు కారు వెనుక సీట్లో ఉంచి, మిగతా రూ. ఐదు లక్షలు ముందు సీట్‌లో ఉంచారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత పూసపాటిరేగ వద్దకు వచ్చే సరికి నలుగురు దుండగులు రెండు ద్విచక్ర వాహనాల్లో కారును వెంబడించారు. చోడమ్మ అగ్రహారం బ్రిడ్జి వద్ద కారును అడ్డగించారు. తుపాకులు చూపించి, కళ్లలో కారంకొట్టి రూ. 50 లక్షలు ఎత్తుకుపోయారు. వెంటనే బాధితులు సమీపంలోని పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దుండగుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయని పోలీసులు తెలిపారు.

ఇం'ధనం' కావాలి

- రావాల్సిన కేంద్ర నిధులపై సిఎం ఆరా
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సమీక్ష



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

దైనందిక అవసరాల కోసం కావాల్సిన నిధుల సమీకరణపై మరింత దృష్టి సారించాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఆదాయ వనరుల శాఖలతో బుధవారం ఆయన సమీక్షించారు. ప్రస్తుతం ఆదాయం ఎంత, రానున్న కాలంలో కావాల్సిన ఆదాయం ఎంత అన్నదానిపైనా ఆయన ఆరా తీశారు. శాఖలవారీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్న తరుణంలో సిఎం ఈ సమీక్ష నిర్వహించారు. ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్న ఈ భేటీలో పలు అంశాలపై చర్చ జరిగింది. తొలి రెండు నెలల కాలంలో రాష్ట్రానికి లభించిన పన్నుల, పన్నేతర ఆదాయం, కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రుణాల రూపేణా వచ్చిన నిధులపై ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వాణిజ్య పన్నుల శాఖ ద్వారా వచ్చిన ఆదాయం, మద్యం అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయాలపైనే ప్రధానంగా అధికారులు వివరించి చెప్పారు. బహిరంగ మార్కెట్ రుణాల ద్వారా ఇప్పటికే రూ.11 వేలకోట్లు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. లోటు నిధుల కింద కేంద్రం నుంచి రూ.10 వేలకోట్ల వరకు రావడం వల్ల తొలి రెండు నెలలు కొంతవరకు ఇబ్బందులు తలెత్తలేదని ఆర్థికశాఖ అధికారులు వివరించినట్లు తెలిసింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల వివరాలపై సిఎం ఆరా తీశారు.

తిరుపతి జూకు నాలుగు హైనాలు

- త్రివేంద్రం నుంచి తరలింపు

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

తిరుపతి వెంకటేశ్వర జంతు ప్రదర్శనశాలకు కేరళ రాష్ట్రం త్రివేంద్రం జూ నుండి నాలుగు హైనాలు, ఆరు హాగ్ డీర్‌లు బుధవారం వచ్చాయి. జూలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో వాటిని అధికారులు విడిచిపెట్టారు. కాగా కర్నూలు జిల్లా నుండి తిరుపతి జూకు తీసుకువచ్చిన నాలుగు పెద్దపులి పిల్లల్లో ఒకటి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందిన విషయం విదితమే. మిగిలిన మూడు పెద్ద పులి పిల్లలు ఆరోగ్యంగానే ఉన్నాయని జూ వర్గాలు తెలిపాయి.



క్వాంట్రోన్ ఎజితో జిటిఎల్ జట్టు

హైదరాబాద్ : గోల్డ్‌స్టోన్ టెక్నలాజీస్ లిమిటెడ్ (జిటిఎల్) జర్మనీ ఇ-మొబిలిటీ సంస్థ క్వాంట్రోన్ ఎజితో భాగస్వామ్యం కుదర్చుకుంది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇరు సంస్థల అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. కృత్రిమ మేధా (ఎఐ)ని ఉపయోగించి ఫ్లీట్ మేనేజ్‌మెంట్ కోసం మొబిలిటీ సొల్యూషన్‌లో మార్పులు తీసుకురానున్నట్లు ప్రకటించారు. అభివద్ధి చెందుతున్న గ్లోబల్ ఎలక్ట్రిక్ మొబిలిటీని ఒడిసి పట్టేందుకు 2023 సెప్టెంబర్ త్రైమాసికం నాటికి అమెరికాలో కూడా ఓ సంస్థను ఏర్పాటు చేయాలని నిర్దేశించుకున్నట్లు కాంట్రోన్ ఎజి సిఇఒ మైకెల్ పెర్సెక్, జిటిఎల్ ఎండి పవన్ చావలి వెల్లడించారు.

క్రితివాసన్‌కు టిసిఎస్ బాధ్యతలు



ముంబయి : దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా క్రితివాసన్ బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు ఈ హోదాలో పని చేసిన రాజేష్ గోపినాథన్ ఇటీవల ఆయన తన పదవికి రాజీనామా చేశారు. టిసిఎస్‌తో తనకు 20 ఏళ్ల అనుబంధం ఉందని.. తనకు సహకరించిన ఉద్యోగులందరికీ ధన్యవాదాలు తెలుపుతూ సిబ్బందికి ఆయన ఓ లేఖ రాశారు. ఆరేళ్ల సిఇఒగా బాధ్యతలు నిర్వర్తించడం గర్వంగా ఉందన్నారు.

ట్విట్టర్ విలువ మూడో వంతుకు పతనం

వాషింగ్టన్ : ఎలన్ మస్క్ విధానాలకు ట్విట్టర్ విలువ భారీగా పతనమవుతోంది. గతేడాది 44 బిలియన్ డాలర్లకు ఆయన ట్విట్టర్‌ను కొనుగోలు చేయగా.. ఇప్పుడు ఆ విలువ మూడో వంతుకు పడిపోయిందని ప్రముఖ ఆర్థిక సంస్థ ఫిడెలిటీ తెలిపింది. ట్విట్టర్‌లో ఫిడెలిటీకి వాటాలున్నాయి. ట్విటర్‌ను తాను కొనుగోలు చేసిన విలువలో వాస్తవానికి సగం కూడా ఉండదని స్వయంగా పలుసార్లు ఎలన్‌మస్క్ పేర్కొన్న విషయం తెలిసిందే. అదే విషయాన్ని తాజాగా పిడెలిటీ స్పష్టం చేసినట్లయ్యింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ట్విట్టర్‌ను ఎలన్ మస్క్ కొనుగోలు చేసిన తర్వాత దాని ఆర్థిక పరపతి మరింత పడిపోయింది. కాగా.. ట్విట్టర్ విలువను పిడెలిటీ ఎలా లెక్కగట్టిందనే విషయాన్ని వెల్లడించలేదు.

జిహెచ్‌సిఎల్‌కు రెవెన్యూలో 126% వృద్ధి

హైదరాబాద్: హిందుజా గ్రూప్‌నకు చెందిన జిఒసిఎల్ కార్పోరేషన్ 2022-23 ఆర్థిక సంవత్సరంలో 126 శాతం వృద్ధితో రూ.1410 కోట్ల ఆదాయన్ని ఆర్జించింది. ఇదే సమయంలో నికర లాభాలు 20 శాతం పెరిగి రూ.211 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2023 మార్చితో ముగిసిన త్రైమాసికంలో 85 శాతం పెరుగుదలతో రూ.302 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది.

సంపాదకీయం

ఆర్డినెన్స్‌కు ఐక్య ప్రతిఘటన

ఢిల్లీ పాలనా వ్యవహారాల్లో అంతిమ నిర్ణయాధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జి)కు దఖలు పరుస్తూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన నిరంకుశ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాల మద్దతు అంతకంతకూ విస్తరిస్తుండటం మంచి పరిణామం. ఆర్డినెన్స్‌కు చట్ట రూపం ఇచ్చేందుకు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు దానికి వ్యతిరేకంగా ఓటు వేస్తామని మంగళవారంనాడు ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మధ్య జరిగిన భేటీ అనంతరం ఏచూరి ప్రకటించారు. తతిమ్మా అన్ని విపక్ష పార్టీలూ ఏకతాటిపైకొచ్చి ఆర్డినెన్స్‌ను తిప్పికొట్టాలని పిలుపునిచ్చాయి. ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఓటు వేసి రోల్‌బ్యాక్ చేయాలంటూ కేజ్రీవాల్ కొన్ని రోజులుగా ప్రతిపక్ష నాయకులను స్వయంగా కలుసుకొని మద్దతు సమీకరణ చేపట్టగా, పలు పార్టీల నుంచి సానుకూల స్పందన వ్యక్తం కావడం విశేషం. ప్రస్తుతం బిజెపికి రాజ్యసభలో తగినంత బలం లేదు. కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలన్నీ సమన్వయంతో వ్యవహరించి రాజ్యాంగ విరుద్ధ ఆర్డినెన్స్‌ను వెనక్కికొట్టగలిగితే, రాజ్యాంగాన్ని, సమాఖ్య వ్యవస్థను, తుదకు ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కుతున్న మోడీ ప్రభుత్వ దూకుడుకు కొంతైనా కళ్లెం పడుతుంది.

ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కబ్జా చేసేందుకు మోడీ ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. అధికారుల నియామకాలు, బదిలీలపై అధికారం ప్రజలతో ఎన్నికైన ప్రభుత్వానిదేనని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం విస్పష్టంగా తీర్పు చెప్పినప్పటికీ, అధికారాలను ఎల్‌జికి అప్పగిస్తూ ఆర్డినెన్స్ తేవడం దౌర్జన్యపూరితం. కోర్టు ధిక్కారంతో పాటు న్యాయవ్యవస్థకు సవాల్ విసరడమే. పార్లమెంట్‌నూ పక్కనపెట్టింది మోడీ సర్కారు. ఏదైనా ప్రధాన అంశం ముందుకొచ్చినప్పుడు పార్లమెంట్‌లో కూలంకషంగా చర్చించి, అన్ని పక్షాల అభిప్రాయం తీసుకొని, బిల్లు ఆమోదింపజేసుకోవడం ప్రజాస్వామ్య పద్ధతి. ఢిల్లీ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రీం తీర్పు వచ్చిన వెనువెంటనే, అదేదో కొంపలు మునిగిపోయినట్లు అత్యయిక ఉత్తర్వు తెచ్చింది మోడీ ప్రభుత్వం. అందుకు జాతి ప్రయోజనాలంటూ వక్ర భాష్యం లంకించుకుంది. జాతి ప్రయోజనాలు సుప్రీం రాజ్యాంగ ధర్మాసనానికి తెలీదని న్యాయస్థానంపైనే అభాండాలు మోపింది. ఆప్ ప్రభుత్వంపై కక్ష సాధింపు, తనకు సుప్రీంలో బెడిసికొట్టిందన్న బాధ తప్ప ఆర్డినెన్స్ తేవడానికి మరే కారణం కనిపించదు. మోడీ ప్రభుత్వ తొలినాళ్లల్లో ఆర్డినెన్స్‌ల వెల్లువపై నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ బహిరంగంగానే అసహనం తెలిపారు. కాబట్టి తాను అనుకున్నది రాజ్యాంగ విరుద్ధమైనా, కోర్టు ధిక్కరణ అయినా ఏకపక్షంగా అమలు చేయడమే బిజెపి ఎంచుకున్న బాట.


రాజ్యాంగం మన వ్యవస్థను ఫెడరల్ వ్యవస్థగా నిర్దేశించింది. కేంద్రం, రాష్ట్రాల అధికారాలను నిర్వచించింది. విభిన్న జాతుల, సంస్కృతుల, ప్రాంతాల సమాహారంగా ఉన్న దేశం మనుగడ సాగించాలంటే లౌకిక, సమాఖ్య స్ఫూర్తే అత్యుత్తమ పరిష్కారంగా భావించింది. కాగా ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకత్వంలో నడుస్తున్న మోడీ ప్రభుత్వం కేంద్రం వద్ద అధికారాలు కేంద్రీకరించేందుకు, రాష్ట్రాల హక్కుల్లోకి బలవంతంగా చొరబడేందుకు అన్ని విధాలా బరి తెగిస్తోంది. జిఎస్‌టి, మూడు వ్యవసాయ చట్టాలు, సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు, వంటి విషయాల్లో రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవట్లేదు. విద్యుత్ సంస్కరణలపైనా అదే ధోరణి. ఈ పూర్వరంగంలో ఢిల్లీ అధికారాల్లో కేంద్ర పెత్తనం కోసం మోడీ సర్కారు తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కేవలం ఆ రాష్ట్రానికే పరిమితం కాదు. రేపొద్దున ఏ రాష్ట్రానికైనా రావొచ్చు. 'మనదాకా రాలేదు కదా అనుకుంటే మనదాకా వచ్చాక మనల్ని రక్షించడానికి ఎవరూ ఉండరన్న' హిట్లర్ కాలంనాటి జర్మనీ నానుడిని ప్రతిపక్షాలు మననం చేసుకోవాలి. బిజెపి పట్ల అవకాశవాదంతో వ్యవహరించే వైసిపి, టిడిపి, జనసేన వంటి పార్టీలు ఆలోచించుకోవాల్సిన సమయం. 'ఢిల్లీ' ఆర్డినెన్స్‌ను పార్లమెంట్‌లో తిప్పికొట్టి రాజ్యాంగ, సమాఖ్య వ్యవస్థలను కాపాడుకోవాలి.

మంచి మాట



పత్రికల వెనకనున్న డబ్బుకు సోషలిజం అంటే పడదు. వాళ్లిచ్చే డబ్బుతో బతికే సంపాదకులు డబ్బు కోసమే పని చేస్తారు. సోషలిజాన్ని, సోషలిస్టుల ప్రభావాన్ని నీరుగార్చే ఏపని చెయ్యడానికైనా సిద్ధపడతారు.

- హెలెన్ కెల్లర్,
అంధ, బధిర అమెరికన్ రచయిత్రి, ఉద్యమకర్త.



జననం : 27.6.1880 - మరణం : 1.6.1968

ఇంటర్వ్యూ

దక్షిణాది దారి చూపుతుంది...

విధ్వంసకర విధానాలు, ప్రజా వ్యతిరేక చర్యలు, మతతత్వ ఎజెండాతో ముందుకు సాగుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తయింది. తొమ్మిదేళ్లుగా దేశాన్ని తప్పుడు మార్గంలో నడిపించిన తర్వాత ... మత సామరస్యాన్ని, సమాఖ్య విధానాన్ని, దేశ శ్రేయస్సును తిరిగి పొందాల్సిన ఆవశ్యకత నేడు ఎంతైనా వుంది. ఈ నేపథ్యంలో దేశ పరిస్థితులకు సంబంధించిన అనేక అంశాలపై... ఐఐటి ముంబై బయో మెడికల్ ఇంజనీరింగ్ విశ్రాంత ఆచార్యుడు, రచయిత, సామాజిక పరిశీలకుడు డా॥రామ్ పునియాని... 'దేశాభిమాని' పత్రికకు తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ వివరాలు...



నరేంద్ర మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పదవ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. మోడీ తొమ్మిదేళ్ల పాలనను ఎలా అంచనా వేయాలి?

2014లో స్పష్టమైన మెజారిటీతో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి, మతపరమైన ఎజెండాను అమలు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని ఈ ప్రభుత్వం హిందుత్వ జాతీయవాదంపై ఆధారపడి ఉంది. దేశంలోని మెజారిటీ ప్రజలకు హాని కలిగించే అనేక నిర్ణయాలు ఉన్నాయి. కాశ్మీర్‌కు ప్రత్యేక అధికారాలు కల్పించే ఆర్టికల్ 370ని తొలగించడం, పౌరసత్వ సవరణ చట్టం అమలు వంటివి ఇందుకు ఉదాహరణలు.

మరొకటి క్రోనీ క్యాపిటలిజంతో కూడిన ఆర్థిక విధానాలు. ఇందుకు అదానీ వ్యవహారం ఒక ఉదాహరణ మాత్రమే. మోడీ పాలనలో ఇలా గుత్తాధిపత్యం వేళ్లానుకుని... ధనికులు మరింత ధనవంతులుగా, సామాన్యులు మరింత పేదలుగా మారే పరిస్థితి పెరిగిపోయిందని ఆక్స్‌ఫామ్ నివేదిక పేర్కొంది. పేదరికం రేటు పెరుగుతోంది. ధరలు చుక్కలనంటుతున్నాయి. మహిళలు, దళితులు, గిరిజనులు, మతపరమైన మైనారిటీలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తొమ్మిదేళ్లుగా మోడీ దేశాన్ని ఇదే తప్పుడు మార్గంలో నడిపించారు.

మోడీ ప్రభుత్వంలో నోట్ల రద్దు కీలకమైన చర్య. ఈ సమయంలోనే కోవిడ్ మహమ్మారి సమస్య వచ్చిపడింది. ఈ రెండు అంశాలపై ప్రభుత్వం ఎలా వ్యవహరించింది?

నోట్ల రద్దు, కోవిడ్ మహమ్మారి...ఈ రెండు సమస్యలు తలెత్తినప్పుడు మోడీ ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరించింది. నోట్ల రద్దు పెద్ద తప్పు అని తేలింది. నోట్ల కోసం క్యూ లైన్లలో నిలబడి దాదాపు 600 మంది చనిపోయారు. నల్లధనాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో నోట్ల రద్దును అమలు చేశారని, ఆ తర్వాత అది రెండింతలు పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. రూ.2000 నోట్లను భారీ అంచనాలతో ప్రవేశపెట్టారు. కానీ ఇప్పుడు వెనక్కి తీసుకున్నారు. ఇవన్నీ ప్రధాని చొరవతో తీసుకున్న నిర్ణయాలే. ఇప్పుడు అది పెద్ద వైఫల్యం అని జనం నమ్ముతున్నారు. మహమ్మారిపై పోరాటంలో కేరళ తీసుకుంటున్న చర్యలు ఎవరికైనా ఆదర్శంగా నిలుస్తాయి. అయితే, దేశంలో లాక్‌డౌన్ ప్రకటించినప్పుడు, మోడీ ప్రజలకు మొత్తం ఆరు గంటల సమయం మాత్రమే ఇచ్చారు. చాలా చోట్ల ప్రజలు ఒంటరిగా ఉన్నారు. రైల్వే ట్రాక్ వెంబడి నడుచుకుంటూ తమ స్వంత ఊళ్లకు వలస వెళ్లిన అత్యంత దయనీయ దృశ్యం మనం చూశాం. దేశంలోని సామాన్యులకు హృదయ విదారకమైన అనుభవాలు ఎదురయ్యాయి.

దేశంలో మైనారిటీలు అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. దీన్ని ఎలా అంచనా వేస్తారు?

ఇప్పుడు మైనారిటీలు ప్రతి రోజూ హింసను ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. షాహీన్‌బాగ్ సమ్మె తర్వాత వారి మీద తప్పుడు కేసులు బనాయించడం, జైళ్లలో కుక్కడం సర్వసాధారణం అయిపోయింది. ఉమర్ ఖలీద్‌తో సహా చాలా మంది జైలులో ఉన్నారు. గొడ్డు మాంసం తిన్నందుకు పేద ప్రజలను గోరక్షక గుంపులు కొట్టి చంపిన ఘటనలున్నాయి. మరోవైపు, విద్వేషపూరిత ప్రచారం నిరంతరం కొనసాగుతోంది. అయితే ఇటువంటి ప్రచారానికి పాల్పడే అనురాగ్ ఠాకూర్, పర్వేష్ వర్మ, కపిల్ శర్మ వంటి వారిపై కేసు లేదు. జైలు శిక్ష కూడా లేదు. రాజ్యం తమతో ఉందని, మైనారిటీలపై దాడి చేయడానికి, ప్రాణాలు తీయడానికి లైసెన్స్ ఉందని సదరు విద్వేష ప్రచారకులు భావిస్తున్నారు. ఒక వర్గం క్రైస్తవులు బిజెపితో సాన్నిహిత్యాన్ని కొనసాగిస్తున్నప్పటికీ... క్రైస్తవులకు కూడా పెను ముప్పు పొంచి ఉంది. క్రైస్తవ ప్రార్థనా స్థలాలపై దాడులు జరుగుతున్నాయి. మణిపూర్, నాగాలాండ్‌లో క్రైస్తవులపై దాడులు జరుగుతున్నాయి. దేశ రాజధానిలో సైతం క్రైస్తవ చర్చిలకు నిప్పు పెట్టారు. ఈ విషయాన్ని అర్థం చేసుకోకుండానే కొందరు బిషప్‌లు బిజెపికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు.

దేశమంతటా మతతత్వం విస్తరిస్తున్న సమయంలో 'కేరళ స్టోరీ' వంటి చిత్రాలను రూపొందించారు. దీనికి ప్రధాని మద్దతు కూడా వుంది. లౌకిక కేరళ రాష్ట్రాన్ని అవమానించడానికి, అబద్ధాలను వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారు...!

ఆ సినిమా వెనుక రెండు లక్ష్యాలున్నాయి. కేరళలో బిజెపి అంత తేలికగా గెలవలేదని దానికి అర్థమైపోయింది. అందుకే కేరళను ఉగ్రవాద కేంద్రంగా చిత్రించడం ఈ సినిమా ప్రాథమిక లక్ష్యం. మరొక అంశం ఏంటంటే, ముస్లింలు జిహాద్‌ను ప్రేరేపిస్తున్నారని, యువతులను ఐసిస్ వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పడం. 'కాశ్మీర్ ఫైల్స్' ఈ విధంగా రూపొందించబడిన మరొక చిత్రం. గోవా ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ దీనిని నిర్దిష్ట లక్ష్యాలతో తీసిన చిత్రంగా నిర్ధారించింది. 'కేరళ స్టోరీ'ని కూడా ఇదే తరహా చిత్రంగా వర్గీకరించవచ్చు. తప్పుడు సమాచారం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కింది. లవ్ జిహాద్‌కు చెందిన 32,000 మంది హిందూ బాలికలు ఐసిస్ లోకి రిక్రూట్ అయ్యారని సినిమా చెబుతోంది. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం కేరళ నుంచి మొత్తం ఆరుగురు ఐసిస్‌లో చేరారు. వారిలో ముగ్గురు ముస్లింలు కాగా ఇద్దరు క్రైస్తవులు. హిందూ సమాజానికి చెందిన ఒక మలయాళీ మాత్రమే ఐసిస్ వైపు ఆకర్షితులయ్యారన్న కేంద్ర ప్రభుత్వ సమాచారం అందించకుండానే నకిలీ లెక్కలు తేల్చే ప్రయత్నం చేస్తున్నారు. 'కాశ్మీర్ ఫైల్స్' తరహా లోనే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతలు 'కేరళ స్టోరీ'ని సమర్థిస్తున్నారు. దీనికి ప్రధాని కూడా మద్దతు పలుకుతున్నారు.

గిరిజన సామాజిక వర్గానికి చెందిన మహిళను రాష్ట్రపతిని చేశామంటూ గొప్పగా ప్రచారం చేసుకున్నారు. అయితే పార్లమెంట్ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని దూరంగా ఉంచే పరిస్థితి నెలకొంది. దీనికేమంటారు?

పార్లమెంట్ ప్రారంభోత్సవం గురించి మాట్లాడే ముందు రామ మందిర నిర్మాణం గురించి చర్చించుకోవాలి. ఒక లౌకిక దేశంలో ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవాలకు ప్రధాని వెళ్లకూడదు. రామ మందిరం విషయంలో అది ఉల్లంఘించబడింది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌ని కూడా ఆహ్వానించారుగానీ...రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను పక్కన పెట్టారు. అసలు కారణం ఆయన దళితుడు కావడమే. ఇలాంటి మతపరమైన వేడుకల్లో దళితులు ఉండరాదన్న ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి అలా నెరవేరింది. ఇది ఆర్‌ఎస్‌ఎస్ సొంత ఎజెండా అని...దళిత, గిరిజన సంఘాలు వారికి కేవలం ప్రచారాంశాలు మాత్రమేనని ఈ చర్యలు రుజువు చేస్తున్నాయి. పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని దూరంగా ఉంచడం ద్వారా ఈ విషయం మరింత స్పష్టంగా వెల్లడైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గిరిజన వర్గానికి చెందినవారు.

దీన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలు ఒక్కటయ్యాయి. 21 రాజకీయ పార్టీలు కేంద్రం చర్యను విమర్శించాయి. మరోవైపు 14 పార్టీలు ప్రభుత్వం వెంట ఉన్నాయి. బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకం కావడం విశేషం. కర్ణాటకలో ఇది ఫలించింది. ఇది మంచి పరిణామం.

కేరళలో బిజెపికి ఒక్క సీటు కూడా లేదు. తమిళనాడులోనూ బిజెపి ఆ దరిదాపుల్లో లేదు. బిజెపిని అడ్డుకునేందుకు దక్షిణ భారతం ప్రయత్నిస్తోందని భావిస్తున్నారా?

మతపరమైన అంశాల పట్ల కేరళ ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడం ఇందుకు మరో కారణం. తమిళనాడులో ద్రవిడ, పెరియార్ ఉద్యమాలు ఉన్నాయి. ఈ వాతావరణం బిజెపిని దూరం చేస్తుంది. కర్ణాటకలో మత ప్రాతిపదికన చీలికలు పెట్టే ప్రయత్నాన్ని ప్రజలు ఓడించారు. 'ఆపరేషన్ కమల్'కు కూడా వీలు లేని విధంగా ప్రజలు తీర్పు ఇచ్చారు. దక్షిణ భారతదేశం దేశానికి మార్గదర్శకంగా మారుతుందని ఈ పరిణామం తెలియజేస్తోంది.

బిజెపి వ్యతిరేక వాతావరణాన్ని పెంచేందుకు కిసాన్ లాంగ్ మార్చ్, రైతుల సమ్మె దోహదపడ్డాయంటారా?

ఈ వాతావరణాన్ని కాపాడుకుంటూ కలిసికట్టుగా ముందుకు సాగితే దేశంలో శుభవార్త వినవచ్చు. ★

సందర్భం

బాలలంతా బడికి

ప్రపంచ బాలల స్థితిగతుల గురించి, వారి జీవితాలను మెరుగు పరిచే ప్రక్రియ గురించి ఆలోచించే ఏకైక అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్య సమితి (యుఎన్ఓ) అనుబంధ సంస్థ యునిసెఫ్. ఆకలి, దారిద్ర్యం, అనారోగ్యంతో బాధపడుతున్న బాలలు అన్ని దేశాల్లో ఉన్నారు. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలో ప్రతి దేశంలో ఉన్నారు. ఆకలి, దారిద్ర్యంతో పాటు వెట్టిచాకిరి కూడా బాల్యాన్ని బాధ పెడుతూనే ఉంది. ఆ విధంగా ఇవి బాలల హక్కుల్ని హరిస్తున్నాయి. అయితే యుఎన్ఓ చొరవతో వివిధ దేశాలు బాలలు స్థితిగతుల గురించి సందర్భాన్ని బట్టి ఆలోచిస్తున్నాయి, స్పందిస్తున్నాయి కూడా. జూన్ 1వ తేదీన 'అంతర్జాతీయ బాలల దినోత్సవం' నిర్వహించాలని గుర్తించడం ద్వారా బాలల భవితకు భరోసా ఇచ్చిందని చెప్పవచ్చు.



1948వ సంవత్సరంలో జరిగిన "ప్రపంచ మహిళా సమాఖ్య" అంతర్జాతీయ సమావేశంలో ప్రతి సంవత్సరం జూన్ ఒకటవ తేదీన "అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. ఈ తీర్మానంపై సుమారు వందకు పైగా దేశాలు సంతకం చేశాయి. అప్పటి నుండి ఆరోజున "అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని" నిర్వహిస్తున్నారు. 1989 సంవత్సరంలో అంటే సుమారు 41 సంవత్సరాల తరువాత యుఎన్ఓ సమక్షంలో సభ్య దేశాలు (భారత్ కూడా) బాలలకు ఏ కష్టం రాకుండా చూసుకుంటామనే భరోసాతో కూడిన ఒప్పందంపై సంతకాలు చేశాయి.

ఈ ఒప్పందం ప్రకారం ఆయా దేశాల ప్రభుత్వాలు, బాలలను అన్ని విధాలా ఆదుకోవాలి. ముఖ్యంగా పౌష్టికాహారం, విద్య, బట్టలు, నిత్యావసరాలను ఆయా దేశాల ప్రభుత్వాలు తప్పనిసరిగా కల్పించాలి. అయితే సంపన్న దేశాలు కూడా కేవలం బాలల్లో ముప్పాతిక శాతానికి మాత్రమే తిండి, బట్ట కల్పించగలుగుతున్నాయి. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దేశాలు ముఖ్యంగా లాటిన్ అమెరికా దేశాలు, భారతదేశం బాలల్ని దారిద్ర్యం, ఆకలి భాదల నుంచి విముక్తి కల్గించ లేకపోతున్నాయి.

ఒక అంచనా ప్రకారం ప్రపంచంలో 80 శాతం బాలలు కటిక దారిద్ర్యంలో మగ్గుతున్నారు. యునిసెఫ్ నివేదిక ప్రకారం 1993 సంవత్సరంలో ప్రతి 1000 జననాల్లో 122 మంది బాల్యదశ దాటకుండానే మృతి చెందుతున్నారు. ముఖ్యంగా కరోనా వైరస్ ప్రభావం బాలల భవిష్యత్తుపై పడింది. వీరు గృహ హింసకు, బాల్య వివాహాలకు, అవమానాలకు గురయ్యారు. కొన్ని కోట్ల మంది బాలలు చదువు కొనసాగించడం ప్రశ్నార్థకంగా మారింది. బాలలు శారీరక, మానసిక సమస్యలతో సతమతమవుతున్న నేపథ్యం ఉంది. వలస కార్మికుల కుటుంబాలలో బాలల కష్టాలు వర్ణనాతీతం.

అలాగే ప్రపంచ ఆరోగ్య నివేదిక ప్రకారం రెండున్నర కోట్ల మంది బిడ్డలు పుడితే వారిలో సుమారు 13 లక్షల మంది 28 రోజుల్లోనే చనిపోతున్నారు. ఈ పరిణామాలు ఆందోళన కల్గించే విషయాలే. బాలల అభ్యున్నతి, దేశాభివృద్ధి చదువుతో ముడిపడి ఉంది. ఇది గమనించిన యుఎన్ఓ సభ్య దేశాలు బాలలకు చదువును ఉచితంగా అందిస్తామనే తీర్మానాలు చేశాయి. వాగ్దానంతో కూడిన భరోసా తీసుకోవడం జరిగింది. ఈ క్రమంలోనే...మన దేశంలో ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009 సాధ్యమయింది. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో త్రికరణశుద్ధిగా అమలు చేసినప్పుడే నిజమైన "అంతర్జాతీయ బాలల దినోత్సవం" ఫలితాలు అందినట్లవుతుంది. అప్పుడే యుఎన్ఓకి భారతదేశం చేసిన వాగ్దానం అమలు అయినట్టు. ఆ దిశగా భారతదేశం ప్రయత్నాలు కొనసాగిస్తుందని ఆశిద్దాం.

- నరవ ప్రకాశరావు,
బాల వికాస్ ఫౌండేషన్ గౌరవ కార్యదర్శి-
విశాఖపట్నం, సెల్ : 932477463

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

జనవాక్యం

పార్లమెంట్‌లో యజ్ఞాలు సిగ్గుచేటు

రాజకీయాలలో మతపరమైన జోక్యం ఉండకూడదు. అటువంటిది అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన దేశ నూతన పార్లమెంటు భవనం ప్రారంభ సమయంలో మతపరమైన క్రతువులు నిర్వహించడం లౌకికవాదాన్ని పరిహసించడమే అవుతుంది. యజ్ఞ యాగాలు మత పరమైన ప్రార్థనలు చేయడం అంటే దేశాన్ని మరలా రాచరిక ఫాసిస్టు సమాజం వైపు తీసుకెళ్లడమే అవుతుంది. అంతే కాకుండా రాకెట్ ప్రయోగానికి ముందు పూజలు చేయడం, రాజ్యాంగ బద్ధమైన హోదాలో ఉన్న రాష్ట్రపతి, గవర్నర్, సుప్రీం కోర్టు జడ్జి, ప్రధాని, ముఖ్యమంత్రి వంటి వాళ్ళందరూ మత భక్తి విశ్వాసాలతో ఉంటూ ప్రభుత్వ పాలనలో స్వంత ఎజెండా అయిన మతాన్ని మత విశ్వాసాలను సమాజంపై చూపిస్తూ ఉన్నారు. దేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ తన పరిపాలనలో మత పరమైన జోక్యం లేకుండా హేతుబద్ధంగా శాస్త్రీయ దృక్పథంతో పాలన సాగించారు. రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఎ (హెచ్) ప్రకారం ప్రజల్లో సమాజంలో శాస్త్రీయ దృక్పథం కల్పించే బాధ్యత పాలకులపై ఉంది. అటువంటివి దేశ ప్రధాని తన స్వంత ఎజెండాతో ముందుకు వెళ్లడం రాజ్యాంగ విరుద్ధం. ఇదే క్రమంలో నూతన పార్లమెంట్ భవనంలో దేశ స్వాతంత్ర్య సమరంలో త్యాగధనుల చిత్ర పటాలను నెలకొల్పాలి. కాబట్టి పార్లమెంటు భవనం ప్రారంభంలో మత పరమైన ప్రార్థనలు, యజ్ఞాలు చేయడంపై పునఃపరిశీలన జరపాలని కోరుతున్నాం.

- మోతుకూరి అరుణకుమార్,
పటమట, విజయవాడ-10.

సి.ఎం దృష్టి పెట్టాలి

రాష్ట్రంలో పరిశ్రమలకు ఇవ్వవలసిన ప్రోత్సాహకాలు ఎన్నికల కోడ్ తొలగిపోగానే విడుదల చేస్తామని పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గారు గత ఫిబ్రవరి మాసంలో చెప్పారు. ఎన్నికల కోడ్ తొలగి ఇన్ని నెలలు అయినా ప్రోత్సాహకాలు విడుదల చేయనేలేదు. అప్పట్లో పత్రికలు దుష్ప్రచారం చేస్తున్నాయని, కోడ్ తొలగిన వెంటనే చెల్లిస్తామని మంత్రి నర్మగర్భంగా చెప్పారు! పెట్టుబడులు, పరిశ్రమలు రావాలంటే విశ్వసనీయత కీలకం! పాలకులు ఆ వాస్తవాన్ని విస్మరించరాదు!

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

సెటైర్

దండించేందుకా రాజదండం?



ఏమేవ్! ఎక్కడ చచ్చావే... పేపర్లో, టీవీల్లో రాజదండంతో మన ప్రధాని మోడీగారి ఆ రాజవైభోగం చూస్తుంటే... వళ్ళు పులకరిస్తున్నది సుమా! నీవేంటి అసలు ఇదేమీ పట్టనట్టు ఇంటి పని, వంట పని అంటూ అలా అఘోరిస్తే ఎలా..?

భావం-భాష తెలియని మీకూ, మీలాంటి వారికి మీ గొడవ. అది మా బోటి ప్రజలకు ఎందుకండీ..?

ఆ... ఇది మా గొడవా..? మాకు భావం-భాష తెలియదా? ఎంత మాటన్నావ్?. శుభమా అని దేశంలోని అత్యున్నత పార్లమెంటు భవనం సెంట్రల్ విస్టాను వేదపండితులు, వేదమంత్రాలు, హోమగుండాల మధ్య ప్రధాని ప్రారంభిస్తే అది నీకు వేళాకోళంగా ఉందా..?

కాకపోతే ఏమిటి? నా పనేదో నా మానాన నేను చేసుకుంటూ ఉంటే ఎక్కడి చచ్చావే అంటూ ఆ పలకరింపు ఏమిటి? నేను చచ్చినదాన్నా..?

ఆ... అదేదో ఊతపదం. దాన్ని పట్టుకుని బట్టతలకు మోకాలుకు ముడి వేస్తావేమిటి?

ముడి వేస్తున్నది మీరు. మీది ఊతపదం కాదు, ఆధిపత్యం. ఎదుటివారు ఏమన్నా, ఏం చేసినా పడి ఉంటారనే అహంభావం. రోజులు మారుతున్నాయనే స్పృహ అస్సలుండదు. ఎంత స్థాయిలో ఉంటే మాత్రం ఏం సుఖం. ఛాదస్త భూతం పట్టాక...

ఎవరికీ నాకా... నా అధినాయకునికా..?

ఇద్దరికీ. లేకపోతే ఏమిటండీ..? మన దేశ ప్రథమ పౌరురాలు అయిన రాష్ట్రపతి ద్రౌపతి ముర్మును పిలువక అదేం ప్రారంభమండీ..? ఇప్పుడు...మనది ప్రజాస్వామ్య దేశం. ఏదైనా ఓ చట్టం అమలు కావాలంటే పార్లమెంటు ఉభయ సభల ఆమోదంతో పాటు రాష్ట్రపతి సంతకం కూడా కావాల్నా... అక్కరల్లేదా..? ఉభయ సభల్ని ఉద్దేశించి మాట్లాడేదెవరండి. రాష్ట్రపతి కాక మరెవరున్నారు? అంతెందుకు మన భారత సైన్య త్రివిధ దళాల అధిపతి కూడా రాష్ట్రపతే కదా..! మరెందుకు పిలవలేదు? భర్త లేని మహిళగా వైధవ్యంతో ఉంది గనుక, మీరనుకునే ఆ శుభకార్యానికి రాకూడదని పిలవలేదా? చెప్పండీ..? ఇదంతా మీడియా కోడై కూస్తున్నా మీరు మాత్రం కిమ్మనరు. పైగా అదేదో గొప్ప కార్యంలా ఊగిపోతారు పోతురాజులా?

మళ్ళీ పోతురాజా..?

సామెతలు ఊరికే రావండీ... తరతరాల అనుభవసారం. తిండికి తిమ్మరాజు.. పనికి పోతురాజు అంటే తిండి ఎక్కువ పని తక్కువ అని అర్థం.

పన్నెండు వందల కోట్లు ఖర్చుపెట్టి పార్లమెంటు భవనం కట్టిస్తే అది గొప్పపని కాదా..?

ఎవరి డబ్బు అది? ప్రజల డబ్బు. మీ సొంత డబ్బు కాదు కదా! సొంత డబ్బా కొట్టుకోవడానికి. గొప్ప పని అంటే ప్రజల సమస్యలు పరిష్కరించాలి. ప్రజల్ని ఉత్నతులుగా తీర్చిదిద్దాలి. ఏ రోజు పత్రిక చూసినా ఎక్కడో ఓ చోట రైతుల ఆత్మహత్యలు, ఆడపిల్లలపై అత్యాచారాలు. అంతెందుకు? ఆ పార్లమెంటు భవనం ప్రారంభం రోజునే పాపం న్యాయం కోసం రోడ్డెక్కిన రెజ్లర్ల పోరాటాన్ని అత్యంత కర్కశంగా అణచివేసారే. కనీసం మీకు ఆడపిల్లలనే సానుభూతైనా ఉన్నదా... అరెరే...

పార్లమెంటు భవనాన్ని ఓ పక్కన ఘనంగా ప్రారంభిస్తుంటే ఆ పక్కనే ఆందోళనలు చేయడం ఏమిటి? ప్రతిష్ట పోదూ..?

మీరూ... మీ ప్రతిష్ట మండిపోనూ... ఆందోళన చేయడం ప్రజాస్వామ్యపు హక్కండీ... అయినా వారేమైనా సామాన్య మహిళలా... ఒలింపిక్స్‌లో మన భారత పతాకాన్ని అంతర్జాతీయంగా రెపరెపలాడించిన మల్లయోధులండీ...నెల రోజులుగా శిబిరం వేసుకుని నిరసన దీక్ష చేస్తుంటే... మీకు చీమ కుట్టినట్టుగా కూడా లేదు. నేరం చేసినవాడు మాత్రం మీ పాలకుల అండతో దర్జాగా ఆ పార్లమెంటులోనే కూర్చుంటాడు. మా ఆడవాళ్ళు మాత్రం ఇలా రోడ్లపై పోలీసుల బూటుకాళ్ళ దెబ్బలు తినాలి.

ఇదేంటి నీవు రెజ్లర్లతో కలసిపోతున్నావు?

మీరు పాలక మోడీతో కలిసిపోతున్నప్పుడు నేను పోరాడే రెజ్లర్లతో కలసిపోవడం తప్పా..?

ఆ... ఆ... అన్నీ పోరాటాలు... నిరసనలతోనే తేల్చుకుంటారా ఏంటి?

మరెలా..?

కాస్త సర్దుబాట్లు, క్షమాపణలు చెప్పుకుంటూ ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయి గానీ...

హమ్మయ్య, దారికొచ్చారు. అందుకే దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో ప్రాణ త్యాగం చేస్తే... ఆ వీరుల్ని కాదని, ఎవరూ చెప్పని రీతిలో బ్రిటిష్ పాలకులకు క్షమాపణ చెప్పిన సావర్కర్ జన్మదినాన్నే పార్లమెంటు భవన ప్రారంభ రోజుగా మోడీ ఎంపిక చేసుకున్నారు. ఈ విషయాన్ని మీరు, మీ నోటితోనే ఇలా చెప్పారు. యద్భావం.. తత్ భవతి. భావాలకు అనుగుణంగానే పనులు. అందుకే రాజదండాన్ని కూడా అణచివేతకు చిహ్నంగా పట్టుకున్నారిప్పుడు.

తప్పు చేసినవారిని రాజులు దండించరా ఏమిటి?

అయ్యో! రాజులు కాలం పోయి చానాళ్ళయింది. జనం ప్రజాస్వామ్యంలోకి వచ్చారు. మీరింకా ఆ... ఆలోచనల్లోకి రాలేదు. ఏం చేస్తాం? కర్మ...కర్మ. అందుకే అన్నాడు ఐన్‌స్టీన్.... ముందుకు చూస్తూ వెనక్కి నడిచేవారు ఎప్పటికైనా వెళ్ళేది అజ్ఞాన గాధంలోకే అని. ఛాదస్తపు లోతులకూ అంతం ఉండదు సుమా. నా దౌర్భాగ్యం ఏమంటే... మీ అధినాయకులతో పాటు మీరూ అదే దారిలో నడవడం...!

- కె. శాంతారావు,
సెల్ : 9959745723

వడదెబ్బకు విఆర్‌ఎ మృతి

ప్రజాశక్తి - సబ్బవరం (అనకాపల్లి జిల్లా)

వడదెబ్బకు విఆర్‌ఎ మృతి చెందిన సంఘటన అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. అసకపల్లి పంచాయతీలో వంకర సూర్యనారాయణ(55) విఆర్‌ఎగా పని చేస్తున్నారు. ఎండ వేడిమికి తాళలేక తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందారు. సూర్యనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

దిగిరాని ఇంధన ధరలు

- అంతర్జాతీయంగా తగ్గినా ఇక్కడ షరా మామూలే



న్యూఢిల్లీ : అంతర్జాతీయ చమురు ధరల్లో నెలకొన్న అస్థిరత, ధరల పెరుగుదల నుంచి సామాన్య ప్రజానీకాన్ని విజయవంతంగా ఒడ్డున పడేశామంటూ కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీ గత వారం సీఐఐ నిర్వహించిన సదస్సులో గొప్పగా చెప్పుకున్నారు. అయితే ఆయన మాటలకు, వాస్తవ పరిస్థితికి ఏ మాత్రం పొంతన కుదరడం లేదు. ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేపథ్యంలో గత సంవత్సరం ఫిబ్రవరిలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. అప్పుడు ప్రభుత్వ రంగంలోని ఇంధన రిటైలర్లు ధరలు పెంచలేదు. కేంద్ర మంత్రి బహుశా ఈ విషయాన్ని ప్రస్తావించి ఉండవచ్చు. అయితే ఇక్కడ ఓ విషయాన్ని గమనించాలి. ఆ సమయంలో ప్రైవేటు రంగంలోని రిటైలర్లు పెట్రోల్, డీజిల్‌ను అమ్మేందుకు సుముఖత చూపలేదు. అప్పుడు నష్టం వచ్చినప్పటికీ ప్రభుత్వ రంగ రిటైలర్లు ధరలు పెంచలేదని మంత్రివర్యులు సెలవిచ్చారు. ప్రైవేటు రిటైలర్లకు బాధ్యతే ఉండదని కూడా చెప్పుకొచ్చారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే అంతర్జాతీయ ఇంధన ధరలు 40శాతం నుంచి 50శాతం వరకూ తగ్గినప్పటికీ మన దేశంలో వినియోగదారులు మాత్రం ఇప్పటికీ అధిక రేట్లు చెల్లిస్తూనే ఉన్నారు. మరింత నష్టంతో పెట్రోల్, డీజిల్ విక్రయించాలని ప్రైవేటు రిటైలర్లను ఒత్తిడి చేయలేమని పూరి చెప్పారు. పెట్రోలియం మంత్రిత్వ శాఖ వద్ద ఉన్న సమాచారం ప్రకారం దేశంలో 87 వేల ఇంధన రిటైల్ ఔట్‌లెట్లు ఉన్నాయి. వీటిలో 8.300 మాత్రమే ప్రైవేటు రిటైలర్లవి. వీటిలోనూ నయారా ఎనర్జీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీలవే ఎక్కువ. నయారా ఎనర్జీకి 6,400 బంకులు, రిలయన్స్‌కు 1500 బంకులు ఉన్నాయి.

పోలవరం పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి.-చింతూరు

పోలవరం నిర్వాసితులు, ముంపు బాధితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచితలపెట్టిన పోలవరం పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఎర్రంపేటలో నిర్వహించిన సన్నాహక వర్క్ షాప్‌లో మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితుల పట్ల నిర్లక్ష్యపూరితమైన దుర్మార్గమైన విధానాలు అవలంభిస్తున్నాయని మండిపడ్డారు. బాధితులకు పునరావాసం, ప్యాకేజీ, పరిహారం చెల్లించకుండానే ప్రాజెక్టు పనులు చేపట్టడం దుర్మార్గమన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులు, ముంపు బాధితులు లక్షలాదిమంది ప్రజానీకం అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదని విమర్శించారు. గతేడాది ముంపు మండలాల్లో సంభవించిన గోదావరి వరదలకు ప్రజానీకం తీవ్రంగా నష్టపోయారన్నారు. ముంపు బాధితులకు కనీసం పరిహారం, ఆదుకునే చర్యలను ప్రభుత్వాలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. కాపర్ డ్యాం బ్యాక్‌వాటర్ ప్రభావంతో 11 మండలాల్లో ముంపు సమస్య తీవ్రంగా ఉండి, నిర్వాసితులు సర్వస్వం కోల్పోయి, ఏటా నానా అవస్థలు పడుతున్నా ప్రభుత్వాలు, అధికార యంత్రాంగం చీమకుట్టినట్టయినా స్పందించపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.బాధితుల్లో కేవలం కొద్దిమందికి మాత్రమే కంటి తుడుపు చర్యగా వరద సాయంగా కుటుంబానికి రూ.రెండు వేలు అందించిచేతులు దులుపుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ముంపు మండలాల నుంచి అమరావతి వరకు చేపట్టే సిపిఎం పాదయాత్రలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బ్రిజ్‌భూషణ్‌పై ఎందుకు చర్యలు తీసుకోరు?

- కేంద్రాన్ని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మద్దతు ప్రకటించారు. రెజ్లర్లను లైంగికంగా వేధించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రెజ్లర్లు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా కేంద్రం పట్టించుకోపోవడం దుర్మార్గమన్నారు. దేశానికి బంగారు పతకాలు సాధించిన క్రీడాకారుల పట్ల అనుచితంగా వ్యవహరించడం తగదన్నారు. ఈ వ్యవహారాన్ని ప్రపంచమంతా చూస్తోందని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రెజ్లర్లు లేవనెత్తుతున్న అంశాలను పరిగణనలోకి తీసుకుని తగిన పరిష్కారం చూపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలి

- మంత్రి బొత్సకు కాంట్రాక్టు లెక్చరర్ల వినతి



ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

తమ సర్వీసు రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర కో-కన్వీనర్ గొర్ల మాణిక్యం ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతి పత్రం సమర్పించారు. బుధవారం జెఎన్‌టియుకెలో జరిగిన స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రిని కలిసి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు లెక్చరర్స్ అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఇప్పటికే మాతో పాటుగా పనిచేసిన కాంట్రాక్టు లెక్చరర్స్‌ని తెలంగాణలో రెగ్యులరైజ్ చేశారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ అతి తొందరలోనే మీకు కూడా రెగ్యులరైజేషన్ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా, డాక్టర్. బిఆర్. అంబేద్కర్ జిల్లాల అధ్యక్షులు షేక్ రబ్బానీ గౌస్, పి.అలివేలు మంగతాయారు, పెర్వేల సూర్య నారాయణ మూర్తి, విజయకుమార్, మూర్తి సుధాకరవర్మ, శివన్నారాయణ పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన మున్సిపల్ ఎఇ

ప్రజాశక్తి - పిఠాపురం

సివిల్ కాంట్రాక్టర్ వద్ద నుండి రూ.40 వేలు లంచం తీసుకుంటూ మున్సిపల్ కార్యాలయంలో ని ఇంజనీరింగ్ సెక్షన్ ఎఇగా విధులు నిర్వహిస్తున్న వంశీ అభిషేక్ ఎసిబి వలకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కాడు. ఎసిబి అడిషనల్ ఎస్‌పి సౌజన్య తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం ఎసిబి అధికారులను ఈ నెల 26వ తేదీన పట్టణానికి చెందిన సివిల్ కాంట్రాక్టర్ ఎస్.సత్తిరాజు సంప్రదించాడని తాను పూర్తిచేసిన రెండు సివిల్ పనులకు సంబంధించిన ఎం బుక్స్ తయారు చేయడానికి దాన్ని ఆన్‌లైన్ నమోదు చేయించేందుకు ఎఇను సంప్రదించగా రూ.40వేలు లంచం డిమాండ్ చేసినట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు.

తమకు అందిన ఫిర్యాదు మేరకు ట్రాప్ పోసీడింగ్స్‌తో కాంట్రాక్టర్ నుండి రూ.40వేలు బుధవారం తన కార్యాలయంలోనే వంశీ అభిషేక్ లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకు న్నామని, అతని కుడి చేతిపై నిర్వహించిన రసాయన పరీక్ష సానుకూల ఫలితాన్ని ఇచ్చిందని ఆమె తెలిపారు. సదరు ఎఇ చర్చి సెంటర్లో నివాసం ఉంటున్న ఇంట్లో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి దాడులు నిర్వహించడతో అధికారులు ఉలిక్కిపడ్డారు. మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్యాలయం లోపలికి ఎవరూ రాకుండా తమ ఆధీనంలోకి తీసుకు న్నారు. ఎఇ అభిషేక్ లంచంగా తీసుకున్న రూ.40వేలను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయంలోని కంప్యూ టర్‌లో సమాచారం పలు పత్రాలను పరిశీలించారు. ఎసిబి దాడులు రాత్రి వరకు కొనసాగాయి. ఈ దాడులలో ఎసిబి సిఐలు వి.పుల్లారావు, వై.సతీష్, డి.వాసు కృష్ణ, బి.శ్రీనివాస్, ఎస్ఐ విల్సన్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు సాయమందేనా..?

- ఆదుకోని సిసిఆర్ కార్డులు
- బీమా, మద్దతుధర ఎండమావే



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో కౌలు రైతులకు సాయం అందేనా అనే ప్రశ్న తలెత్తుతోంది. జిల్లా రైతాంగం ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ సాయం లభించని రైతులు ప్రైవేట్ అప్పుల కోసం పరుగులు తీస్తున్నారు. ప్రతి ఏటా జిల్లాలో సుమారు 2 లక్షలకు పైగా ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా ప్రతి ఏటా సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. సాధారణ రైతులతో పోల్చితే కౌలు రైతులకు ప్రత్యక్షంగా కౌలు భారంతో పాతటు పరోక్షంగా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. బ్యాంకు రుణాలతో మొదలై, పంటలకు బీమా, దిగుబడులకు మద్దతు ధరా పూర్తిగా ఎండమావిలా మారుతున్నాయి. రైతులు, రైతు సంఘాల పోరాటాల ఫలితంగా పాలక ప్రభుత్వాలు ఎట్టకేలకు కౌలు రైతులకోసం సిసిఆర్ (క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులను అందజేశాయి. కానీ రైతుల సంక్షోభాన్ని ఈ కార్డులు ఏమాత్రం పరిష్కరించడం లేదు. ఈ కార్డులు అందించేందుకు భూయజమాని అనుమతి తప్పనిసరి చేయడమే ఈ దుస్థితికి కారణమని తెలుస్తోంది.

అత్యధిక మంది సాగుదారులు కౌలు రైతులే...

తూర్పు గోదావరి జిల్లాలో లక్ష మందికిపైగా కౌలు రైతులు ఉండటారని అంచనాగా తెలుస్తోంది. సాగు వ్యయంలో కౌలుతో సహా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత వెచ్చించినా ప్రకృతి విపత్తులతో పంట చేతికి రాని సందర్భాలు అధికంగా ఉంటున్నాయి. దీంతో భారీగా కౌలు రైతులు నష్టపోతున్నారు. సిసిఆర్ (క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులు అందజేయడం ద్వారా కొంత ఊరట లభించే అవకాశాలు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 50 శాతం మంది కౌలు రైతులు గుర్తింపునకు నోచుకోవడం లేదు. ఫలితంగా పెట్టుబడి సాయం, పంట ఉత్పత్తులను అమ్ముకోవడం, నష్ట పరిహారం లేదా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంటల రుణం ఇలా ఏది వర్తించాలన్నా సిసిఆర్ కార్డు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అధికారులు సకాలంలో స్పందించి కౌలు రైతులందరికీ సిసిఆర్ కార్డులు అందజేయాలని కౌలు రైతు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కౌలు రైతులకు సాయం కరువు

సొంత భూమి ఉన్న రైతులు ప్రభుత్వం అందించే అరకొర రాయితీ విత్తనాలతో పాటు ఇప్పటికే వారి ఖాతాలో జమ అయిన రైతు భరోసా కొంత ఊరటనిస్తోంది. దీంతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ కౌలు రైతుల పరిస్థితి అగమ్య గోచరంగామారింది. సిసిఆర్‌సి కార్డుల ప్రక్రియ తాజాగా ప్రారంభమైంది. గతంలో కార్డులు ఉన్న రైతులు కూడా మళ్లీ రెన్యువల్ చేయించుకుంటేనే మనుగడలోకి వస్తుంది. భూ యజమాని అనుమతితో కార్డును రెన్యువల్ చేయించుకోవాలి. ఈ ప్రక్రియ మొత్తం మేలో ముగించి ఖరీఫ్ ప్రారంభమయ్యే జూన్ నెల మొదటి రెండు వారాల్లో రైతులకు కార్డులు ఇవ్వాలి. ఈ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నారు మడులు వేసుకునేందుకు రైతులు ప్రైవేట్ అప్పులను ఆశ్రయిస్తున్నారు. మరో వైపు కౌలు ఒకొక్క మండలంలో ఒకొక్క విధంగా వసూలు జరుగుతోంది. నీటి సౌకర్యం బాగా ఉంటే ఎకరాకు వేలకు వేలు కౌలు కట్టాలి. లేదా పంటలో మూడో వంతు చెల్లించాల్సి వస్తుంది. ప్రకృతి విపత్తులతో నష్టం వచ్చినా కౌలు చెల్లించక తప్పడంలేదు. మార్కెట్‌లో ధర లేకపోయినా నష్టపోవాల్సిందే. ఈ బాధలు పడలేక చాలామంది వ్యవసాయానికి దూరమవుతున్నారు.

భూ యజమానులు వెనకడుగు

భూ యజమానులు అనుమతి పత్రాలు అందించేందుకు వెనకడుగు వేయడంతో కౌలు రైతులు ప్రభుత్వ ఫలాలకు దూరమవుతున్నారు. కౌలుదారులకు న్యాయం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ముందు భూ యజమానులకు సిసిఆర్ కార్డులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలి. కౌలు రైతులకు ఈ కార్డు ఇవ్వడానికి అంగీకరిస్తే తమ భూహక్కుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలియజెప్పాలి. ఈ కార్డు మనుగడలో ఉండేది కేవలం 11 నెలలే కాబట్టి తరువాత యజమాని కౌలుదారును మార్చుకున్నా లేక కౌలును రద్దు చేసుకున్నా ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించాలి. కానీ క్షేత్ర స్థాయిలో వీటి మీద అవగాహన కల్పించాల్సిన యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపడం లేదు. దీనివల్ల జిల్లావ్యాప్తంగా 50 శాతం మంది మాత్రమే కౌలు రైతులుగా గుర్తింపు పొందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా జిల్లా రైతాంగానికి ఇచ్చే వేల కోట్ల రుణ పద్దులో కౌలు రైతుల వాటా 10 శాతం ఉండాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ వాస్తవానికి ఈ వాటా చాలా తక్కువగా ఉంటోంది. వీరికి అందించే రుణం 2 శాతం కూడా దాటడం లేదు.

రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైంది

జిల్లాలో 67 వేల మందికి సిసిఆర్‌సి కార్డులు గతంలో అందజేశాము. రూ.సుమారు 21 కోట్లు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేశాము. తాజాగా రెన్యువల్ ప్రక్రియ ప్రారంభమైంది. జూన్1వ తేదీ నుంచి సాగునీరు విడుదలవుతోంది. రైతులకు పెట్టుబడి సాయంకోసం ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా నిధులు విడుదల చేస్తోంది. అదే విధంగా కౌలు రైతులకు సిసికార్డుల మంజూరులో భూ యజమానులకు దశల వారీ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము. వాలంటీర్లు వ్యక్తిగతంగా కలిసి వివరిస్తున్నారు. కౌలు రైతులకు సహకరించాలని భూయజమానులను కోరుతున్నాము.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

- వైద్యానికి ఎపి జెన్‌కో సహకారం

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్రాఒడిశా సరిహద్దుల్లో గిరిజన మహిళ పాముకాటుకు గురై తీవ్ర అస్వస్థతకు గురైంది. వివరాలివి. గుంటువాడ పంచాయతీకి చెందిన వంతల నాగమ్మ మంగళవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పాము కాటేసింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అప్రమత్తమై సీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య సేవలకు తీసుకొచ్చారు. సీలేరు పిహెచ్‌సిలో పాముకాటు వ్యాక్సిన్ లేకపోవడంతో చింతపల్లి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. అయితే చింతపల్లి తీసుకెళ్లేందుకు బాధిత మహిళ కుటుంబసభ్యులు నిరాకరించి, తమ గ్రామానికి తీసుకుపోతాయమని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న ఎపి జెన్‌కో యంత్రాంగం వెంటనే స్పందించి, బాధిత మహిళను ఎపి జెన్‌కో సిఆర్ఎస్ అంబులెన్సులో వైద్యసిబ్బంది సాయంతో ఒడిశాలోని చిత్రకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మల్కన్‌గిరి ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యసేవ కోసం తరలించేందుకు ఎపి జెన్‌కో వైద్య సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

కాకినాడలో సినీనటి అనసూయ సందడి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడలో సినీనటి అనసూయ సందడి చేశారు. వస్త్రశ్రేణి ప్రపంచంలో మరో నూతన షోరూమ్ ఇభ కాకినాడ టూటౌన్ సెంటర్ హెూండా షోరూమ్ ఎదురుగా బుధవారం సినీనటి అనసూయ ప్రారంభించారు. అభిమానులు అనసూయకు ఘన స్వాగతం పలికారు. అభిమానులకు అభివాదం చేస్తూ వారితో ఫోటోలు దిగారు. షోరూమ్ అధినేతలు, అభిమానులు సందడి మధ్య ఇభ షోరూమ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్త్ర ప్రపంచంలో రోజురోజుకూ ఫ్యాషన్లు మారిపోతున్నాయని, అందుకు అను గుణంగా రకరకాల డిజైన్లతో నూతన షోరూమ్ ఇభ కాకినాడలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

ఓటిటిల్లోనూ 'ధూమపాన' హెచ్చరికలు ఉండాల్సిందే

- కేంద్రం ఆదేశాలు

న్యూఢిల్లీ : ధూమపాన వ్యతిరేక హెచ్చరికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఓవర్-ది-టాప్ (ఓటిటి) ప్లాట్‌ఫామ్స్‌కు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరమని తప్పనిసరిగా ప్రదర్శించాలని చెప్పింది. ప్రచురణకర్తలు యాంటీ-టొబాకో వార్నింగ్స్ ప్రచురించడానికి సంబంధించిన కొత్త నిబంధనలతో ఓ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ నిబంధనలను అమలు చేయడంలో విఫలమైతే, కఠిన శిక్షలు తప్పవని స్పష్టం చేసింది.థియేటర్లలో ప్రదర్శించే సినిమాలు, టెలివిజన్ కార్యక్రమాల్లో పొగాకు ఉత్పత్తుల వినియోగానికి వ్యతిరేకంగా హెచ్చరికలు ప్రదర్శిస్తుండటం తెలిసిందే. ఇదే విధంగా ఓటీటీ ప్లాట్‌ఫాంలో ప్రదర్శించే ఏదైనా కార్యక్రమంలో పొగాకు ఉత్పత్తులు, వాటి వినియోగం కనిపిస్తున్నపుడు తెర క్రింది భాగంలో ప్రముఖంగా, స్థిరంగా కనిపించే విధంగా యాంటీ-టొబాకో హెల్త్ వార్నింగ్‌ను ప్రదర్శించాలని ఆదేశించింది. ఈ నిబంధనలను అమలు చేయడంలో విఫలమయ్యేవారికి కేంద్ర ఆరోగ్య, సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖలు నోటీసులు జారీ చేస్తాయి. వివరణ కోరుతాయి, వివరణ ఇచ్చేందుకు, మార్పులు చేసేందుకు తగిన సమయాన్ని ఇస్తాయి. సినిమాలు, ఆడియో-విజువల్ ప్రోగ్రాములు, డాక్యుమెంటరీలు, టెలివిజన్ ప్రోగ్రాములు, సీరియల్స్, సిరీస్, పాడ్‌కాస్ట్‌లు, ఇతర కంటెంట్‌కు ఈ నిబంధనలు వర్తిస్తాయి.

ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కు జనాదరణ రోజు రోజుకూ పెరుగుతున్న సమయంలో, ముఖ్యంగా మైనర్ల మనసులపై ఎక్కువ ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో యాంటీ-టొబాకో హెల్త్ వార్నింగ్ వల్ల కొంత వరకు ప్రయోజనం ఉండవచ్చు. పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని నిరుత్సాహపరిచేందుకు ప్రభుత్వం చట్టాన్ని అమలు చేస్తోంది. పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష ప్రకటనలను నిరోధిస్తోంది. మే 31న ధూమపాన వ్యతిరేక దినంగా పాటిస్తారు.

ఛార్‌ధామ్‌లో యాత్రికుల రద్దీ

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్‌లోని చార్‌ధామ్ యాత్రకు ఈ ఏడాది విపరీతమైన రద్దీ నెలకుంది. యాత్రీకులు పోటెత్తుతున్నారు. దీంతో మంచు కొండల్లో ప్రయాణానికి అసౌకర్యం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రకు వచ్చే ప్రజలకు ఉత్తరాఖండ్ పోలీసులు కీలక సూచన చేశారు. సామర్థ్యం కంటే అనేక రెట్లు ఎక్కువగా యాత్రీకులు భక్తులు వస్తున్నారని, నవంబర్ వరకు ఈ యాత్ర కొనసాగుతున్నందున.. అందుకు అనుగుణంగా భక్తులు తమ దర్శన సమయాన్ని మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'మే, జూన్‌లోనే ఈ యాత్ర ఉంటుందని చాలామంది భక్తులు భావిస్తుంటారు. నవంబర్ రెండో వారం వరకూ ఈ యాత్ర కొనసాగుతుంది. దర్శించడానికి సెప్టెంబర్ రెండో వారం తర్వాత అనుకూలమైన సమయం. అందుకే అందుకు అనుగుణంగా భక్తులు తమ ప్రయాణాన్ని మార్చుకోండి' అని ఉత్తరాఖండ్ డిజిపి అశోక్ కుమార్ సూచించారు.మరోవైపు వాతావరణ సమాచారాన్ని ముందే తెలుసుకుంటూ యాత్రకు బయలుదేరాలని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కూడా చార్‌ధామ్ యాత్రీకులకు విజ్ఞప్తి చేశారు. బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ అజేంద్ర అజయ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏప్రిల్ 25నుంచి ఇప్పటివరకు కేదార్‌నాథ్‌ను 6లక్షల మంది సందర్శించారు. బద్రీనాథ్ తెరిచినప్పటి (ఏప్రిల్ 27) నుంచి 5లక్షల మంది దర్శించుకున్నారు. ఈ రెండు ఆలయాలను నిత్యం సరాసరి 20వేల మంది సందర్శిస్తున్నారని.. కానీ అక్కడి సామర్థ్యం రోజుకు కేవలం 10వేలు మాత్రమేనని తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు


- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

భోపాల్ : మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మరణించారు. పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా హర్దా జిల్లాలో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. వేగంగా వెళ్తోన్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు సజీవ దహనమయ్యారని పోలీసులు తెలిపారు. మరణించిన వారిలో ఇటీవల వివాహమైన ఒక నూతన జంట ఉన్నట్లు గుర్తించామన్నారు. అగ్నిమాపక సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని చూడగా అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైందని పేర్కొన్నారు. మృతుల్లో ముగ్గురు మగవాళ్లు, ఒక మహిళ ఉన్నారని తెలిపారు. ఈ ఘటనలో మృతిచెందిన జంటకు ఆరు నెలల క్రితమే వివాహమైందని చెప్పారు. తదుపరి విచారణ కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు.

డిప్యూటీ మేయర్ రేవతిదేవి రాజీనామా

జూన్ 8న ఎన్నిక : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



నగర డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను మేయర్ వెంపడాపు విజయలక్ష్మికి అందజేయగా, ఆమె ఆమోదించినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఈ నెల 8న నగర డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని.. జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. 2021 ఆగస్టు నాలుగో తేదిన నగర డిప్యూటీ మేయర్-1గా ఇసరపు రేవతి దేవి ఎన్నికయ్యారు. ఈ నెల 8న ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో డిప్యూటీ మేయర్-1 ఎన్నికను నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

కొలగానహళ్లిలో విషజ్వరాలు

పలువురు ఆస్పత్రి పాలు

ప్రజాశక్తి -బొమ్మనహాల్ (అనంతపురం)

అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండల పరిధి లోని కొలగానహళ్లి గ్రామంలో విష జ్వరాలు ప్రబలినట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. విషజ్వరంతో బాధపడుతున్న హరిజన గంగమ్మ, సోము, కావలి సుశీలమ్మ, రాజన్న, గోవిందు, వన్నక్క, ఉపేం ద్ర, హరిజన లక్ష్మి తదితరులు కణేకల్లు ఆర్‌డిటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరికొందరు బళ్లారిలోని ఓపిడి, ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, కొందరు గ్రామంలోనే ఆర్‌ఎంపి డాక్టర్ల వద్ద చికిత్స పొందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి విష జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముంపు నివారణకు

ముందస్తు చర్యలు చేపట్టాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-బుట్టాయగూడెం(ఏలూరు జిల్లా)



త్వరలో వర్షాకాలం రానున్న నేపథ్యంలో పోలవరం నిర్వాసిత గ్రామాలను మరోసారి గోదావరి వరదలు ముంచెత్తే ప్రమాదం ఉందని, సహాయ కార్యక్రమాల కోసం ముందస్తు చర్యలు తీసుకుని యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బుట్టాయగూడెం ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశంకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం జూలైలో గోదావరికి వచ్చిన వరదల నష్టాల నుండి ప్రజలు ఇప్పటి వరకూ కోలుకోలేదన్నారు. పోలవరం మునక ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలు ఎలాంటి అభివృద్ధికీ, సంక్షేమానికీ నోచుకోక అడవుల్లో చెట్లు, పుట్టలపాలై బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తికాకముందే గత జూలైలో వరదలతో వందలాది గ్రామాలు మునిగిపోయాయని, వరదల్లో మునిగిపోయిన గ్రామాల ప్రాతిపదికపై పోలవరం నిర్వాసితుల పునరావాసానికి చర్యలు తీసుకోవాలని ఆనాటి నుండి సిపిఎంతో సహ వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని కేంద్రం, ఏజెన్సీ గిరిజన ప్రజలకు ఎలాంటి సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

పునరావాసానికి నిధులు ఇవ్వలేదని, రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో మరో 32 గ్రామాలను కొత్తగా చేర్చి 41.15 మీటర్ల వద్ద మునుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామాలకు వాస్తవంగా గత వరదల్లో మునిగిన గ్రామాలకు పొంతనే లేదన్నారు. గత వరదల సమయంలో 150 గ్రామాలు ముంపునకు గురయ్యాయని, పునరావాస కాలనీలు సైతం ఈ వరదల్లో మునిగాయనే వాస్తవాన్ని గమనిస్తే ఈ కాంటూరు లెక్కలన్నీ తప్పుల తడకలేనని విమర్శించారు. కాంటూరు లెక్కలు తప్పని గత వరదలే ప్రామాణికమన్నారు. శాస్త్రీయ ప్రాతిపదికపై రీసర్వే చేసి దాని ఆధారంగా అన్ని గ్రామాలకు పూర్తిస్థాయి పునరావాస చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఎం జగన్ అధికారంలోకి రావడంతోనే నష్టపరిహారాన్ని 6.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచుతామని వాగ్దానం చేశారే కానీ, నేటి వరకూ అమలు చేయలేదన్నారు. ఈ నాలుగేళ్లలో భూముల విలువ మరింత పెరిగినా, ఆ విలువల ప్రకారం ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలన్నారు. 2023 సెప్టెంబర్ వరకూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాస ప్యాకేజీని అందించాలని కోరారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాకలో జూన్ 20 నుండి జూలై పదో తేదీ వరకూ విజయవాడకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించి ఏళ్లు గడుస్తున్నా కనీసం సదుపాయాలు కల్పించలేదన్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికీ తాగునీరు, ట్రాక్టర్ ట్యాంకర్‌తో నిర్వాసితులకు సరఫరా చేస్తున్నారనిచెప్పారు. పునరావాస కాలనీలకు శ్మశాన వాటికలు లేవని, బడి, అంగన్వాడీ, ఆసుపత్రి, షాపింగ్ కాంప్లెక్స్ తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈనెల 12న తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపడుతు న్నామని చెప్పారు. ఈ పాదయాత్రకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు జి.వెంక ట్రావు, టి దుర్గారావు, వై.నాగేంద్రరావు, టి ముత్యాలమ్మ, డి.రమేష్, ఎం.జీవరత్నం, టి.సత్య నారాయణ, పి.మంగరాజు, కె.శ్రీని వాస్, ఎ.ఫ్రాన్సిస్, ఎం.దుర్గారావు, పి.నాగేశ్వ రావు, ఎస్.బుల్లెమ్మ పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టులో చిరుత కలకలం

ప్రజాశక్తి - పోలవరం (ఏలూరు జిల్లా)



పోలవరం ప్రాజెక్టు పరిధిలో చిరుతపులి సంచరిస్తుందని, ప్రాజెక్టు కార్మికులు, తరచూ అడవిలో సంచరించేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీ క్షేత్రాధికారి దావీదు రాజు సూచించారు. బుధవారం తెల్లవారుజామున పోలవరం ప్రాజెక్టు వాహనానికి స్థానిక 902 హిల్ ప్రాంతంలో గోదావరిలోకి తాగునీటి కోసం దిగి వెళుతున్న చిరుతపులి కనిపించడంతో ప్రాజెక్టు కార్మికులు భయాందోళనకు గురయ్యారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు చిరుతపులి సంచరించిన ప్రాంతానికి వెళ్లి పాదముద్రలు పరిశీలించారు. అనంతరం దావీదు రాజు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కార్మికులు బహిర్భూమికి బయటకు వెళ్లడం, సరదాగా అడవుల్లో సంచరించడం చేయరాదని, ప్రాజెక్టు కార్మికులు చికెన్ వ్యర్థాలు, ఇతర మాంసాహార పదార్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడవేయరాదని, అడవుల్లో కట్టెలు కొట్టుకునే వారు కలప కోసం వెళ్లేవారు రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో సంచరించరాదని హెచ్చరించారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పివి.మధుకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ డి.రాజేష్ చిరుతపులి సంచరించిన ప్రాంతాల్లో పాదముద్రల సేకరణలో పాల్గొన్నారు. అనంతరం పోలవరం ప్రాజెక్టు కార్మికుల లేబర్ క్యాంపులో చిరుత సంచారంపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పించారు.

మాకు న్యాయం చేయండి మహాప్రభో..!

- నోటీసులివ్వకుండా మా ఇళ్లు జెసిబితో ధ్వంసం చేశారు
- సర్పంచి భర్త కక్ష సాధింపు చర్యలు సరికావు
- చేవూరు ఎస్‌టి కాలనీ వాసుల ఆవేదన

ప్రజాశక్తి - ముదినేపల్లి (ఏలూరు జిల్లా)



"గ్రామ సర్పంచి భర్త ఆగడాలకు మేము రోడ్డున పడ్డాం. మాకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, మేము ఇంటి వద్ద లేని సమయంలో జెసిబితో మా ఇళ్లు ధ్వంసం చేశారు. దీంతో మాకు రూ.ఐదు లక్షల మేర ఆస్తి నష్టం సంభవించింది" అని మండలంలోని చేవూరు గ్రామ ఎస్‌టి కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు కట్టా సుబ్బారావు, కట్టా ఏడుకొండలు, కుంభ వెంకటేశ్వరరావు, కుంభా నాంచారమ్మ తమ బాధను వివరించారు. మండలంలోని చేవూరు గ్రామంలో గత 108 సంవత్సరాలుగా మంచినీటి చెరువు వద్ద ఎస్‌టిలు జీవిస్తున్నారు. ఇంటిపన్ను, కరంట్ బిల్లు, ఇంటి పట్టా అన్నీ ఉన్నాయన్నారు. ఎస్‌టిలు ఇంటి వద్ద లేని సమయంలో ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా గ్రామ సర్పంచి భర్త వల్లభనేని వెంకట్రావు, గ్రామ విఆర్‌ఒ, అధికారులు, పోలీసులుతో వచ్చి తమ ఇళ్లను జెసిబితో కూల్చివేశారని వాపో తున్నారు. రెండు ఇళ్లల్లో నాలుగు కుటుంబాలు నివాసి స్తున్నాయన్నారు. ఇళ్ల కూల్చి వేత విషయం తెలుసుకుని పరుగు, పరుగున వచ్చి అడ్డుకోబోగా తమను సర్పంచి భర్త వెంకట్రావు దుర్భాషలాడినట్లు తెలిపారు. "మీరు ఇక్కడ ఉండడానికి వీలు లేదు, వెంటనే వెళ్లిపోవాలి, కూల్చివేత పనులు అడ్డుకుంటే మిమ్మల్ని కూడా ఇంటితో పాటు జెసిబితో తొక్కించి వేస్తాం' అని బెదిరించినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో ఇళ్లల్లోని టివిలు, బీరువాలు, గృహోపకరణాలన్నీ పగిలిపోయినట్లు చెప్పారు. అంతేకాకుండా ఇళ్లను, ఇళ్లల్లోని అన్నీ వస్తువులను జెసిబితో తీసుకువెళ్లి చెరువులో పూడ్చివేసినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో రూ.ఐదు లక్షలు మేర ఆస్తి నష్టం జరిగినట్లు ఎస్‌టిలు చెబుతున్నారు. తరతరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్న తమను కక్షసాధింపుతో వెంకట్రావు తొలగించాలని చూస్తున్నారన్నారు. వైసిపికి చెందిన వారు కాదని, వేరే పార్టీకి చెందిన వారంటూ వెంకట్రావు తమపై పెట్టే హింసాకు చనిపోవాలనిపిస్తుందంటూ ఎస్‌టి మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణమైన వల్లభనేని వెంకట్రావుపై అధికారులు తగిన చర్యలు తీసుకొని, కూల్చివేసిన తమ ఇళ్లను తిరిగి పునఃనిర్మించాలని, నష్టపోయిన తమకు నష్టపరిహారం ఇప్పించి, తాము ఇక్కడే ఉండేవిధంగా అధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఎస్‌టి కాలనీ వాసులు కోరుతున్నారు.

చెరువు విస్తరణ చేయాలి: గ్రామ సర్పంచి వి.లక్ష్మి

గ్రామ జనాభాకు నీరు అందించేందుకు సరిపడ చెరువు సామర్థ్యం లేదు. చెరువు విస్తరణ పనులు చేయాలి. ఎస్‌టిలకు ముందస్తు నోటీసులు ఇచ్చాం. వారిలో ఇద్దరికి ఇళ్ల స్థలాలు ఇచ్చాం. ఎస్‌టిలు చెరువు గట్టుపై పందులను పెంచుతున్నారు. అవి చెరువులో దిగి నీటిని కలుషితం చేస్తున్నాయి. నా భర్త వెంకట్రావు ఎస్‌టిలను దుర్భాషలాడలేదు. అందులో నిజం లేదు.

రామాపురంలో ఘర్షణ

దాడులకు తెగబడిన గ్రామస్తులు

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా వేటపాలెం మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఆధిపత్య పోరు పరాకాష్టకు చేరింది. పోలీస్ టికెటింగ్ కొనసాగుతుండగానే గ్రామంలో రెండు గ్రూపులు దాడులకు తెగబడ్డాయి. ఈ దాడులలో చీరాల రూరల్ సిఐ ఎ.మల్లికార్జునరావుకు, వేటపాలెం హెడ్ కానిస్టేబుల్ గంగాధర్‌కు, చీరాల టూటౌన్‌కి హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామ కట్టుబాట్లను మీరినందున మూడు నెలల క్రితం రామాపురం గ్రామం నుంచి బహిష్కరణకు గురైన 85 మత్స్య కుటుంబాలను తిరిగి గ్రామంలో కలిపేందుకు కొందరు నాయకులు ఇటీవల రాజీచేశారు. ఘర్షణలు తలెత్తే ప్రమాదం ఉందన్న నేపథ్యంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. బహిష్కరణకు గురైన వ్యక్తి గ్రామంలోని ఓ వ్యక్తిపై మంగళవారం దాడి చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం స్థానిక మహిళలకు బహిష్కరణకు గురైన మహిళలకు గొడవ జరిగింది. చీరాల రూరల్ సిఐ మల్లికార్జునరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వివాదాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నం చేశారు. సిఐ సమక్షంలోనే మళ్లీ రెండు గ్రూపుల వాళ్లు రాళ్లు, కర్రలతో దాడికి దిగారు. ఈ దాడిలో చీరాల రూరల్ సిఐ, వేటపాలెం హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, చీరాల టూటౌన్ హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన సిఐతో పాటు మరికొందరు పోలీసులు పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘర్షణలో ఏడుగురి గ్రామస్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు చిన్న పిల్లలు సైతం తీవ్రంగా గాయపడ్డారు. వీరందరూ చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. బాపట్ల డిఎస్‌పి టి వెంకటేశు, చీరాల డిఎస్‌పి ఎస్ ప్రసాదరావు ఘర్షణను అదుపు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

బంగారు, వెండి నగలు స్వాధీనం: డిఎస్‌పి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమయ్య జిల్లా రాజంపేట పట్టణం టి.అగ్రహారానికి చెందిన చెందిన ముద్దపోలు నవీన్ కుమార్ అనే అంతర్రాష్ట్ర దొంగను పట్టణ పోలీసులు ఈనెల 22వ తేదీన అరెస్టు చేసి అతని వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీన పరచుకున్నారు. బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి చైతన్య దొంగతనానికి చెందిన వివరాలను వెల్లడించారు. టీ.అగ్రహారానికి చెందిన నవీన్ కుమార్ పై గతంలోనే 12 దొంగతనాల కేసులు ఉన్నాయని తెలిపారు. పలు దొంగతనాలకు పాల్పడుతున్న నవీన్ కుమార్‌ను 22వ తేదీన టీ అగ్రహారానికి వెళ్లే దారిలో అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి రెండు కెనాన్ కెమెరాలను స్వాధీన పరుచుకుని విచారించగా వెండి, బంగారు ఆభరణాల దొంగతనాలకు కూడా పాల్పడినట్లు వెల్లడించాడని తెలిపారు. అతని వద్ద నుంచి వెండి పాత్ర, చెంబు, దీపపు కుందులు, గిన్నెలు, కుంకుమ భరణి, లక్ష్మీదేవి విగ్రహాలు, వెండి బిల్లలు, గంధం గిన్నెలు వంటి రూ లక్ష 15 వేలు విలువ చేసే తదితర వెండి వస్తువులతో పాటు, రూ 18 వేలు విలువచేసే బంగారు ఉంగరం కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. ముద్దాయిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.



చినవెంకన్నకు రూ.2.32 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి-ద్వారకాతిరుమల (ఏలూరు జిల్లా)

ప్రముఖక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి యాత్రికుల విరాళాల ద్వారా రూ.2,32,56,651 ఆదాయం లభించింది. ఆలయ హుండీలను బుధవారం ఉదయం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ లెక్కించారు. 20 రోజులకుగాను చేపట్టిన ఈ లెక్కింపులో నగదు రూపేణ పైనపేర్కొన్న నగదు, బంగారం 442 గ్రాములు, వెండి ఆరు కేజీల 572 గ్రాములు, పాత రూ.500 నోట్లు తొమ్మిది, రూ.వెయ్యి నోట్లు 11, పలు దేశాల కరెన్సీ సైతం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

కర్ణాటకలో ఎన్ఐఎ సోదాలు

బెంగళూరు : కర్ణాటకలోని సుమారు 16 ప్రాంతాల్లో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) బుధవారం సోదాలు నిర్వహించింది. రాత్రి వరకూ కూడా ఈ సోదాలు కొనసాగాయి. 2022 జూలైలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాట్నాలో పర్యటించినపుడు ఆయన్ను హత్య చేసేందుకు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) కుట్ర పన్నినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో భాగంగా ఈ సోదాలు జరుగుతున్నాయి. పుత్తూరు, కుర్మడ్క, తరిపడ్పు, కుంబ్ర గ్రామాలకు చెందిన మహమ్మద్ హారిస్ కుంబ్ర, సజ్జద్ హుస్సేన్ కొడింబడి, ఫైజల్ అహ్మద్ తరిగుడ్డే, షంషుద్దీన్ కుర్నడ్కలను ఎన్ఐఎ అధికారులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసుల సహకారంతో ఎన్ఐఎ అధికారులు సోదాలు జరుపుతున్నారు. నిషేధిత పిఎఫ్ఐ కార్యకర్తలకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఆసుపత్రుల్లో డాక్యుమెంట్లను తనిఖీ చేస్తున్నారు. మంగళూరు, పుత్తూరు, బెల్తంగడీ, ఉప్పినంగడీ, వేనూర్, బంట్వాల్ సహా మొత్తం 16 చోట్ల ఈ తనిఖీలు జరుగుతున్నట్లు ఎన్ఐఎ అధికారులు తెలిపారు. గల్ఫ్ దేశాల నుంచి హవాలా నెట్‌వర్క్ ద్వారా పిఎఫ్ఐకి నిధులు వస్తున్నాయని, దేశంలో ఉగ్రవాద దాడులకు వీరు కుట్ర పన్నుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

మసీదు కమిటీ పిటిషన్ కొట్టివేసిన అలహాబాద్ హైకోర్టు

వారణాసి: జ్ఞానవాపి మసీదు కేసులకు సంబంధించిన ఓ అంశంలో మసీదు కమిటీకి చుక్కెదురయ్యింది. శృంగార గౌరీ ఆలయంలో నిత్యం పూజలు చేసుకోవడంపై కొందరు హిందూ మహిళలు స్థానిక కోర్టులో వేసిన పిటిషన్‌ను రద్దు చేయాలని మసీదు కమిటీ వేసిన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తిరస్కరించింది. వారణాసి జిల్లా కోర్టులో వారు వేసిన పిటిషన్‌పై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. జ్ఞానవాపి మసీదు కాంప్లెక్సులో ఉన్న శృంగార గౌరీతో పాటు ఇతర ఆలయాల్లో నిత్యం పూజలు చేసుకునే హక్కు ఉందంటూ ఐదుగురు హిందూ మహిళలు స్థానిక కోర్టులో ఆగస్టు 2021లో సివిల్ సూట్ దాఖలు చేశారు. ఇది విచారణకు అర్హమైనదని వారణాసి జిల్లా కోర్టు సెప్టెంబర్ 2022లోనే పేర్కొంది. అయితే, దీనిని అంజుమన్ ఇంతెజామియా కమిటీ వ్యతిరేకించింది. ఇలా హిందూ మహిళలు వేసిన పిటిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ అంజుమన్ ఇంతెజామియా కమిటీతోపాటు యూపీ సన్నీ వక్ఫ్‌బోర్డు అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనికి సంబంధించిన వాదనలు 2022 డిసెంబర్ 23లో హైకోర్టులో ముగిశాయి. తీర్పును రిజర్వులో ఉంచిన అలహాబాద్ హైకోర్టు.. తాజాగా దానిని వెలువరించింది. జిల్లా కోర్టులో ఈ కేసు విచారణ కొనసాగించేందుకు అనుమతి ఇస్తూ తీర్పు ఇచ్చింది.

ఖలిస్తాన్ పాఠాలను తొలగింపు

న్యూఢిల్లీ : 12వ తరగతి రాజనీతి శాస్త్రం పాఠ్యపుస్తకం నుండి ఖలిస్తాన్‌కు సంబంధించిన అంశాలను తొలగించినట్లు ఎన్‌సిఇఆర్‌టి తెలిపింది. గత నెలలో శిరోమణి గురుద్వార ప్రబంధక్ కమిటీ లేవనెత్తిన అభ్యంతరాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సిక్కుల చరిత్ర వివరాలను ఎన్సీఈఆర్టీ తప్పుగా చూపిందని కమిటీ ఆరోపించింది. పాఠ్యపుస్తకంలో ఆనంద్‌పూర్ సాహిబ్ తీర్మానాన్ని ప్రస్తావించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. 1973లో ఈ తీర్మానాన్ని శిరోమణి అకాలీదళ్ ఆమోదించింది.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికే నష్టం

(మొదటి పేజీ తరువాయి)

నియంత్రించినందుకు అవి మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

ఇందిరా ప్రభుత్వం 1976లో ఎమర్జెన్సీ సమయంలో రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా 2002 వరకు కొత్త డీలిమిటేషన్‌ను నిషేధించింది. ఆ తర్వాత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ఈ నిషేధాన్ని 2026 వరకు పొడిగించారు. 2026 నాటికి అన్ని రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల రేటు ఒకే విధంగా ఉంటుందని ప్రభుత్వం భావించింది. కానీ అలా జరగలేదు. గణాంకాలు కూడా ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి.

2011 జనాభా లెక్కల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాల సగటు జనాభా వృద్ధి రేటు 12.1 శాతం కాగా, హిందీ మాట్లాడే రాష్ట్రాల సగటు జనాభా వృద్ధి రేటు 21.6 శాతం ఉంది. అంటే హిందీ మాట్లాడే రాష్ట్రాల కంటే దాదాపు 9.5 శాతం తక్కువ. అందువల్ల ప్రతి 10 లక్షల జనాభా ఫార్ములాను అవలంబిస్తే ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే లోక్‌సభలో తమ ఉనికి తగ్గుతుందని దక్షిణాది రాష్ట్రాలు భావిస్తున్నాయి.

దక్షిణాదిలోని పార్టీలు, ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌కు మద్దతు ఇవ్వలేదు. డీలిమిటేషన్ జరిగితే బిజెపికి మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డాయి. నియోజకవర్గాల పునర్విభజనకు రాజ్యాంగ సవరణ చేపట్టాల్సి ఉంటుంది.

ఆజ్యం పోసింది పాలక పెద్దలే

(మొదటి పేజీ తరువాయి)

గ్రూపుల తరహాలోనే అతివాద గ్రూపులు దాడులకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు కుకి-జోమి గ్రామాల ప్రజలు నాటు బాంబులు, చేతితో తయారు చేసిన ఆయుధాలు, కొన్ని లైసెన్స్ తుపాకులతో తమకు తాము రక్షణ కల్పించుకుంటున్నారు. ముఖ్యమంత్రిగా ఎన్ బీరేన్ సింగ్ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడినాటి నుంచే మణిపూర్‌లో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చేందుకు కుట్రలు సాగుతున్నాయని హంసాసింగ్ చెప్పారు. కాగా తమ డిమాండ్ల పత్రాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కార్యాలయంలోనూ సమర్పించినట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చి 27న మేయితేయీ గ్రూపును షెడ్యూల్డు తెగల జాబితాలో చేర్చాలని మణిపూర్ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో రాజుకున్న హింసాగ్ని ఇప్పటికీ చల్లారడం లేదు. ఇప్పటి వరకు 115 మంది పైగా చనిపోయారు.

అటవీ హక్కుల రక్షణకు కదంతొక్కిన రైతులు

- మహారాష్ట్రలోని పాలగఢ్ కలెక్టరేట్ ముట్టడి
- వేలాదిగా తరలివచ్చిన గిరిజనులు, మహిళా రైతులు



జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడికి తరలివస్తున్న గిరిజనులు, మహిళా రైతులు

ముంబయి : మహారాష్ట్రలో అన్నదాతల ఉద్యమాలు ఉధృతంగా సాగుతున్నాయి. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) నేతృత్వంలో పాలగఢ్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని గత మే 30న ముట్టడించారు. ఈ ఆందోళన కార్యాక్రమంలో దాదాపు 25 వేల మంది పైగా అన్నదాతలు తరలివచ్చారు. వీరిలో అత్యధిక మంది గిరిజనులు, మహిళా రైతులు, వ్యవసాయ కార్మికులు భాగస్వామ్యం కావడం విశేషం. ఉప్పెనలా పోటెత్తిన రైతులు, గిరిజనులు కలెక్టరేట్‌ను దిగ్బంధించినంత పని చేశారు. అంతకుముందు కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్‌కు ఎఐకెఎస్ నాయకుల బృందం వినతిపత్రం సమర్పించారు. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం పలు ప్రధాన డిమాండ్లను నెరవేర్చేందుకు హామీ ఇచ్చింది. ఇవీ ప్రధాన డిమాండ్లు : అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఎ) కింద భూముల కోసం దాదాపు 61 వేల మంది పైగా క్లెయిమ్ చేసుకున్నారని, వారందరి ప్రస్తుత స్థితి ఎఐకెఎస్‌తో పంచుకోవాలి. కలెక్టరేట్ ముట్టడి సందర్భంగా భూహక్కుల కోసం మంగళవారం నాడు సమర్పించిన వేలాది దరఖాస్తులను సంబంధిత తహశీల్దార్ కార్యాలయాలకు పంపి సానుకూల నిర్ణయం తీసుకోవాలి. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి గిరిజనులు సాగు చేసుకున్న భూముల్లో పంట చేతికొస్తుందని, ఆ భూమలన్నింటిపైనా ఆదివాసీలకు హక్కులు కల్పించాలి. 1940లలో ఎఐకెఎస్ నేతృత్వంలో సాగిన ఆదివాసీ మహోద్యమం సమయంలో వందలాది మంది భూస్వాములను పంట పొలాల నుంచి తరిమికట్టే స్వాధీనం చేసుకున్నారని ఎఐకెఎస్ నేతలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలే, రాష్ట్ర అధ్యక్షులు ఉమేశ్ దేశ్‌ముఖ్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అజిత్ నవాలే, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిసన్ గుజార్, ఐద్వా జాతీయ ప్రధానకార్యదర్శి మరియం ధావలే, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి వినోద్ నికోల్ , స్థానిక ఎమ్మెల్యే ఎఐకెఎస్ జిల్లా అధ్యక్షులు చంద్రకాంత్ గోర్ఖానాతో సహా పలువురు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు కూడా పాల్గొన్నారు.



దళిత బాలిక కుటుంబానికి సిపిఎం పరామర్శ

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో దారుణ హత్యకు గురైన 16 సంవత్సరాల దళిత బాలిక కుటుంబాన్ని సీపీఐ(ఎం) ప్రతినిధి బృందం బుధవారం పరామర్శించింది. పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్, రాష్ట్ర కార్యదర్శి కేఎం తివారీ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం దళిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని, సంఘీభావాన్ని తెలియజేసింది. ఈ హత్య వెనుక మతపరమైన కోణం ఏమీ లేదని, కులాల మధ్య శతృత్వం కూడా లేదని బాలిక తండ్రి జనక్ రాజ్ చెప్పారు. తాను కష్టపడి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నానని ఆయన తెలిపారు. తామంతా శాంతియుత వాతావరణంలోనే జీవిస్తున్నామని వివరించారు. హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాము కోరుతున్నామని చెప్పారు. బృందా కారత్ నేతృత్వంలోని సీపీఐ (ఎం) ప్రతినిధి బృందంలో ఢిల్లీ జనవాది మహిళా సంఘటన్ (జేఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు ఆశా శర్మ, పార్టీ ఏరియా కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యులు సిద్ధేశ్వర్ శుక్లా, స్థానిక నేతలు సభ్యులుగా ఉన్నారు.

రాజస్థాన్ కాంగ్రెస్ వివాదం

- కుదరని సయోధ్య

జైపూర్: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, సచిన్ పైలెట్ మధ్య తలెత్తిన విభేదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అవినీతి కేసులపై గెహ్లాట్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిందేనని సచిన్ పైలెట్ పునరుద్ఘాటించారు. తాను ఇప్పటికే అల్టిమేటం ఇచ్చానని, బుధవారమే చివరి రోజనీ, ప్రభుత్వం స్పందించకుంటే భవిష్యత్ కార్యాచరణపై తాను నిర్ణయం తీసుకుంటానని బుధవారంనాడు రాజస్థాన్‌లోని టోంక్‌లో సచిన్ పైలట్ తెలిపారు. ఢిల్లీలో గెహ్లాట్, పైలట్‌తో మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ సోమవారం సమావేశం కావడం, ఇద్దరూ కలిసికట్టుగా పనిచేస్తారని కేసీ వేణుగోపాల్ ప్రకటించడం వంటి వరుస పరిణామాల నేపథ్యంలో పైలట్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.'అవినీతి విషయంలో మేము ఎలాంటి రాజీకి రాలేదు. ఢిల్లీలో అధిష్టానంతో జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకువచ్చాను. నేను లేవనత్తిన అంశాలపై రాజస్థాన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను. ఇవాళే ఇందుకు చివరిరోజు" అని పైలట్ తెలిపారు. అవినీతిపై ఎవరైనా రాజీ పడితే దానిని సహించరాదని, రాజస్థాన్‌లో వసుంధరా రాజే హయాంలో జరిగిన అవినీతిపై చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని పైలట్ మరోసారి స్పష్టం చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ సీనియర్ నేతలతో సమావేశానంతరం గెహ్లాట్ సైతం ఈ ఏడాది చివర్లో జరిగే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తాను, పైలట్ కలిసి పని చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సహనంతో కష్టపడి పనిచేయాలని, భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు.

7 రాష్ట్రాలకే బిజెపి పరిమితం

- ప్రాంతీయ పార్టీలదే హవా
- 13 రాష్ట్రాలలో అధికారం
- తగ్గుతున్న బిజెపి ప్రాభవం



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో బిజెపిలో టెన్షన్ పెరిగిపోతోంది. ఆ పార్టీకి లోక్‌సభలో స్పష్టమైన ఆధిక్యం ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యుల విషయానికి వచ్చేటప్పటికి ఆ సంఖ్య తక్కువగానే ఉంది. ఈ చేదునిజమే బిజెపిని కలవరపెడుతోంది. దేశంలో ప్రస్తుతం బిజెపి, కాంగ్రెస్ పార్టీలే అతి పెద్ద జాతీయ పార్టీలు. అయితే ఈ రెండు పార్టీలకూ ఉన్న ఎమ్మెల్యేల కంటే ఇతర పార్టీలకు ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యే అధికంగా ఉంది. ఇటీవల వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే బిజెపి, కాంగ్రెస్‌లతో పోలిస్తే ప్రాంతీయ పార్టీల తరఫునే ఎక్కువ మంది శాసనసభ్యులు గెలుపొందారు. ఈ పార్టీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేల సంఖ్య 1600 పైమాటే. ఈ సంఖ్యతో పోలిస్తే జాతీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్, అమ్‌ఆద్మీ పార్టీలు చాలా వెనుకబడి ఉన్నాయి.

గత ఐదు సంవత్సరాలలో వివిధ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి బలం బాగా పడిపోయింది. ఆ పార్టీ 1312 ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది. కాంగ్రెస్ తరపున 770 మంది గెలుపొందారు. వామపక్షాలకు 116, బిఎస్‌పికి 15, ఆప్‌కు 161 అసెంబ్లీ స్థానాలు లభించగా ప్రాంతీయ పార్టీలు, ఇతరులు 1679 స్థానాలు గెలుచుకున్నారు.

దేశంలోని 13 రాష్ట్రాలలో బిజెపి, కాంగ్రెస్ పార్టీల కంటే ఇతర పార్టీలకు చెందిన వారే ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అంటే 13 రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం అధికంగా ఉందన్న మాట. జనాభా ప్రాతిపదికన చూస్తే ఈ పార్టీలు యాభై కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఒడిసా, తెలంగాణ, జార్ఖండ్, మేఘాలయ, నాగాలండ్, పుదుచ్చేరి, మిజోరం, సిక్కిం రాష్ట్రాలు ప్రాంతీయ పార్టీల పాలనలో ఉన్నాయి. ఇటీవలే జాతీయ పార్టీ హోదా పొందిన అమ్‌ఆద్మీ పార్టీ రెండు రాష్ట్రాలలో అధికారంలో ఉంది. ఈ పార్టీకి పంజాబ్‌లో 92 మంది ఎమ్మెల్యేలు, ఢిల్లీలో 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కేరళలో అధికారంలో ఉన్న ఎల్‌డిఎఫ్‌కు 97 మంది శాసనసభ్యులు ఉన్నారు.

దేశ జనాభా ప్రాతిపదికన పరిశీలిస్తే బిజెపి 48.8 కోట్ల మందికి, కాంగ్రెస్ 24.4 కోట్ల మందికి, ప్రాంతీయ పార్టీలు 55.4 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. బిఎస్‌పికి 0.6 కోట్ల మందికి, అమ్‌ఆద్మీ పార్టీ 4.5 కోట్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి.

బిజెపి ఏడు రాష్ట్రాలలో అధికారంలో ఉంది. ఈ రాష్ట్రాల శాసనసభ్యులలో బిజెపికి సగం లేదా అంతకంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. అదే సమయంలో కాంగ్రెస్‌కు నాలుగు రాష్ట్రాలలో సగం కంటే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. తొమ్మిది రాష్ట్రాలలో ఇతర పార్టీల ప్రభుత్వాలు అధికారంలో కొనసాగుతున్నాయి. ఈ రాష్ట్రాలలో ఆయా పార్టీలకు 80 శాతం కంటే ఎక్కువగానే ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ విషయాలన్నీ పరిశీలిస్తే బిజెపి కంటే ప్రాంతీయ పార్టీలే బలంగా ఉన్నట్లు విదితమవుతోంది.

పుతిన్‌ను స్వాగతిస్తాం

- ఎవరి ఒత్తిడికి తలొగ్గేది లేదు
- స్పష్టం చేసిన ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్



జొహానెస్‌బర్గ్: రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్‌ను తాము స్వాగతిస్తామని దక్షిణాఫ్రికా పాలకపక్ష కూటమి మరోసారి స్పష్టం చేసింది. దక్షిణాఫ్రికాలో జరిగే బ్రిక్స్ సమావేశానికి రష్యా అధ్యక్షుడు రానున్నట్లు వార్తలు రాగానే అమెరికా దక్షిణాఫ్రికా ప్రభుత్వంపై వివిధ రూపాల్లో ఒత్తిడి తెస్తున్నది. దీనిని రమాఫోసా నేతృత్వంలోని ఎఎన్‌సి ప్రభుత్వం బేఖాతరు చేసింది. ఉక్రెయిన్‌లో యుద్ధ నేరాలకు పుతిన్ పాల్పడ్డాడని, ఆయన అరెస్టుకు ఐసిజె వారెంట్ ఇచ్చిన దృష్ట్యా దక్షిణాఫ్రికాకు ఆయన వస్తే వారెంట్ అమలు చేయాలని అమెరికా గత కొన్ని రోజులుగా ఒత్తిడి తెస్తోంది. దీనికి దక్షిణాఫ్రికా ప్రభుత్వం దీటుగానే బదులిచ్చింది. ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికా, బ్రిటన్ సాగించిన యుద్ధ నేరాలకు గాను, ఆ దేశాల అధినేతలను అరెస్టు చేశారా? అని అడిగింది. పాశ్చాత్య దేశాల కపట నీతికి ఇది మరో నిదర్శనమని ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎఎన్‌సి) ప్రధాన కార్యదర్శి ఫికిలే ఎంబలులా అన్నారు. దీంతో కుతకుతలాడిన అమెరికా ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు దక్షిణాఫ్రికా నౌకలో ఆయుధాలు పంపినట్లు తన దగ్గర ఆధారాలున్నాయని, కాబట్టి ఆ దేశంపై ఆంక్షలు విధిస్తామని బెదిరింపులకు దిగింది. ఇటువంటి బెదిరింపులకు తాము లొంగబోమని, రష్యాతో తమ చారిత్రిక సంబంధాలను ఎప్పటిలానే కొనసాగుతాయని దక్షిణాఫ్రికా తేల్చి చెప్పింది. ఆగస్టులో జరిగే బ్రిక్స్ సదస్సుకు పుతిన్ హాజరు కావాలని కోరుతున్నామని, ఆయన పర్యటనను స్వాగతిస్తామని ఎఎన్‌సి నేత చెప్పారు. సోవియట్ యూనియన్ ఉనికిలో ఉన్నకాలంలో ఎఎన్‌సికి అవసరమైన సైనిక, రాజకీయ మద్దతును ఇచ్చింది.

ఆగస్టు 23న జింబాబ్వే ఎన్నికలు

హరారే : జింబాబ్వే సార్వత్రిక ఎన్నికలు ఆగస్టు 23న జరుగుతాయి. రెండు పర్యాయాలు దేశాధ్యక్షుడిగా ఉన్న ఎమర్సన్ మాంగ్వాంగ్వా బుధవారం నాడిక్కడ ఈ విషయం వెల్లడించారు. జింబాబ్వే తిరుగులేని నాయకుడు రాబర్ట్ ముగాబెను 2017లో సైనిక కుట్ర ద్వారా కూల్చివేసిన తరువాత అధ్యక్ష , పార్లమెంటుకు ఎన్నికలు నిర్వహించడం ఇది రెండవ సారి. 2018 ఎన్నికల్లో ముగాబె వారసుడిగా ఉపాధ్యక్షుడు ఎన్నికయ్యారు. ఈ సారి మంగ్వాంగ్వాకు ప్రధాన ప్రతిపక్షమైన సిటిజెన్స్ కొయెలేషన్ ఫర్ ఛేంజి పార్టీ నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది.

బ్రిటన్‌లో ట్రెయిన్ డ్రైవర్ల సమ్మె పునరుద్ధరణ

లండన్: బ్రిటన్‌లో ట్రైన్ డ్రైవర్లు సమ్మెను బుధవారం పునరుద్ధరించారు. అవంతి వెస్ట్ కోస్ట్‌తో సహ పదిహేను కంపెనీల ట్రైన్ డ్రైవర్లు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె శనివారం కూడా కొనసాగే అవకాశమున్నందున ఆరోజు వెంబ్లీలో జరిగే పురుషుల ఎఫ్ఎ కప్ ఫుట్‌బాల్ టోర్నీ ఫైనల్‌కు విఘాతం కలగవచ్చు. నాలుగేళ్లుగా వేతన సవరణ చేయకుండా తొక్కిపట్టడంపై రైలు డ్రైవర్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. గత ఏడాది సమ్మర్‌లో టూల్ డౌన్ ఆందోళనతో ప్రారంభమైన ఈ పోరాటం దీర్ఘకాలంగా కొనసాగుతోంది. వేతన పెంపుపై అమీ తుమీ తేల్చుకోడానికే రైల్వే యూనియన్లు నిశ్చయించుకున్నాయి. నార్తర్న్ ట్రైయిన్స్, సౌత్ ఈస్టరన్ తో సహా అన్ని జోన్లలో రైలు డ్రైవర్లు సమ్మెకు దిగడంతో రైళ్ల రాకపోకలు స్తంభించాయి. ఆర్ఎంటి రైల్ యూనియన్ల సభ్యులు ఈ సమ్మెకు మద్దతుగా టూల్ డౌన్ నిరసన చేపట్టారు.

ఇండియా గేట్‌కు నోఎంట్రీ

(మొదటి పేజీ తరువాయి)

మైనర్‌కు ప్రత్యక్ష ముప్పును పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు, పోలీసులను ఆదేశించింది. వారికి భద్రత కల్పించాలి. అటువంటి సందర్భంలో, ప్రాణాలతో బయటపడిన మైనర్ గుర్తింపును బహిర్గతం చేసే చర్యను తీవ్రంగా పరిగణించాలి' అని సమన్లలో పేర్కొన్నారు.

నేడు ముజఫర్‌నగర్‌లో మహాపంచాయత్ : నరేష్ టికాయిత్

రెజ్లర్లకు మద్దతుగా నేడు (గురువారం) ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్‌లో మహా పంచాయత్ నిర్వహించనున్నట్టు రైతు నేత నరేష్ టికాయిత్ ప్రకటించారు. సుప్రీం కోర్టులో రెజ్లర్ల తరపున వాదించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పోక్సో కేసులో ఇతరులను అయితే వెంటనే అరెస్టు చేస్తారని, కాని బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను మాత్రం అరెస్టు చేయరని విమర్శించారు.

మీడియాకు ముఖం చాటేస్తూ కేంద్రమంత్రి పరుగు

రెజ్లర్ల నిరసన గురించి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖిని మీడియా ప్రశ్నించగా.. సమాధానం చెప్పకుండా ఆమె పరుగు పరుగున అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కేంద్రంలో బిజెపి తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి మీనాక్షి లేఖిని విలేకరులు కలిసి "రెజ్లర్ల ఆందోళనపై మీ స్పందన ఏంటి?" అని ఆమెను ప్రశ్నించారు. దీంతో ఆమె మీడియానుంచి తప్పించుకునేందుకు అక్కడి నుంచి పరుగు తీశారు. కేంద్రమంత్రి 'చలో.. చలో.. చలో' అంటూ తన కారు వద్దకు పరిగెట్టిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

విచారణ పూర్తయ్యేవరకు వేచి ఉండండి: కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

డబ్ల్యూఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ రెజ్లర్ల ఆందోళనలపై కేంద్ర యువజన, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తొలిసారి స్పందించారు. ఢిల్లీ పోలీసులు తమ విచారణ పూర్తి చేసేంత వరకూ రెజ్లర్లు వేచిచూడాలని విజ్ఞప్తి చేశారు. రెజ్లర్లు తీసుకునే చర్య వల్ల క్రీడలు, రెజ్లర్లు కావాలనుకునే వారి ఆకాంక్షలకు నష్టం వాటిల్లుతుందని అన్నారు. క్రీడలు, క్రీడాకారులకు తాము సానుకూలమని చెప్పారు.

మోడీ... గో బ్యాక్

- అజ్మీర్‌లో ప్రధానికి నిరసన ట్వీట్లతో స్వాగతం

న్యూఢిల్లీ : 'మోడీ...గో బ్యాక్' అంటూ వేలాది మంది ప్రజలు సామాజిక మాధ్యమాలలో ట్వీట్ చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల పాలనకు గుర్తుగా నెల రోజుల పాటు ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని బీజేపీ నిర్ణయించింది. ఇందులో భాగంగా మోడీ బుధవారం రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ర్యాలీ నిర్వహించారు. అయితే ఈ ర్యాలీ ప్రారంభానికి ముందే ఆయన పర్యటనను నిరసిస్తూ మధ్యాహ్నానికే 93 వేల మంది సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారు. దేశ రాజధానిలో మహిళా మల్లయోధుల నిరసన ప్రదర్శనపై ఉక్కుపాదం మోపినందుకు వారంతా ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఓ రోడ్డుపై గో బ్యాక్ మోడీ అని రాసి ఉన్న ఫొటోను వారంతా విస్తృతంగా షేర్ చేశారు. 'అతిథులకు సాదర స్వాగతం పలకడం రాజస్థాన్ సంప్రదాయం. మోడీజీ...మీరు ప్రధాని పదవి గౌరవాన్ని కాపాడి ఉంటే మేము మిమ్మల్ని అదే విధంగా గౌరవించి ఉండే వారం. అయితే మీరు ఆ పదవికి, దేశానికి అప్రదిష్ట తెచ్చారు. ఈ దేశ ఆడబిడ్డలు రోదిస్తున్నారు. మీరేమో ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు' అని జాట్ యూనిటీ పేరిట ఓ ట్వీట్ కన్పించింది. మోడీకి ప్రవేశం లేదు అని రాసిన బ్యానర్ చిత్రాన్ని మరొకరు షేర్ చేశారు. 'ఇది రాజస్థాన్. మీరు గుజరాత్ అనుకుంటున్నారా?' అని ఆ బ్యానర్‌లో రాసి ఉంది. ర్యాలీని ఉద్దేశించి ప్రసంగించడానికి ముందు మోడీ పుష్కర్‌లోని బ్రహ్మదేవుని ఆలయంలో పూజలు చేశారు. విమానాశ్రయం నుంచి పుష్కర్‌కు హెలికాప్టర్‌లో వచ్చిన మోడీ, అక్కడి నుంచి మళ్లీ హెలికాప్టర్‌లోనే ర్యాలీ జరిగే ప్రదేశానికి వెళ్లారు.

ప్రతిపక్షాలు కలిస్తే బిజెపి ఓటమి ఖాయం

- ప్రత్యామ్నాయ విజన్ కూడా అవసరమే
- అమెరికా పర్యటనలో రాహుల్

శాంటాక్లారా : ప్రతిపక్షాలు సరిగా కలిస్తే బీజేపీ ఓటమి ఖాయమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. ప్రతిపక్షాల మధ్య పొత్తు కోసం తాము కృషి చేస్తున్నామనీ, తమ ప్రయత్నాలు సజావుగా సాగుతున్నాయని ఆయన అన్నారు. ఇటీవల కర్నాటకలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ సాధించిన విజయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ కాలిఫోర్నియా యూనివర్సిటీ సిలికాన్ వ్యాలీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆహుతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ బీజేపీ బలహీనతలను తాను స్పష్టంగా చూస్తున్నానని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఏకమైతే బీజేపీ పరాజయం తప్పదని చెప్పారు.

కర్నాటకలో బీజేపీతో పోరాడి కాంగ్రెస్ విజయం సాధించిందనీ, అయితే ఆ ఎన్నికలలో తాము ఉపయోగించిన అస్త్రాలు ఎవరికీ అర్థం కాలేదని రాహుల్ తెలిపారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పూర్తి భిన్నమైన వైఖరి అవలంబించిందని అన్నారు. భారత్ జోడో యాత్ర కూడా తమ విజయానికి బాటలు వేసిందని చెప్పారు. కర్నాటక ఎన్నికలలో కాంగ్రెస్ పెట్టిన ఖర్చు కంటే బీజేపీ పది రెట్లు ఎక్కువ ఖర్చు చేసిందని తెలిపారు. దేశంలో బీజేపీని ఓడించాలంటే ప్రత్యామ్నాయం అవసరమని, ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని అభిప్రాయపడ్డారు. కేవలం ప్రతిపక్షాలు ఏకమైతే సరిపోదని, ఆ పార్టీకి ఓ ప్రత్యామ్నాయ విజన్ కూడా అవసరమని రాహుల్ చెప్పారు. అందులో తొలి అడుగుగా భారత్ జోడో యాత్ర నిలుస్తుందని అన్నారు. ఈ యాత్ర పట్ల ప్రతిపక్ష పార్టీలు అసమ్మతి వ్యక్తం చేయలేదని చెప్పారు. ప్రధానమంత్రి అభ్యర్థిని కాంగ్రెస్ అధ్యక్షుడు నిర్ణయిస్తారని ఒక ప్రశ్నకు జవాబుగా రాహుల్ చెప్పారు. దేశంలో ప్రతి ఒక్క పౌరుడి అభిప్రాయాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఆయన మండిపడుతూ అది ప్రజలను భయపెడుతోందని, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని చెప్పారు. ప్రజలతో మమేకం కావడానికి అవసరమైన సాధనాలన్నింటినీ బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్‌లు తమ గుప్పెట్లో పెట్టుకున్నాయని, అందుకే పాదయాత్ర చేపట్టి ప్రజల కష్టసుఖాలు తెలుసుకున్నానని రాహుల్ అన్నారు.



బెంగాల్‌లో తృణమూల్‌ను, బిజెపిని ఓడిద్దాం

- సిపిఎం పిలుపు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో త్వరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌ను, బిజెపిని ఓడించాలని సిపిఎం పిలుపునిచ్చింది. ఈ మేరకు సందేశ్‌కాలిలో బుధవారం నాడు నిర్వహించిన ర్యాలీలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు సుజాబ్ చక్రవర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పలాష్ దాస్ పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వినాశకర విధానాల వల్ల రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తృణమూల్, బిజెపి పంచాయతీల్లో లూటీలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన ఈ రెండు పార్టీలనూ పంచాయతీ ఎన్నికల్లో ఓడించి వామపక్షాల అభ్యర్థులను గెలిపించాలని కోరారు

ఆహార ధాన్యాల నిల్వ కోసం అతి పెద్ద గోదాంల ఏర్పాటు

- ఇందుకోసం రూ. లక్ష కోట్లు ఖర్చు
- తొలుత పది జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా ఆహార ధాన్యాల నిల్వ కోసం గిడ్డంగుల సామర్థ్యాన్ని పెంచాలని కేంద్ర మంత్రి వర్గం నిర్ణయించింది. ఇందులో భాగంగా సహకార రంగంలో పెద్ద ఎత్తున గోదాములను ఏర్పాటు చేయనున్నారు. మొత్తంగా 700 లక్షల టన్నుల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ పథకం కింద రూ. లక్ష కోట్లు ఖర్చు చేయనున్నారు. వృత్తిపరమైన పద్ధతిలో ప్రణాళిక కాలపరిమితి, ఏకరీతి అమలును నిర్ధారించడానికి సహకార మంత్రిత్వ శాఖ దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎంపిక చేసిన కనీసం పది జిల్లాలలో పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తుంది. ఈ మేరకు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గ సమావేశం జరిగింది. సమావేశ అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. ' దేశంలో ప్రస్తుతం గిడ్డంగుల సామర్థ్యం 1,450 లక్షల టన్నులుగా ఉందని కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. రాబోయే ఐదేళ్లలో దాన్ని 2,150 లక్షల టన్నులకు పెంచాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. సహకార రంగంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార ధాన్యాల నిల్వ కార్యక్రమంగా దీన్ని అభివర్ణించారు. ప్రతి జిల్లాలో 2 వేల టన్నుల సామర్థ్యంతో గోదాములు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాల వృథాను తగ్గించేందుకే ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు అనురాగ్ ఠాకూర్ తెలిపారు. దేశంలో ఏటా 3,100 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు పండుతుండగా.. కేవలం 47 శాతం ఉత్పత్తులను మాత్రమే నిల్వ చేయడానికి అవకాశం ఉంటోంది.

ఢిల్లీ యూనివర్సల్ పోస్టల్ యూనియన్ ప్రాంతీయ కార్యాలయం

యూనివర్సల్ పోస్టల్ యూనియన్ ప్రాంతీయ కార్యాలయం న్యూఢిల్లీలో ఏర్పాటు చేయటానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. యుపియుతో ఒప్పందం కుదుర్చుకోవటంతో ఈ ప్రాంతంలో యుపియు అభివృద్ధి సహకారానికి, సాంకేతిక సహాయానికి దేశం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. తపాలా రంగంలోని వివిధ సంస్థలలో చురుకైన పాత్ర పోషిస్తూ త్రిముఖ సహకారానికి పాటుపడుతుందని అన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో దేశ ఉనికి అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతుందని పేర్కొన్నారు.

సిటీస్ 2.0కు ఆమోదం

సిటీ ఇన్వెస్ట్ మెంట్స్ టూ ఇన్నొవేట్, ఇంటిగ్రేట్ అండ్ సస్టెయిన్ 2.0 (సిటీస్ 2.0) కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఫ్రెంచ్ డెవలప్ మెంట్ ఏజెన్సీ క్రెడిటాన్ సాల్ట్, యూరోపియన్ యూనియన్, పట్టణ వ్యవహారాల జాతీయ సంస్థ భాగస్వామ్యంతో కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమం 2023 నుంచి 2027 వరకు నాలుగేళ్ళ పాటు నడుస్తుందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు.



రేడియో వ్యాఖ్యాతగా

నా పేరు కార్తీక. నేను అనంతపురం జిల్లా గార్లదిన్న మండలం మర్తాడు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నా. పుల్లన్న, పుష్పలత మా అమ్మానాన్నలు. ఆకాశవాణి, అనంతపురం కేంద్రం వారు మా పాఠశాలలో కదంబ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో నేను పాల్గొన్నాను. ఈ కార్యక్రమానికి నేనే వ్యాఖ్యాతను. నాకెంతో ఆనందంగా అనిపించింది. పిల్లలందరు చక్కగా పాల్గొనేలాగ ప్రయత్నించాను. ఇందుకు మా పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఉపాధ్యాయులందరి సహకారం నాకెంతో ఉంది. పదాలు ఎలా పలకాలి, వాక్యాలను ఎలా ఉచ్ఛరించాలి వంటివి తెలుసుకోగలిగాను. ఏ పదాన్ని ఎంత స్థాయిలో పలకాలి నేర్చుకున్నా. ఈ విషయమై వెంకటరమణ సార్ ఎంతో నేర్పారు. అలాగే మధుమాల మేడం, రవి సార్, వసుంధరా మేడం చక్కని సూచనలు, సలహాలు ఇచ్చారు. దాంతో మండల విద్యాధికారి శ్రీ తారాచంద్రానాయక్ గారు నన్ను ఎంతో మెచ్చుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప పనులు చేయాలని నన్ను ప్రశంసించారు. చిత్రలేఖనంలో నాకు వచ్చిన బహుమతిని విద్యాధికారి చేతుల మీదగా అందచేశారు. నా తోటి మిత్రులు నన్ను ఎంతగానో అభినందించారు. భవిష్యత్తులో బాగా చదువుకొని కలెక్టర్ కావాలనేది నా ఆశయం. పేదలకు సహాయం చేయాలనేది నా సంకల్పం.

- కార్తీక,
5వ తరగతి
ఎంపిపి పాఠశాల,
మర్తాడు మెయిన్,
గార్లదిన్న (మం), అనంతపురం.

ఫ్యాషన్



- నంద కిషోర్,
2వ తరగతి,
రవీంద్ర భారతి పబ్లిక్ స్కూలు,
విజయవాడ,
కృష్ణాజిల్లా.



- పి. త్రిషాంత్,
4వ తరగతి,
రవింద్రభారతి పబ్లిక్ స్కూలు,
విజయవాడ,
కృష్ణాజిల్లా.

రోజా

నా పేరు రోజా
తెచ్చాను కూజ
నాటాను రోజా
మొలిచింది రోజా
తలలో తురిమా రోజా
రోజా పై రోజా





- నివేదిత,
4వ తరగతి,
ఎంపిపి పాఠశాల, మర్తాడు మెయిన్,
గార్లదిన్న మండలం,
అనంతపురం.




బొమ్మలు



- నడిపల్లి అన్విత,
5వ తరగతి,
డాన్ బాస్కో స్కూల్,
నర్సీపట్నం,
అనకాపల్లి జిల్లా.







- జి. మేఘనా సాయి,
4వ తరగతి,
సైయింట్ ఆర్నోల్డ్స్ హైస్కూలు,
మేదరమెట్ల,
బాపట్ల జిల్లా.0

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

JEEVANA జీవన the family

కైఫీ యాసిడ్ దాడిలో కంటి చూపు కోల్పోయింది. చదువుకోవడమే గొప్ప అనుకునే పరిస్థితి నుంచి స్కూల్లో ఫస్ట్ క్లాస్‌లో నిలిచింది. చదువులోనే కాదు...ఏ ఇతర పోటీల్లో పాల్గొన్నా బహుమతి సాధించాల్సిందే. బాల్యం నుంచి ఐఎఎస్ కావాలని కలలు కంటోంది. ఆ పట్టుదలే వైకల్యాన్ని జయించి పదవ తరగతిలో 95.2% స్కోర్ చేసింది. తోటి విద్యార్థులకు ప్రేరణగా నిలిచింది.

కంటిచూపు లేకపోయినా...

చండీగఢ్‌లో హిసార్ గ్రామానికి చెందిన కైఫీ మూడేళ్ల వయస్సులో యాసిడ్ దాడికి గురైంది. ఊహించని ఘర్షణల మధ్య ఆ బాలికపై ముగ్గురు వ్యక్తులు యాసిడ్ బాటిల్స్ విసిరారు. దాంతో ఆమె ముఖం కాలిపోయింది. చూపు పోయింది. కైఫీ వైద్యం కోసం తల్లిదండ్రులు పవన్, సుమన్లు తిరగని ఆసుపత్రి అంటూ లేదు. కంటి చూపు వైద్యం కోసం చాలా ఖర్చు పెట్టారు. అయినా లాభం లేకపోయింది. కఫీ ఎప్పటికీ చూడలేదని చెప్పారు వైద్యులు. దాంతో తల్లిదండ్రులు నిరాశకులోనయ్యారు. కఫీ భవిష్యత్తు అంధకారం అయ్యిందని బాధపడ్డారు. ఎలాగైనా కఫీని చదివించాలని, ఆమెకు ఓ మంచి జీవితం అందించాలని నిర్ణయించుకున్నారు. అందుకు సరైన విద్యను అందించాలనుకున్నారు.



ఆమె తండ్రి చండీగఢ్‌లోని హరయాన్‌లో శాస్త్రినగర్‌కు కుటుంబాన్ని మార్చాడు. ప్రసిద్ధి చెందిన ఇన్సిట్యూట్ ఫర్ ది బ్లైండ్ సెక్టార్ స్కూల్లో కైఫీని చేర్పించారు. దృష్టిలోపంతో ఉన్న తను బ్రెయిలీ లెటర్స్‌తో చదువుకుంది. సైన్ ల్యాంగ్వేజ్‌తో చాలా పుస్తకాలు చదివింది. చదువులో కైఫీ చురుకుదనం చూసి ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రోత్సహించేవారు. తండ్రి స్థానికసెక్రటేరియట్‌లో ప్యూన్‌గా చేస్తున్నారు. వచ్చేది తక్కువ ఆదాయమైనా తనకి ఏ లోటు లేకుండా చూసుకునేవాడు. తండ్రి చూపే శ్రద్ధ, ప్రేమ ఆమెలో పట్టుదలను పెంచాయి. ఆటల పోటీల్లో గానీ, సైన్సు, పోటీ పరీక్షల్లో ఫస్ట్ ప్రైజ్ సాధించేది. చిన్నప్పటి నుంచి ఐఎఎస్ కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ దిశగా రోజులో ఆరు గంటలు చదువుకునేది. ప్రతి సంవత్సరం క్లాస్‌లో మంచి మార్కులు సాధించేది. ఈ నెల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 95.2% స్కోర్ చేసి పాఠశాల్లో టాపర్‌గా నిలిచింది.





కైఫీపై యాసిడ్ దాడిచేసిన ముగ్గురూ దోషులుగా గుర్తించారు. శిక్ష అనుభవించి బయటకు వచ్చారు. ఇవి 'నాకు అనవసరమైన విషయాలు. ఐఎఎస్ కావడమే నా లక్ష్యం' అంటున్న కైఫీ ఇప్పటి యువతరానికే కాదు ప్రతిఒక్కరికి స్ఫూర్తి.

వేసవి పానీయాలు..

వేసవిలో తరచూ డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండేందుకు ఇంట్లో ఉండే పదార్థాలు, కూరగాయాలతోనే రకరకాల పానీయాలు తయారుచేసుకోవచ్చు. అవి ఎలానో చూద్దాం..



పుల్లటి వాటర్ : ఒక గ్లాస్ నీటిలో దోసకాయ ముక్క, కొన్ని పుదీనా ఆకులు, నారింజ ముక్కలను ఉంచాలి. ఈ నీటికి పుల్లటి రుచి వస్తుంది. అలాగే విటమిన్ సి కూడా సమృద్ధిగా ఉంటుంది. ఈ ఆరోగ్యకరమైన పానీయంలో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉండటం వలన వేడి దద్దుర్ల నుండి శరీరాన్ని రక్షించుకోవచ్చు.

నిమ్మకాయ, పుదీనా : ఒక గ్లాస్ నీటిలో కొన్ని పుదీనా ఆకులు, నిమ్మ ముక్కలు ఉంచి 15 నిమిషాలు మరిగించాలి. అది చల్లారిన తర్వాత తేనే కలుపుకుని తాగాలి. ఇది వేసవి వేడి నుండి శరీరాన్ని రక్షిస్తుంది.

ఆరెంజ్ : ఆరెంజ్ నుంచి జ్యూస్ తీసి దానికి చిటికెడు ఉప్పు కలపాలి. ఈ పానీయంలో విటమిన్ సి, ఎలెక్ట్రోలైట్స్ సమృద్ధిగా ఉంటాయి.


పెరుగు : ఒక కప్పు పెరుగులో కొన్ని నీళ్ళు, జీలకర్ర, అల్లం ముక్కలు, చిటికెడు ఉప్పు వేసి పల్చని మజ్జిగ తయారుచేసుకొని తాగాలి. ఇందులో మంచి బ్యాక్టీరియా (ప్రోబయోటిక్స్) ఉంటుంది.

పుచ్చకాయ : పుచ్చకాయ జ్యూస్‌లో రెండు స్పూన్ల నిమ్మ రసం, చిటికెడు ఉప్పు కలపాలి. ఇది వేసవిలో అవసరమ్యేన అన్ని ఖనిజాలను శరీరానికి సరఫరా చేస్తుంది.

గ్రీన్ టీ : గ్రీన్ టీలో నిమ్మరసం కలిపి తాగవచ్చు. చల్లగా తాగాలనుకుంటే ఐస్ క్యూబ్స్ వేసుకోవచ్చు.

బటర్ మిల్క్ : కొంత పెరుగు తీసుకుని దానికి ఉప్పు, కొద్దిగా తేనె, స్ట్రాబెర్రీ గుజ్జు, కొన్ని ఎండిన పుదీనా ఆకులు కలుపుకుని పల్చగా తయారుచేసుకుని తాగాలి. చల్లగా ఉండేందుకు ఐస్ క్యూబ్స్ వేసుకోవచ్చు.


దోసకాయ, పుచ్చకాయ : జ్యూసర్‌లో దోసకాయ, పుచ్చకాయ ముక్కలను వేసి జ్యూస్ తీయాలి. దీనికి అర స్పూన్ తేనే, చిటికెడు ఉప్పు కలపాలి. ఇంకా కొంచెం జీలకర్ర, తాజా పుదీనా ఆకులను కూడా కలపవచ్చు. ఈ పానీయం తాగితే శరీరం డీహైడ్రేట్ బారిన పడకుండా ఉండడమే కాక అధిక చెమట పట్టకుండా ఉంటుంది.




'గుంటూరు కారం'గా మహేష్

మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'ఎస్ఎస్ఎంబీ28' చిత్ర టైటిల్ బుధవారం ప్రకటించారు. కృష్ణ జయంతి సందర్భంగా ఆయన హిట్ చిత్రాల్లో ఒకటైన 'మోసగాళ్లకు మోసగాడు' చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 4కె వెర్షన్‌లో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మాస్ స్ట్రైక్ పేరుతో అభిమానులే ఈ చిత్ర టైటిల్‌ను విడుదల చేశారు. 'గుంటూరు కారం' టైటిల్‌ను ఖరారు చేశారు. మహేశ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న మూడో చిత్రమిది. హారికా అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్ రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. పూజాహెగ్డే, శ్రీలీలా నాయికలు. 'అతడు', 'ఖలేజా' సినిమా తర్వాత త్రివిక్రమ్, మహేష్ కాంబోలో వస్తోన్న సినిమా కావడంతో ఈ సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి. దాదాపు 12 ఏళ్ల తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో ఈ చిత్రం రాబోతోంది.

హాలీవుడ్ 'చెన్నై స్టోరీ'లో సమంత




టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకస్థానం ఏర్పరచుకున్న సమంత హాలీవుడ్‌లో కూడా ఎంట్రీ ఇస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి 'చెన్నై స్టోరీ' అనే పేరు ఖరారైనట్లు సమాచారం. బాఫ్టా పురస్కార గ్రహీత ఫిలిప్ జాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. విల్ మచిన్ నిర్మాత. లండన్‌లో స్థిరపడ్డ భారతీయ మూలాలున్న ఒక ఇంగ్లీష్ యువకుడు నిఖిల్ (వివేక్ కల్రా) తన తండ్రిని వెతుక్కుంటూ చెన్నై వస్తాడు. అక్కడ తనకి అను (సమంత) పరిచయం అవుతుంది. నిఖిల్ తండ్రిని వెతకడానికి సాయం చేయడానికి ఆమె ఒప్పుకుంటుంది. తర్వాత వాళ్లిద్దరి మధ్య ఏం జరిగింది అన్న ఇతివృత్తంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. రొమాంటిక్ కామెడీగా తెరకెక్కే ఈ చిత్రంలో సమంతకి జోడీగా వివేక్ కల్రా నటించనున్నారు. ఈ సినిమా షూటింగ్ చెన్నై, బ్రిటన్‌లో ఉంటుందని తెలుస్తోంది. సమంత నటిస్తున్న తొలి ఇంగ్లిష్ చిత్రమిది. ఇంగ్లీష్, తమిళ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'.. 'హతవిధి..'

నవీన్ పోలిశెట్టి, అనుష్క జంటగా నటిస్తున్న చిత్రమే 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'. ఈ సినిమాను మహేష్‌బాబు పీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'హతవిధి' అంటూ సాగే పాటను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ పాటను రాధాన్ కంపోజ్ చేయగా.. రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించారు. తమిళ నటుడు ధనూష్ ఆలపించారు. హీరో కష్టాలను వివరిస్తూ డిజైన్ చేసిన ఈ పాటను నవీన్ పోలిశెట్టి తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేశారు. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రమోద్ వంశీ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అభినవ్ గోమటం మురళీ శర్మ తదితరులు నటించారు.



టర్కీలో ఖుషీ...ఖుషీగా

హీరోయిన్ సమంత, రౌడీబాయ్ విజయ్ దేవరకొండ కాంబినేషన్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'ఖుషీ'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ టర్కీలో జరుగుతోంది. షూటింగ్ మధ్యలో సమంత, విజయ్‌లు బయటకు వచ్చి టర్కీ వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఈ చిత్రానికి శివ నిర్వాణ దర్శకుడు. ఓ కొత్త తరహా ప్రేమ కథతో వినోదాత్మకంగా సాగే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. రోమ్-కామ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా సెప్టెంబర్‌లో రిలీజ్ కానుంది. మేకర్స్ పాన్ ఇండియా లెవల్లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

రోజూ 50 కిలోల బరువు మోసా ..



దర్శకుడు తేజ, నిర్మాత దగ్గుబాటి సురేశ్‌బాబు కుమారుడు అభిరామ్‌తో 'అహింస' సినిమా తీశారు. జూన్ 2న విడుదలకు సిద్ధమైంది. ఈ క్రమంలో అభిరామ్ మీడియాతో కొన్ని షేర్ చేసుకున్నారు. షూటింగ్‌లో భాగంగా అభిరామ్ ఓ చేతిలో గన్, మరోచేతి భుజంపై హీరోయిన్‌ను వేసుకుని పరుగెత్తినప్పుడు కిందపడటంతో గాయపడ్డాడు. దాంతో యూనిట్ అంతా 4 నెలల విరామం తీసుకోవాల్సి వచ్చింది. అయితే అభిరామ్ మాత్రం ఎలాగైనా ఆ షాట్‌ను పర్‌ఫెక్ట్‌గా పూర్తి చేయాలన్న పట్టుదలతో కొన్ని వారాలపాటు తన భుజంపై 50 కిలోల బరువుతో రన్నింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఈ ప్రాక్టీస్ సెషన్‌ను ప్రతీ రోజూ వీడియో తీసి తేజకు పంపాడు. అభిరామ్ ఫైనల్‌గా తేజ అనుకున్నట్టుగా ఆ షాట్‌ను హీరోయిన్‌తో ముగించాడు. చిత్రాన్ని ఆనంది ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై పీ కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో గీతికా హీరోయిన్‌గా నటిస్తోంది. సముద్రఖని విలన్‌గా నటిస్తున్నాడు.

ఫైనల్లో యువ హాకీ జట్టు

- భారత్-9, కొరియా-1
- ధమీ బాబీ సింగ్ హ్యాట్రిక్
- ఆసియాకప్ జూనియర్స్ హాకీ



మస్కట్(ఓమన్): ఆసియాకప్ హాకీ జూనియర్స్ ఫైనల్లోకి భారత యువ హాకీజట్టు దూసుకెళ్లింది. సలలాహ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 9-1గోల్స్ తేడాతో పటిష్ట కొరియాపై ఘన విజయం సాధించింది. తొలి రెండో క్వార్టర్లు ముగిసేసరికి 2-0 గోల్స్ ఆధిక్యతలో మాత్రమే నిలిచినా.. మూడో క్వార్టర్‌లో ఏకంగా నాలుగు గోల్స్, నాల్గో క్వార్టర్‌లో మరో మూడు గోల్స్ చేయడం విశేషం. సుమిత్ లక్రా(13వ ని.)లో డ్రిబ్లింగ్ చేసి గోల్ చేయగా.. 19వ ని.లో. అరైజిత్ సింగ్ మరో గోల్ కొట్టాడు. దీంతో తొలి అర్ధభాగం ముగిసే సరికి భారత్ 2-0తో ఆధిక్యతలో నిలిచింది. మూడో క్వార్టర్ ప్రారంభమైన 31వ ని.లోనే ధమి బాబీ సింగ్ 22 యార్డ్స్ నుంచి కొరియా గోల్ పోస్ట్‌లోకి బంతిని పంపడంతో భారత్ 3-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. అంగద్‌బీర్ సింగ్(34వ ని.), ఉత్తమ్ సింగ్(38వ ని.), ధమ్మీ బాబీసింగ్(38వ ని.)లో ఒక్కో గోల్ కొట్టారు. దీంతో భారత్ మూడో క్వార్టర్ ముగిసే సమయానికి తిరుగులేని 6-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. నాల్గో క్వార్టర్‌లో తొలుత ఇరుజట్లు ఒక్కో గోల్ కొట్టడంతో 7-1తో నిలిచాయి. ధమీ బాబీ సింగ్ 55వ ని.లో, శ్రద్ధానంద్ తివారి 57వ ని.లో గోల్స్ కొట్టారు. మలేషియా-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే రెండో సెమీస్ విజేతలో భారత జట్టు ఫైనల్లో తలపడనుంది.

మూడోరౌండ్‌కు కసట్కినా

ఓస్టాపెంకో, గార్సియా ఔట్..
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ


కసట్కినా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ రెండోరౌండ్ పోటీల్లో సంచలనాలు నమోదయ్యాయి. 5వ సీడ్, ఫ్రాన్స్‌కు చెందిన గార్సియా, 17వ సీడ్ లాత్వియాకు చెందిన ఒస్టాపెంకో అనూహ్యంగా రెండోరౌండ్‌లో నిష్క్రమించగా.. రష్యాకు చెందిన 9వ సీడ్ కసట్కినా మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన రెండోరౌండ్ పోటీలో కసట్కినా 6-3, 6-4తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన మార్కెటా వోండ్రుసోవాపై సంచలన విజయం సాధించింది. వోండ్రుస్కోవా మాజీ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ రన్నరప్. మూడోరౌండ్‌లో కసట్కినా 69వ ర్యాంకర్, అమెరికాకు చెందిన పైటన్ స్టెర్న్స్‌తో తలపడనుంది. ఇక జెలెనా ఒస్టాపెంకో 3-6, 6-1, 2-6తో అమెరికాకు చెందిన అన్‌సీడెడ్ స్టెరన్స్ చేతిలో, 5వ సీడ్ గార్సియా(ఫ్రాన్స్) 6-4, 3-6, 5-7తో బ్లింకోవా(రష్యా) చేతిలో ఓటమిపాలైంది. ఇక పురుషుల సింగిల్స్‌లో 5వ సీడ్ స్టెఫానెస్ సిట్సిపాస్(గ్రీక్) మూడోరౌండ్‌కు చేరాడు. 6-3, 7-6(7-4), 6-2తో స్పెయిన్‌కు చెందిన అన్‌సీడెడ్ బీన్‌ను, ఫోగ్నిని(ఇటలీ) 6-4, 7-6(7-5), 6-2తో కుబ్లెర్(ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు.

పురుషుల డబుల్స్‌లో యుకీ బాంబ్రీ-సాకేత్ మైనేని జోడీ 6-3, 6-2తో ఫ్రాన్స్ జోడీని ఓడించి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లారు.

రెండోరౌండ్‌కు లక్ష్యసేన్

సింధు, శ్రీకాంత్, సమీర్ ఓటమి

బ్యాంకాక్: థాయ్‌లాండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో యువ షట్లర్ లక్ష్యసేన్ రెండోరౌండ్ లోకి దూసుకెళ్లగా.. పివి సింధు, కిదాంబి శ్రీకాంత్, సమీర్ వర్మ తొలిరౌండ్‌లోనే ఓటమి పాలయ్యారు. లక్ష్యసేన్ 21-23, 21-15, 21-15తో చైనీస్ తైపీకి చెందిన వాంగ్-జు-వుయ్‌పై గెలుపొందగా.. సింధు 8-21, 21-18, 18-21తో కెనడాకు చెందిన మిఛెలి చేతిలో, ప్రియాంశు 19-21, 10-21తో టి-యంగ్ (అమెరికా) చేతిలో ఓడారు. ఇక పురుషుల డబుల్స్‌లో టాప్‌సీడ్ చిరాగ్ శెట్టి-సాత్విక్ సాయిరాజ్ జోడీ 21-13, 18-21, 21-17తో డెన్మార్క్ జోడీని చిత్తుచేసి రెండోరౌండ్‌లోకి దూసుకెళ్లింది. కిదాంబి శ్రీకాంత్ 8-21, 21-16, 14-21 తో చైనాకు చెందిన వెంగ్-హంగ్-యంగ్ చేతిలో, సమీర్ వర్మ 15-21, 15-21తో జొన్నాసెన్ (డెన్మార్క్) చేతిలో ఓడారు.

మను, సరబ్‌జ్యోత్‌కు స్వర్ణం

ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్



న్యూఢిల్లీ: ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్ మిక్స్‌డ్ ఎయిర్ పిస్టల్ విభాగంలో మను బకర్, సరబ్‌జ్యోత్ సింగ్ జోడీకు స్వర్ణ పతకం లభించింది. తుగ్లకాబాద్‌లోని కర్నీ సింగ్ రేంజ్ స్టేడియంలో బుధవారం జరిగిన మిక్స్‌డ్ పిస్టల్ విభాగంలో మను, సరబ్ జోడీ 16-2పాయింట్ల తేడాతో వరుణ్ దూబే-విభూతి భాటియాలపై విజయం సాధించారు. దీంతో క్వాలిఫికేషన్ విభాగంలో టాపర్స్‌గా నిలిచారు. వీరిద్దరూ ఛండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్శిటీ తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయ పోటీలున్న నేపథ్యంలో తీవ్ర పోటీ ఎదురైనప్పటికీ ఈ జోడీ అద్భుత విజయాన్ని అందుకొంది. ఈ విభాగంలోనే హర్దీప్ సింగ్-సిఖా నర్వాల్‌కు కాంస్య పతకం దక్కింది. వీరు కాంస్య పతక పోటీలో 4-12, 14-12తో అమన్‌దీప్ సింగ్-ప్రదీప్ కౌర్ సిధూలపై గెలిచారు. ఇక మిక్స్‌డ్ స్కీట్ ఈవెంట్‌లో పంజాబ్ యూనివర్శిటీకి చెందిన పరినాజ్ ధలివాల్-ప్రభ్ ప్రతాప్ చాహల్ 31-29తో ఛిన్నా-సుఖ్బీర్‌లపై విజయం సాధించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68